వాకిలి
గత వారం పుస్తకాలపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 81 పేజీలు: 10+4 వెల: 6.50

అంబర్ కోటను సందర్శించిన జెడి వాన్స్ ఫ్యామిలీ

పార్లమెంటే సుప్రీం: ధన్‌ఖడ్ వ్యాఖ్యల దుమారం

5లో



# కాశ్మీర్‌లో పర్యాటకులపై 'ఉగ్ర' దాడి

## అనంత్‌నాగ్ జిల్లా పహల్‌గాంవ్‌లో 27 మందిమృతి మరో 20 మందికి గాయాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 22 :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు.. ప్రముఖ టూరిస్ట్ స్పాట్ పహల్ గాంవ్ పర్యాటకులను టార్గెట్ చేస్తూ కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 27 మందికిపైగా చనిపోయారు.మరో 20 మందిపరిస్థితి విషమంగా ఉంది. జమ్ముకాశ్మీర్‌లో ఇటీవలికాలంలో జరిగిన అతిపెద్ద ఉగ్రకాల్పుల ఘటన ఇదేనని సిఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈసంఖ్య మరింతగాపెరగవచ్చని అంచనా. మృతుల్లో ఒడిశా, కర్ణాటకనుంచి వచ్చిన యాత్రీకులు కూడా ఉన్నారు. అంతేకాకుండా అమర్‌నాథ్ యాత్ర కావడంతో దేశంలోని పలు రాష్ట్రాలనుంచి వచ్చిన యాత్రీకులున్నారు. ఒడిశా, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చిన యాత్రీకులు బైసారన్‌ప్రాంతంలో ఉన్నట్లు అంచనా. మరో 20 మందికి పైగా గాయాలయ్యాయి. మొత్తం 27మంది మృతి చెందారని తెలుస్తోంది. గాయపడ్డ వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మిని స్విట్జర్లాండ్‌గా పేర్కొంటున్న పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని ఉగ్రమూకలు లక్ష్యంచేసుకున్నాయి. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి భారీగా భద్రతా బలగాలు చేరుకున్నాయి. కాల్పులు జరిపిన ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో బైసరన్‌ప్రాంతంలో ఉన్న సుమారు 40 మంది పర్యాటకులను అటవీ ప్రాంతంనుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఆ తర్వాత విచక్షణరారహితంగా >>2



మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న సిఎం చంద్రబాబు

# అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

## బిజెపి రాజ్యసభ సీటు తమిళనాడు అన్నామలైకి ఖరారు?

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి సమగ్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి రాష్ట్రం చేపట్టిన ప్రతి కార్యచరణకు కేంద్రం మద్దతుగా నిలుస్తోందన్నారు.విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో పర్యటించారు.కేంద్ర అంతరంగిక (హోమ్) శాఖ మంత్రి అమిత్‌షాను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు అమిత్‌షా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంటకుపైగానే అమిత్ షాతో చంద్రబాబు మాట్లాడారు. >>2

# కసిరెడ్డిపై సిట్ విచారణ పూర్తి

## రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరచనున్న సిట్



**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిపై సిట్ విచారణ ముగిసింది.సిట్ కార్యాలయంలో దాదాపు 12 గంటల పాటు విచారణ సాగింది. ఈ కేసుకు సంబంధించి సిట్ సేకరించిన ఆధారాలను చూపించి రాజ్ కసరెడ్డిని అధికారులు ప్రశ్నించారు. కొన్ని అంశాలు తనకు తెలియదని, సంబంధం లేదని కసిరెడ్డి చెప్పినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి నుంచి సిట్ బృందం కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. విచారణ ముగిసిన తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం రాజ్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కసిరెడ్డిని విజయవాడకోర్టులో సిట్‌అధికారులు హాజరు పర్చనున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణానికి సంబంధించి రాజ్ >>2

# నేడు టెన్త్ ఫలితాలు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను నేడు ఉదయం విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. టెన్త్ రెగ్యులర్‌తో పాటు సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్మీడియట్ ఫలితాలు కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇక, ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 6.19 లక్షల మంది విద్యార్థులు >>2

# సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ హయాంలో ముంబయి నటిపై నమోదైన అక్రమ కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులును సిఐడీ పోలీసులు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో అరెస్ట్ చేశారు. జగన్ హయాంలో పిఎస్సార్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేశారు. జగన్‌కు ఆయన అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఆంజనేయులును హైదరాబాద్ నుంచి ఎపి సిఐడి కార్యాలయానికి తరలించారు. ముంబయి నటి కేసులో ఆయన్ను సిఐడి పూర్తి స్థాయిలో విచారించనుంది.
పిఎస్ఆర్‌తో పాటు పలు కీలకపత్రాలను సిఐడి పోలీసులు వెంట తీసుకొచ్చారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న కేఆర్ సూర్యనారాయణను తుపాకితో బెదిరించారని పిఎస్ఆర్ ఆంజనేయులుపై గుంటూరు సిఐడి పిఎస్‌లో మరో కేసు నమోదయ్యింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని పిఎస్ఆర్ ఇంటి వద్ద సోమవారం సిఐడి పోలీసులు పరిశీలించారు. దీన్ని గమనించిన పిఎస్ఆర్ బేగంపేటలోని ఆయన >>2



# డిస్కంల ఆర్థిక పరిపుష్టికి సంస్కరణలు తప్పనిసరి

## కేంద్ర విద్యుత్‌మంత్రి శ్రీపాద యశోనాయిక్



మంగళవారం విజయవాడలో జరిగిన నాలుగు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో కేంద్రమంత్రి శ్రీపాద యశో నాయిక్

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ నోవాటెల్ హోటల్లో విద్యుత్ రంగ సంస్కరణలపై వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యుత్‌శాఖ మంత్రుల నాలుగవ సమావేశం మంగళవారం విజయవాడలోని ఓ సభా ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యస్సో నాయిక్ అధ్యక్షత వహించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి విద్యుత్ శాఖ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.
రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిస్కంలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, సుస్థిరాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగంలో కీలక సంస్కరణల అమలుకు నాంది పలికినట్లు స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యస్సో నాయిక్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థితి, యాజమాన్య, నిర్వహణ సమస్యలను అధిగమించడానికి సమన్వయంతో సంస్కరణలు చేపట్టడం ఆవశ్యకమని అన్నారు. దీనికోసం రెగ్యులేటరీ సంస్కరణలు, రుణ పునఃరూపకల్పన, పునరుత్పాదక విద్యుత్‌ఇంటిగ్రేషన్, విద్యుత్ స్టోరేజి పరిష్కారాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి విద్యుత్ పంపిణీ వ్యవస్థల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ >>2

# ద్వితీయ విఘ్నం అధిగమించిన ఇస్రో

## అంతరిక్షంలో రెండోసారి ఉపగ్రహాల అనుసంధానం

**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** అంతరిక్షంలో రెండోసారి స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానం విజయవంతంగా పూర్తయింది. ఇస్రో శాస్త్రవేత్తలు భూకేంద్రాల నుంచి ఈ ఉపగ్రహాలను ఒకచోటికి చేర్చారు. గతంలో ఇటువంటి డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియను సక్సెస్ చేసిన శాస్త్రవేత్తలు మళ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. పవర్ ట్రాన్స్ ఫర్ కూడా ఈ ప్రక్రియలో విజయవంతంగా నిర్వహించారు. రెండవ ప్రదర్శన అనంతరం కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇస్రో శాస్త్రవేత్తలను, ప్రత్యేకించి ఛైర్మన్ వి.నారాయణన్‌ను అభినందించారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పిఎస్ఎల్వి-సి60 రాకెట్ ద్వారా డిసెంబర్ 30న రెండు స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో వాటిని కొంచెం దూరంగా విడిచిపెట్టి అనంతరం దగ్గరకుచేర్చే ప్రక్రియ అనుసంధానాన్ని విజయవంతం చేసింది.
జనవరి 16న ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఆ తర్వాత మార్చి 13న దగ్గరగా ఉన్న ఉపగ్రహాలను మళ్లీ దూరం జరిపారు. ప్రస్తుతం రాబోయే రెండు వారాల్లో మరిన్ని కీలక ప్రయోగాలను భూకేంద్రాల నుంచి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కేంద్ర యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్స్ డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

# విపత్తు నిర్వహణకు ముందస్తు ప్రణాళిక

## హోం మంత్రి అనిత ఆదేశాలు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** వడదెబ్బ కారణంగా ఏ ఒక్క ప్రాణం పోకూడదు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరివల్లే ఎపికి విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోంమంత్రి అనిత సమీక్షను నిర్వహించారు. వడగాల్పులు, రాబోయే వర్షాకాలానికి సంసిద్ధతపై ఈ సమీక్షలో హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ వాతావరణ మార్పులకు తగ్గట్లు అధికార యంత్రాంగంసంసిద్ధంగా ఉండాలి. ప్రణాళికతో సమయం నిర్దేశించుకుని ముందు కెళ్లాలి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశంఉంది. గతేడాది నంద్యాలలోని గోస్పాడులో అత్యధికంగా 47.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉన్నట్లు సీడీఎంఏ డైరెక్టర్ సంపత్ మంత్రికి తెలిపారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళుతున్నట్లు సిడిఎంఎ డైరెక్టర్ సంపత్‌తెలిపారు,.రాబోయే రోజుల్లో వడగాల్పులకు గల అవకాశాలపై హోంమంత్రి ఆరాతీసారు.సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటి నిల్వ చేసినట్లు తెలిపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు92 మండలాలను ముందస్తుగా గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పాఠశాలల్లో నీటితో పాటు, ఎన్జీవో,విరాళాల ద్వారా మజ్జిగ పంపిణీకి ఏర్పాటు చేశామన్నారు. వడగాల్పుల ద్వారా వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం 5,145 పడకలను, 768 అంబులెన్సులు, సిద్ధం >>2







మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌తో చంద్రబాబు భేటీ దృశ్యం

# కేంద్ర న్యాయశాఖ మంత్రితో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. కర్నూలులో ఏపీ హైకోర్టు బెంచ్ అంశంపై కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో అమరావతి రాజధానిని అత్యాధునికంగా అభివృద్ధి చేసే క్రమంలో నూతన హైకోర్టు భవనాల నిర్మాణం,డిజైనింగ్ తదితరాంశాలపై సీఎం,కేంద్రమంత్రి మధ్య ప్రస్తావనకు వచ్చింది. కర్నూలు ప్రాంతంలో న్యాయవిశ్వవిద్యాలయం గురించి చర్చించారు.ఈ సందర్భంలోనే ఒక ఆసక్తిర సంఘటన చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి ఇంటి లోపల హాలులో అందమైన సైకిల్ బొమ్మను ఎంపీ అప్పలనాయుడు గమనించారు. ఈ సమయంలో తమ తెలుగుదేశం పార్టీ సింబల్‌ను చూసి సంతోషంతో, చంద్రబాబు సమక్షంలోనే మంత్రితో ఉత్సాహంగా ఈ విధంగా అన్నారు, "సార్, మీ ఇంటి హాల్‌లో మా పార్టీ సింబల్ అయిన సైకిల్ బొమ్మ పెట్టుకున్నందుకు ధన్యవాదాలు!" అని సరదాగా వ్యాఖ్యానించి అందరినీ నవ్వించారు.అప్పుడు రామ్మోహన్ నాయుడు ఒక ఆసక్తికరమైన విషయం వెల్లడించారు. "అప్పలనాయుడు, మీకు తెలుసా? మేఘ్‌వాల్ ఒకప్పుడు పార్లమెంటుకు సైకిల్‌పైనే వెళ్లే వారు!" అని చెప్పారు. ఈ మాట వినగానే సీఎం చంద్రబాబు ఎంపీ అప్పలనాయుడు పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. "అవును, మీరు చెప్పింది నిజమే! మన అప్పలనాయుడు కూడా తన ప్రమాణ స్వీకారం రోజు నుంచి ఈ రోజు వరకు సైకిల్‌పైనే పార్లమెంటుకు వెళ్తున్నారు. కాలుష్య నియంత్రణ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందనీయం. అప్పలనాయుడు ఒక నిజమైన సమాజ సేవకుడు!" అని ప్రశంసించారు. ఈ మాటలు అక్కడున్న వారందరినీ ఆలోచింపజేశాయి. మే 2న ప్రధాని మోడీ అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అమిత్ షాతో చంద్రబాబు చర్చించనున్నారు.

## కేంద్ర జల్‌శక్తి మంత్రితో చంద్రబాబు చర్చలు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీలో సిఎం చంద్రబాబు పర్యటిస్తున్నారు. అట్లాంటా నుంచి ఢిల్లీ సోమవారం అర్ధరాత్రి కుటుంబసభ్యులతో కలిసి ఆయన ఢిల్లీ చేరుకున్నారు.రాత్రి ఆయన కుటుంబసభ్యులతో కలిసి తమకు కేటాయించిన నివాసంలో బసచేసారు.మంగళవారం ఉదయం నుంచి రాష్ట్ర సమస్యలపై పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఢిల్లీలో తొలుత కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ క్రమంలో బనకచర్ల, పోలవరం ప్రాజెక్టులపై చర్చించారు.ఈ ప్రాజెక్టు నిర్మాణాలవలన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సాగు,మంచినీరు సమస్య తీరుతుందని చంద్రబాబుకేంద్రమంత్రి పాటిల్‌కి వివరించారు.

# కసిరెడ్డిపై సిట్ విచారణ పూర్తి

>> కసిరెడ్డి కీలక సూత్రధారిగా సిట్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పలుమార్లు రాజ్‌కు నోటీసులు ఇచ్చినప్పటికీ దుమ్మాకొట్టేశారు. సిట్ అధికారులకు సహకరించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అతడిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో నిన్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కసిరెడ్డిని అరెస్ట్ చేశారు పోలీసులు. రాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈరోజు తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కసిరెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. మద్యం కుంభకోణానికి సంబంధించి వివిధ రూపాల్లో రాజ్‌ను విచారించారు. విచారణలో భాగంగా సాంకేతికపరమైన అంశాలతో పాటు మద్యం లావాదేవీలపై కూడా, డిస్టిలరీ కంపెనీలకు అనుమతులు ఏ విధంగా ఇచ్చారు అనే దానిపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఈ కేసులో పలువురి వద్ద నుంచి సేకరించిన స్టేట్‌మెంట్లను కసిరెడ్డి ముందు ఉంచి విచారించారు సిట్ అధికారులు. కొన్ని అంశాలను చేసినట్టు కసిరెడ్డి ఒప్పుకున్నప్పటికీ మరికొన్నింటిలో తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మరికొంత మంది నుంచి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా మరికొన్ని ప్రశ్నలు సంధించినప్పటికీ కసిరెడ్డి తనకు తెలియదు అనే సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మరోసారి ఈరోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో విడతగా విచారణ జరిపారు. పదే పదే అనేక అంశాలు ప్రస్తావించినప్పటికీ కూడా కసిరెడ్డి పూర్తి స్థాయిలో సమాధానం ఇవ్వనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురి వద్ద నుంచి సేకరించిన స్టేట్‌మెంట్లను కసిరెడ్డి ముందు ఉంచి విచారించారు సిట్ అధికారులు.

# మరో 3వేలు పెరిగిన పసిడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారత్‌లో బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇదంతా ట్రంప్ సుంకాల ప్రభావమేనని తెలుస్తోంది. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు సవరణ ఫలితాలు కూడా బులియన్‌పై ప్రభావంచూపుతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులన్నింటినీ విత్‌డ్రాచేసి బులియన్‌పైనే పెడుతుండటంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. సోమవారం సాయంత్రం దేశ చరిత్రలో తొలిసారి లక్ష రూపాయిలు దాటిన పదిగ్రాముల మేలిమి పసిడిధరలు తాజాగా మరో మూడువేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి రూ.1.03,016కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారంధర 31.10 గ్రాములు బరువున్న బంగారం 3467 డాలర్లకు చేరింది. ఇక మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజిలో కూడా పదిగ్రాముల పసిడి ధర లక్షరూపాయలకు చేరువయింది. నాలుగోట్రేడింగ్ సెషన్‌లోకూడా పసిడిధర పెరిగింది. జూన్‌నెల కాంట్రాక్టుధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1899 పెరిగి రూ.99,178కి చేరుకున్నది. ఆ తర్వాత రూ.98,880కిత్గింది. ఆగస్టు కాంట్రాక్టుధర రూ.99,800వద్దకొనసాగుతుండగా అక్టోబరు కాంట్రాక్టు గోల్డ్ మాత్రం ఏకంగా రూ.3వేలు పెరిగి లక్ష మార్కును దాటేసింది. పదిగ్రాములు 24 కేరట్ల బంగారంపై 3 వేలు పెరిగితే 22 కేరట్ల బంగారంపై 2750వరకూ పెరిగింది. సహజంగా అక్షయతృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీ. కానీ బంగారంధరలు రికార్డుస్థాయికి పెరగడంతో బయ్యర్లు వెనకడుగువేస్తున్నారు. బంగారం వర్తకుల్లోకూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆమేర అమ్మకాలపై కొంతమేర ప్రభావంపడే అవకాశం ఉందని నిపుణుల అంచనా. వడ్డీరేట్లుసవరణ వల్లనేకాకుండా ఇటీవల ఫెడ్‌రిజర్వు జెరోమ్‌పావెల్ ట్రంప్ విధిస్తున్న సుంకాలపై తీవ్ర వ్యాఖ్యలుచేసారు. ఈ సుంకాల విధింపు, ట్రేడ్‌వార్‌లు అమెరికా ఆర్థికవ్యవస్థ పతనానికి దారితీస్తాయని, భవిష్యత్తులో మరింత చిక్కులను ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారుకూడా. భవిష్యత్తులో మరింతగాపెట్టుబడులు విత్‌డ్రా అవుతాయని,దీనివల్ల అనేక పరిశ్రమలు కూడా దారిమళ్లే ప్రమాదం లేకపోలేదని కూడా అమెరికాకు హెచ్చరికలుజారీచేసారు. దీనితో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల భద్రతకోసం అమెరికా పెట్టుబడులన్నింటినీ ఇతర మార్గాలకు మళ్లించారు. వీటిలో సురక్షిత మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. అందువల్లనే భారీ పెట్టుబడులు రావడంతో పసిడిధరలు కూడా చరిత్రలోనే కనీవినీ ఎరుగని స్థాయికి పెరిగిపోయాయి.



కాల్పులు జరిగిన ప్రాంతంలో భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

# పర్యాటకులపై 'ఉగ్ర' దాడి

>> కాల్పులు జరిపారు. పహల్‌గామ్‌లో అమర్‌నాథ్ యాత్రికుల బేస్ క్యాంప్ ఉంటుంది. ఇప్పటికే అమర్‌నాథ్ యాత్ర కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యింది. ఇదే సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడ్డ ఓ మహిళా టూరిస్ట్ సమాచారం ఇవ్వడంతో కాల్పుల ఘటన గురించి అధికారులకు సమాచారందింది. ఉగ్రవాదుల కాల్పుల్లో పర్యాటకులతో పాటు స్థానికులకు కూడా గాయాలైనట్లు తెలుస్తోంది.అయితే ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. జమ్ముకశ్మీర్ లోని కొన్ని ప్రాంతాల్లో అసలు ఉగ్రవాదుల జాడ ఉండదు. పహల్‌గాం కూడా అలాంటి ఒకటి. ఇక్కడికి దేశ విదేశాల నుంచి టూరిస్టులు తరలివస్తుంటారు.మార్చిలో భారీగా మంచు కురియడంతో ఆ ప్రాంతానికి భారీగా టూరిస్టులు తరలివచ్చారు. ట్రెక్కింగ్ వెళ్లిన టూరిస్టులను టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. పహల్గాం ఆసుపత్రిలో తొమ్మిది మంది బాధితులు చేరారు. 38 రోజులపాటు కొనసాగే అమర్‌నాథ్‌యాత్ర జులై 3నుంచి ప్రారంభం కానున్నది. దేశవ్యాప్తంగా లక్షలమంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్లమేర ఉండగా 14కిలోమీటర్ల మార్గం గండేర్బాల్ జిల్లామీదుగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి దిగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కాల్పుల శబ్దాలు వినిపించడంతో వెంటనే భద్రతా బలగాలు ఆప్రాంతానికి చేరుకున్నాయి. గాయపడిన వారిని హెలికాప్టర్‌ద్వారా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు విదేశీయులుకూడా ఉన్నారు.పహల్‌గామ్ సంఘటనపై ప్రధానిమోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు. అందుకు భారీ మూల్యం తప్పదని, ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా తీవ్రంగా అణిచివేస్తామని ప్రకటించారు. నిందితులను చట్టంముందు తీసుకురాక తప్పదని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే శ్రీనగర్‌కువెళ్లి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించడంతో అమిత్‌షా ప్రత్యేక విమానంలో శ్రీనగర్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. అమాయక పౌరులను టార్గెట్‌ చేసుకుని వారిపై కాల్పులు జరపడం ఎంతమాత్రం తగదని యాత్రీకులే లక్ష్యంగా దాడులుచేయడం క్షమించరాని నేరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢసంతాపం తెలిపారు. జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెంటనే సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని అక్కడి అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉంటే కర్ణాటక ప్రభుత్వం ఒక పోలీస్ అధికారుల బృందాన్ని పహల్‌గామ్‌కు పంపించి కాల్పుల్లో మృతిచెందిన కర్ణాటక యాత్రీకులను తీసుకువచ్చేందుకు పంపించింది. లోక్‌సభలో విపక్షనేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీతోపాటు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేలు కూడా ఈ కాల్పుల ఘటనను తీవ్రంగా ఖండించారు.

# అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ

>> వచ్చే నెల2న ప్రధాని ఎపి రాజధాని అమరావతికి రానున్న నేపథ్యంలో చేస్తున్న ముమ్మర ఏర్పాట్లు, బందోబస్తు,అవసరాన్ని రోడ్‌షోకు సంబంధించిన అంశాలు వివరించారు. ఎపి నుంచి రాజ్యసభకు జరుగనున్న ఎన్నికలల్లో ఎన్‌డిఎ కూటమి తరపున బిజెపి అభ్యర్ధిని నిలబెట్టే అంశంపై కుడా అమిత్‌షా చంద్రబాబుతో మాట్లాడినట్లు సమాచారం తమిళనాడుకు చెందిన అన్నామలైను ఎపి నుంచి అసెంబ్లీకి పోటీ పెట్టాలనే అంశంపై సిఎం, అమిత్‌షా మధ్య కీలక చర్చ వచ్చిందంటున్నారు.ఇందుకు కూటమి సమిష్టి నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి వారు వచ్చారంటున్నారు.అమిత్‌షాతో సిఎం చంద్రబాబు ఎపి అభివృద్ధికి ఎన్నికల్లో నిర్దేశించిన 10 సూత్రాలకు అనుగుణంగా అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలకు సహకారం విభజన హామీలకు అనుగుణంగా నిధుల విడుదల,అమరావతికి మరిన్ని నిధుల విడుదల చేయడం ద్వారా నిర్మాణానికి అండ.అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరానికి నిధులు కేటాయింపు తదితరంశాలపై వినతిపత్రం ఇచ్చారంటున్నారు. అమిత్‌షా నుంచి సిఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు. ఆయనకు శ్రీవెంకటేశ్వరుని ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు అనంతరం మీడియాతో సిఎం చంద్రబాబు మాట్లాడారు..రాజధాని నగరం అమరావతి, పోలవరం ప్రాజెక్ట్.విశాఖ స్టీల్స్ తదితరంశాల్లో కేంద్రం మంచి సాయం అందిస్తుందన్నారు.ఇక తాజా ఆర్ధిక ప్రణాళికలోను ఎపికి భారీగానే నిధులు కేటాయించారు. వికసిత్ భారత్ 2047 గమ్యాన్ని చేరుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. బడ్జెట్‌లో ఎపికి కేటాయింపులు చూస్తే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన ఆక్సిజన్‌లా ఉంది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2025-26 బడ్జెట్, ఎపికి కేంద్రం అందిస్తున్న సాయాన్ని వివరించారు. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎపికి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి వినూత్నమైన పాలసీలతో మోడీ ప్రభుత్వం ముందుకెళుతోంది. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని తెలుగుకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని బడ్జెట్ తొలి వ్యాఖ్యాల్లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు కేటాయించబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో రూ. 5,936 కోట్లు కేటాయించింది. విశాఖ స్టీల్‌ను ఆదుకునేందుకు బడ్జెట్‌కు ముందే కేంద్రం రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ బడ్జెట్ లో రూ. 3,295 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, విశాఖచెన్నై కారిడార్ కు రూ.285 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు ప్రకటించారు. గత విధ్వంస పాలనతో అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కుపోయింది. విభజనతోనే కాదు... గత ప్రభుత్వ విధ్వంసంతో ఎపి దెబ్బతింది. సంపద దోచుకునేవాళ్లు కాదు... పంచేవాళ్లు కావాలి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాము.10నెలల్లో దగ్గర రూ. లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకెళుతున్నాము. దావోస్ పర్యటన విజయవంతమైంది. పలు అంతర్జాతీయ పరిశ్రమలు ఎపికి రాబోతున్నాయి. ఉద్యో, ఉపాధి కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ప్రజలకు అందిస్తున్నాము. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, అగ్రికల్చర్, జీరో పావర్టీ, ఎంఎస్ఎంఇల విషయంలో కేంద్రం ఆలోచనలకు తగ్గట్టు ఎపి అనుసరిస్తోంది. కొందరు రాజకీయ లబ్ధి కోసం బడ్జెట్‌లో ఎపికి చేసిన కేటాయింపులపై విమర్శలు చేస్తున్నారు. బడ్జెట్‌లో ఎపి పేరు ప్రస్తావనపై మాట్లాడుతున్నారు. కేంద్రం మన రాష్ట్రానికి నిధులు కేటాయించి ఆదుకోవడం ముఖ్యం కానీ ప్రతిసారీ పేరు చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్రం ఇచ్చే చేయూతతో దేశంలోనే ఎపిని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం.ఢిల్లీ మన రాజధాని. మనందరి ఆత్మ గౌరవం. మన దేశానికి వచ్చే విదేశీయులు ముందుగా వచ్చేది ఢిల్లీకే. గత పదేళ్లుగా పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రపంచంలోనే అత్యధిక వెదర్ పొల్యూషన్, పొలిటికల్ పొల్యూషన్ ఢిల్లీలోనే ఉంది. చేసిన పనులు ఫలితాలు ఇవ్వకపోవడంతో కేజ్రీవాల్ ఏవేవో చెప్పి ప్రజల్ని పొల్యూట్ చేయాలని చూస్తున్నారు. ఢిల్లీ గల్లీల్లో మురికినీరు, మంచినీరు కలిసిపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. యమునా నది మొత్తంగా కలుషితమైంది. వాయు కాలుష్యం అయితే భరించలేని స్థితిలో ఉంది. ఢిల్లీకి ఎవరూ వచ్చేందుకు ఇష్టపడటం లేదు. బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం కనుక ప్రజలు ఆప్‌ఆద్మీకి అధికారం అందించారన్నారు.ప్రధాని మోడీ సహకారంతో ఈ నగరం అత్యంత అభివృద్ధి సాధిస్తుందన్నారుజ సీఎం చంద్రబాబు అన్నారు. రెండు నెలల బిజెపి పాలనలో ఢిల్లీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబుతో పాటుకంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి ఎంపీలు పాల్గొన్నారు.

# టెన్త్ ఫలితాలు

>> హాజరయ్యారు. విద్యార్థులు తమ ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. అలాగే మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా కూడా తెలుసుకోవచ్చు.దీనికోసం ముందుగా ఈ నెంబర్ మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్ ఓపెన్ చేసి ఈ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే మీకు సర్వీసెస్ ఎంపిక చేసుకోమని వస్తుంది. అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ క్లిక్ చేస్తే పదో తరగతి ఫలితాల లింక్ కన్పిస్తుంది. ఇది క్లిక్ చేసి మీ పుట్టిన తేదీ, హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే, ఫలితాలు పీడీఎఫ్ రూపంలో వస్తాయి.

## వారం - వర్జ్యం

తేది : 23-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.దశమి సా.4.37
ధనిష్ఠ మ.12.03
వర్జ్యం సా.6.52-8.22
దు.ఉ.11.41-మ.12.31
శుభసమయం : ఉ.9.30-10.15,సా.5.00-6.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాంచారం అందుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృషభం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురువుతాయి.

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**కర్కాటకం :** ఆర్ధిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు. శుభవార్తలు వింటారు.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కారించు కుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు.

**కన్య:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. భూ వివాదాలు తీరి ఊరట చెందుతారు.

**తుల:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** ఆర్ధిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. మిత్రులని కలిసి కీలక సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**మకరం:** సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. జీవితభాగస్వామి నుండి ధన లాభం పొందుతారు.

**కుంభం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు.

**మీనం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ముందస్తు ప్రణాళిక

>> చేయడమే కాకుండా వైద్యులకు తగు శిక్షణనిచ్చి అప్రమత్తంగా ఉంచినట్లు వైద్యశాఖ అధికారి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 నగరాలలో వడగాల్పుల అప్రమత్తత దిశగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. వడాల్పులతో మృతి చెందిన వారికి రూ.4 లక్షల పరిహారంముందస్తు వర్షాలు వస్తే జలవనరుల శాఖ అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి అనిత. ప్రజా క్షేమం కోసం అధికారులంతా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో డ్రైనేజ్ వ్యవస్థ, వంతెనలు, ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడమే విపత్తులకు కారణమన్నారు. గ్రామస్థాయిలో ఆపదమిత్రలను సంసిద్ధంగా ఉంచాలని ఎస్టీఆర్ఎఫ్, ఫైర్ విభాగానికి ఆదేశాలు జారీచేశారు. ప్రమాదాలు సంభవించినపుడు గోల్డెన్ అవర్‌లో వీలైనన్ని ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రాణాలు కాపాడడం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ విభాగాలకు ఆర్థిక సాయం పెంపుపై చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి, ఏపీఎస్డీఎంఎ ఎండీ రోణంకి కూర్మనాథ్, కార్మిక శాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఎ) పి.సంపత్, అగ్నిమాపక సంస్థ ఆర్ఎఫ్ఓ జిలాని, ఏపీఎస్డీఆర్ఎఫ్ ఐజీ రాజకుమారి, ఎన్టీఆర్ కమిషనరేట్ డిసిపి కెజివి సరిత, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్పొరేషన్ ఇడి నాగరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

**టిడిపి ప్రభుత్వంలో ఏ అధికారి ఇబ్బంది పడలేదు**

టిడిపి ప్రభుత్వంలో ఏ అధికారి ఇబ్బంది పడలేదని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. తాము కూడా చాలా సందర్భాల్లో ప్రతిపక్షంలో ఉన్నామని అప్పుడు కూడా తమపై కేసులు నమోదయ్యాయని చెప్పారు. తమవల్ల ఏ ఆఫీసర్ కూడా ఇబ్బంది పడిన పరిస్థితి లేదన్నారు. తప్పుడు పనులు చేయడం వల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ నేపథ్యంలో విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. తప్పుచేసిన వారికి శిక్షపడాలనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.సాక్ష్యాలు లేకుండా పోలీసులు ఏ కేసులోనూ ముందుకెళ్లడం లేదు. వారిని పారదర్శకంగానే శిక్షిస్తున్నాం. గతప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రితో శభాష్ అనిపించుకోవటానికి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించిన అధికారులు ఇప్పుడు న్యాయస్థానాన్ని ఎదుర్కోవాల్సిందే. గత ప్రభుత్వంలో తప్పుచేసిన వారి పట్ల చట్టపరంగానే వెళ్తున్నాం. వారి సర్కార్‌లో పనిచేసిన ఆఫీసర్‌ల అరెస్ట్‌లపై వైఎస్సార్సీపీ ఆత్మవిమర్శ చేసుకోవాలి. జగన్ వల్ల గతంలో శ్రీలక్ష్మివంటి అధికారులు జైలుకు కూడా వెళ్లారు టిడిపి సర్కార్‌లో పనిచేసిన అధికారులు ఏనాడూ ఇబ్బంది పడలేదని అనిత వివరించారు. అక్రమ కేసులతో నాయకులు బలయ్యారేకానీ అధికారుల అరెస్ట్ జరగలేదని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం తప్పుచేయలేదనడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. జగన్ నాలుగు గోడల మధ్య కాకుండా జనంలోకి వచ్చి అక్రమ కేసులు లాంటి మాటలు మాట్లాడితే ప్రజలే సరైన సమాధానం చెప్తారన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల విజ్ఞాపన మేరకే డోర్ డెలివరీ హత్య కేసులో పునర్ విచారణ జరుగుతోందని అనిత స్పష్టం చేశారు.

# సంస్కరణలు తప్పనిసరి

>> కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా టారిఫ్‌ల సమీక్ష తోపాటు ఎపిటిఇఎల్ లాంటి సంస్థలను శక్తివంతం చేయడం, టారిఫ్ ఆర్డర్లు, నెట్ మీటరింగ్ విధానాలను సరళీకృతం చేయడం లాంటి చర్యలను చేపట్టడం ద్వారా డిస్కంలను నష్టాల బారి నుంచి గట్టెక్కించవచ్చని సూచించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ విస్తరణకు రూపొందించాలని పేర్కొన్నారు. స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలని పేర్కొన్నారు. రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరా లాల్ నగర్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా 202526 నాటికి 36,700 మెగావాట్ల రూఫ్ టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే 77 లక్షల మందికి పైగా వినియోగదారులకు నెలకు 150 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

మహారాష్ట్ర మంత్రి మేఘన సకోరే బోర్డికర్ మాట్లాడుతూ మహావితరణ సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు స్థిరమైన పరిష్కారాలకు మద్దతు ఇవ్వడానికి మహారాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఉత్తరప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి అరవింద్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ కు తగిన విద్యుత్ పంపిణి వ్యవస్థను నిర్మించాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరమని ఇందుకు తక్కువ వడ్డీరేట్లతో ఋణం అవసరమని పేర్కొన్నారు. అధిక ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని, బొగ్గు కేటాయింపులను ఆచరణాత్మక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ రంగానికి అవసరమైన ఆర్థిక స్థిరత్వం కోసం వ్యయాధారిత టారిఫ్ విధానం అనివార్యమని స్పష్టం చేశారు. అదే విధంగా ఆర్థిక భారం తగ్గించేందుకు డిస్కంలు చేసిన అప్పులపై వడ్డీ రేట్లు తగ్గించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీసీఎల్ (మధ్యప్రదేశ్) ఎండీ అవినాష్ లావానియా, ఎఐడిఎ (ఆల్ ఇండియా డిస్కమ్స్ అసోషియేషన్) మరియు మాజీ ఇంధన శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వం డీజీ అలోక్ కుమార్, కేంద్ర ఇంధన శాఖ సంచాలకులు ప్రణవ్ తయల్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలీ షా, ప్రైవేట్ కార్యదర్శి మహేశ్ జివాడే, జేఎస్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ . శశాంక్ మిశ్రా, ఏపీ ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చేకూరి, ఎపి సిపిడిసిఎల్ సిఎండి ఏకేవీ భాస్కర్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, తదితరలు పాల్గొన్నారు.

**విద్యుత్ రంగం బలోపేతానికి తక్షణ ఆర్థిక సాయం అవసరం**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం బలోపేతానికి ఆర్థికంగా సాయం చేయాలని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కేంద్రాన్ని కోరారు. విద్యుత్ శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యస్సో నాయక్ కు మెమోరాండాన్ని అందజేశారు. ఎపి పెద్ద ఎత్తున పునరుత్పాదక విద్యుత్ ను ప్రోత్సహిస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తున్న పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాల కోసం గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టుకు తక్షణ ఆర్థిక సాయం కేంద్రం అందించాలని కోరారు. జాతీయ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌కు సమర్థవంతంగా కలిపేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఎంతో కీలకమని కేంద్ర మంత్రికి మంత్రి గొట్టిపాటి వివరించారు. అంతేగాకుండా రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ మేనేజ్మెంట్ జోన్ ఏర్పాటు కోసం సమగ్ర ఆర్థిక, సాంకేతిక సహకారం అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా మెరుగుపరచవచ్చని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఎన్.పీ కుంట సోలార్ పార్క్ నుంచి ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక విద్యుత్‌పై జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ ఛార్జీల నుండి మినహాయించాలని కేంద్ర మంత్రి నాయక్‌కు మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ఈ పార్క్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్.. వినియోగదారులకు అందుబాటు ధరలో ఉండాలంటే మినహాయింపు అత్యంత అవసరమని మంత్రి గొట్టిపాటి వివరించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్న వివిధ అంశాలపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

# ఆంజనేయులు అరెస్టు

>>వియ్యంకుడి ఇంటికెళ్లారు. ఉదయం 5 గంటలకు ఆంజనేయులును సిఐడి అరెస్టు చేసింది. అక్కడి నుంచి మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు పిఎస్ఆర్‌ను తీసుకెళ్లి సోదాలు నిర్వహించారు. తదనంతరం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సీతారామాంజనేయులును ఏపీకి తరలించారు. ఈ కేసులో ఆయన్ని పూర్తి స్థాయిలో సీఐడీ విచారించనుంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేశారు. విజయవాడ మాజీ సిపి కాంతిరాణాటాటా, ఐపిఎస్ విశాల్ గున్నితో పాటు ఆంజనేయులు సస్పెన్షన్‌లో ఉన్నారు.

**సస్పెండ్ అయినా వారితోనే దోస్తీ:**

సస్పెన్షన్‌లో ఉన్నా వైఎస్సార్సీ అంటకాగుతున్నారని ఆంజనేయులుపై ఆరోపణలున్నాయి. జగన్ పాలనలో జరిగిన కుంభకోణాల్లో నిందితులు తప్పించుకునే విధంగా పిఎస్సార్ సలహాలు ఇస్తున్నారనే ప్రచారం పోలీసు శాఖలోనే బలంగా వినిపిస్తోంది. వైఎస్సార్సీ ప్రభుత్వ అక్రమాల నిందితులు నోటీసులకు ఎలా సమాధానం ఇవ్వాలి, విచారణ నుంచి ఎలా తప్పించుకోవాలి, పరారీలో ఉంటే ఆచూకీ దొరక్కుండా ఎలా జాగ్రత్తపడాలి లాంటి సలహాలు, సూచనలు ఇస్తూ ఆంజనేయులు తన స్వామిభక్తి చాటుకుంటూ వస్తున్నారని ఇటీవల పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. ఈ తప్పుడు కేసులో తనతోపాటు తన తల్లిదండ్రులను జైలు పాల్జేశారని ముంబయి నటి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసులపై, కుక్కల విద్యాసాగర్‌పై 2024 ఆగస్టులో ఫిర్యాదు చేశారు. నటి ఫిర్యాదుపై విద్యాసాగర్‌తో పాటు ముగ్గురు ఐపిఎస్‌లపై విజయవాడలో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఏ1గా విద్యాసాగర్, ఏ2గా పి. సీతారామాంజనేయులు (పిఎస్ఆర్), ఏ3గా కాంతిరాణా, ఏ4గా వెస్ట్‌జోన్ పూర్వ ఎసిపి హనుమంతురావు, ఏ5గా ఇబ్రహీంపట్నం పూర్వ సిఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్‌గున్నీ పేర్లను పోలీసులు చేర్చారు. విద్యాసాగర్‌తో అధికారులు పి. సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ వైస్సార్సీ నేత కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై కాదంబరీ జెత్వానీని అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. తన ఆస్తిపై జత్వానీ తప్పుడు ఒప్పంద పత్రాన్ని సృష్టించి, ఇతరులకు విక్రయించినట్లు 2024 ఫిబ్రవరి 2న ఇబ్రహీంపట్నం ఠాణాలో విద్యాసాగర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు పెట్టారు. అయితే ఈ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అంతా సీతారామాంజనేయులుగా తేలింది. ముఖ్య నేత చెప్పగానే రంగంలోకి దిగిన పిఎస్ఆర్, కాదంబరిపై ఏ కేసు పెట్టాలి, ఎలా అరెస్టు చేయాలి, ఎవరెవరిని భాగస్వాములను చేయాలో ఆయనే చూసుకున్నారు. దీంతో పీఎస్ఆర్‌తో పాటు కాంతిరాణా, విశాల్ గున్నీ, స్థానిక దర్యాప్తు అధికారి వరకూ అందరిపైనా ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకుంది.

# అమెరికాలో క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో విప్లవాత్మక కృషిచేసిన సాయిరోహిత్

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణానికి చెందిన గర్వకారణమైన సంఘటన మన ఊరికి చెందిన సాయిరోహిత్ తుమ్మురుకోటి, మాజీ ఎంపీడీవో తుమ్మురుకోటి కుప్పారావు మనవడు, అమెరికాలో క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగాల్లో చేసిన విశేష కృషికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఒక ప్రముఖ ఐటీ నిపుణుడిగా, రచయితగా పేరుగాంచిన సాయిరోహిత్ రచించిన పీఈజీఏ క్లౌడ్ 3, మోడరన్ ఎంటర్‌ప్రైజెస్ సెల్యూషన్ గైడ్ అనే పుస్తకాన్ని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ, కింగ్స్‌విల్ వంటి విశ్వ విద్యాలయాలు తమ గ్రంథాలయాల్లో చేర్చాయి. ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ నిపుణులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతోంది. ప్రస్తుతం సాయిరోహిత్ హెచ్‌సీఏ హెల్త్‌కేర్‌లో కన్సల్టెంట్ అప్లికేషన్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అభివృద్ధి చేసిన వర్క్‌ఫ్లోలు, గ్రిడ్ అప్లికేషన్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించేందుకు సహాయపడుతుంది. అలాగే కోవిడ్-19 సమయంలో లక్షల మందికి సేవలందించిన వ్యాక్సిన్ ట్రాకర్, ప్రొవైడర్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్(పీఎల్ఎం)క్లెయిమ్ ఆటోమేషన్ వంటి అత్యాధునిక పరిష్కారాల్లో ఆయన కీలకపాత్ర పోషించారు. అమెరికాలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన సాయిరోహిత్, అనేక అంతర్జాతీయ పరిశోధనా వ్యాసాలు ప్రచురించడంతో పాటు పేటెంట్లు కూడా దాఖలు చేశారు. ఆధునిక క్లౌడ్ వేదికల రూపకల్పన ద్వారా ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ఆయన పరిశోధనల ప్రధాన లక్ష్యం. పుత్తూరు పట్టణానికి చెందిన యువతగా సాయిరోహిత్ అందుకున్న ఈ గౌరవం, మన ఊరి పేరు ప్రపంచ వ్యాప్తంగా వెలుగులోకి తీసుకురావడంలో ఒక గొప్ప ఘనత, ఆయన విజయాలను స్థానిక యువతకు ప్రేరణగా నిలుస్తాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. పుత్తూరు ప్రజల తరపున సాయిరోహిత్ తుమ్మురుకోటికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ మరిన్ని విజయాలను కోరి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏపిఎంఎస్ఎంఇ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

## - ఇంటికో వ్యాపారవేత్తను రూపొందించాలన్న సిఎం ఆశయానికి ముందడుగు




సమావేశంలో మాట్లాడుతున్న ఏపి ఎంఎస్ఎంఇ గౌరవాధ్యక్షుడు బాయన వెంకటరావు

**విజయవాడ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** నేడు విజయవాడలో ఆటోనగర్‌లో ఏపిఎంఎస్ఎంఇ ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్, ఫైనాన్సింగ్, సబ్సిడీ, మరియు అవర్చునిటీస్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఏపి ఎంఎస్ఎంఇ గౌరవాధ్యక్షులు బాయన వెంకటరావు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఏపి ఎంఎస్ఎంఇ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఒక వ్యాపారవేత్త వుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, గౌరవ అతిథిగా తమ్మిరెడ్డి శివ శంకర్ రావు, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ లు పాల్గొంటారన్నారు. సంస్థ సిఇఒ డా శేఖర్ బాబు గద్దం, ఐఎఫ్ఎస్ ముఖ్య అంశాలను ప్రస్తావిస్తారన్నారు. సాంకేతిక అంశాలపై బెస్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ఎండి ముమ్మడి శేషసాయి, జీఎం ముమ్మడి పవన్ కుమార్‌లు ప్రసంగిస్తారన్నారు. హైదరాబాద్‌లోని బెస్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ కలిసి నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో బ్యాంకర్లు, నూతన వ్యాపారం చేయాలనుకునే ఆసక్తి కలవారు పాల్గొని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపిఎంఎస్ఎంఇ ప్రెసిడెంట్ డి దుర్గాప్రసాద్, సంస్థ ఇసిఎం గద్దె సాంబశివరావు, బెస్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ఎండి ముమ్మడి శేషసాయి పాల్గొన్నారు.

# జువ్వలదిన్నెలో అనధికారికంగా లేఔట్లు

## - అక్రమంగా గ్రావెల్ తరలింపు



**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ పంచాయతీ పరిధిలో పుట్టగొడుగులుగా అనధికార లేఔట్లు వెలుస్తున్నాయి. ఈ లేఔట్లకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మట్టి తరలింపులో అధికార పార్టీ నాయకులతో పాటు స్థానిక అధికారులకు వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులకు జేబులు నిండటంతో అక్రమ లేఔట్లను ప్రోత్సహిస్తూ వారి అరాచకాలను చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న స్థానిక రెవెన్యూ అధికారులు గతంలో అనేక లేఔట్లకు పర్మిషన్ లేదని జెసిపి తో ధ్వంసం చేసి మరి ఇప్పుడు ఎందుకు మోనం వహిస్తున్నారో అర్థం కావటంలేదు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ లేఔట్లను ఆపి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నటువంటి స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

# ఎఐతో భవిష్యత్తు తరాలకు సంస్కృత జ్ఞానం

**తిరుపతి విద్య, ఏప్రిల్ 22 ప్రభాతవార్త** ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ద్వారా భవిష్యత్తు తరాలకు సంస్కృత జ్ఞానాన్ని అందించవచ్చునని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సీడ్యాక్ సంస్థ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును వర్సిటీలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ ఎన్ఈపీ2020 ప్రకారం నూతన ఆవిష్కరణలవైపు విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. చెన్నై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్ విధానం ద్వారా సదస్సునుద్దేశించి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను సంస్కృత శాస్త్రాలతో సమన్వయం చేసి సరికొత్త లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రాలలో కృత్రిమ మేధస్సు వినియోగంతో పాటు సంస్కృతంలో ఏఐ ఆధారిత పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్యాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ సంస్కృత వ్యాకరణం, పదనిర్మాణం వంటి అంశాల్లో కృత్రిమ మేధ వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, విభాగాధిపతి కే గణపతి భట్, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ, డాక్టర్ కాళిదాసు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రశేఖరం, ప్రొఫెసర్ శ్రీధర్, డాక్టర్ మేరి సుజాత, నాగలక్ష్మీ, ప్రసన్న, సంకీర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్‌తో సిఎం చంద్రబాబు భేటీ



**విజయవాడ,ఏప్రిల్ 22.ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయల్‌ను కలిసారు. రాష్ట్రానికి సంబంధించి పలు వాణిజ్య అంశాలను ఆయన బేటీలో ప్రస్తావించారు. జీఎస్టీ వృద్ధి రేటు అంశాలను వివరించారు. రాష్ట్ర వాణిజ్య అవసరాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వినతి పత్రం పెంచారు. వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు ప్రాజెక్టు ఏర్పాట్లు. పోర్టుల నుంచిజాతీయ రహదారుల అనుసంధానం, విమానాల కాంబో సర్వీసులు, ఇతరంశాలను వివరించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి దగ్గర సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. భేటీలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు. చంద్రశేఖర్ గారు, ఎంపీలు. పాల్గొన్నారు.

# గోడలు కూలి ఇద్దరు కూలీలు మృతి

**గూడూరు,ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా గూడూరు మండల కేంద్రమైన గూడూరు పట్టణంలో చికెన్ వలి అనే వ్యక్తికి సంబంధించిన స్థలంలో చేపట్టిన గోడ నిర్మాణంలో భాగంగా మంగళవారం పునాదులు తీస్తుండగా ఆకస్మాత్తుగా మట్టి గోడలు విరిగి కింద పడడంతో పని నిమగ్నంలో ఉన్న గౌండ సోమన్న (38), బోయ మద్దు (25) అనే ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. వీరికి చికిత్స నిమ్మత్తం వెంటనే మండలంలోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి ఆసుప్రత్తికి తరలించగా అప్పటికే వారు మృతి చెందారని అక్కడి డాక్టర్లు ధృవీకరించారు. ఈ విషయం తెలిసిన వెంటనే గూడూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆ తరువాత మృత దేహాలకు పోస్టు మార్టం నిమ్మత్తం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో మరణించిన గౌండ సోమన్నకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అలాగే బోయ మధుకు భార్య ఉంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తమ వారు ఇంటి నిర్మాణంలో మృతి చెందిన కుటుంబాలకు పెద్దదిక్కు లేకుండా పోయిందని వారికి ఇక దిక్కేవ్వరని కుటుంబ సభ్యులంతా కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే చంద్రన్న భీమా కింద ఆర్థిక సహాయంను అందించాలని బాదిత కుటుంబాలు, గ్రామ పెద్దలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పరిశోధనా ఫలాలు రైతులకు అందాలి

## - జాతీయ సదస్సులో భారతీయ పరిశోధన మండలి డిప్యూటి డైరెక్టర్




**తిరుపతి విద్య ఏప్రిల్ 22 ప్రభాత వార్త** క్షేత్రస్థాయిలో వ్యవసాయ పరిశోధనా ఫలితాలు త్వరితగతన రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజ్ బీర్ సింగ్ సూచించారు. ఎన్జీరంగా ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు పీజీ విద్యార్థులకోసం బ్రిడ్జింగ్ సైన్స్ సస్టైనబులిటీ ఫుడ్ సెక్యూరిటీ అనే అంశంపై జరిగే జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన సంస్థలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాల మధ్య సమన్వయంతో వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను అధికమించడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ పరిశోధనలలో రైతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పరిశోధనా ప్రణాళికలలో వారి అనుభవాలను పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు. వనరులకు అనుగుణంగా పరిశోధనలు సాగిస్తూ ఫలితాలను రైతులకు శీఘ్రంగా చేరవేయడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలన్నారు. అనంతరం మహారాష్ట్ర వంసతరావు నాయక్ మారట్వాడ కృషి విద్యాపీఠ్ వీసీ ప్రొఫెసర్ ఇంద్రామణి మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను వ్యవసాయ పరిశోధనలతో అనుసంధానించడం ద్వారా వ్యవసాయ పరిశోధనలకు వెచ్చించే సమయాన్ని తగ్గించి తద్వారా మరిన్ని సమస్యలకు సత్వర పరిష్కార మార్గాలు చూపచ్చు అని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తి, నాణ్యమైన పోషక ఆహార ఉత్పత్తులు అందించడం, వాతావరణ మార్పుల ఆధారిత పరిశోధన వంటి మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ జాతీయ కాన్ఫరెన్స్ లలో పాల్గొనడం ద్వారా వ్యవసాయ విద్యార్థులు వివిధ పరిశోధనా సంస్థలు విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధన అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ రంగ సవాళ్లను సమగ్రంగా అధ్యయనం చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సదస్సులో తంజావురు నిఫ్టీ ఇన్ డైరెక్టర్ డాక్టర్ బి పలని ముత్తు, పీజీ డీన్ డాక్టర్ ఏవి రమణ, కళాశాల అసోసియేట్ డాక్టర్ ఎంవీ రమణ, డాక్టర్ డి సుబ్రహ్మణ్యం, ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు డాక్టర్ హరికిషన్ సుదిని, డాక్టర్ మనీష్ కే పాండే, ఏడీఆర్ డాక్టర్ సుమతి, డాక్టర్ రమణ మూర్తి, అధ్యాపకులు, పలు వర్సిటీల నుంచి 762 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుమలలో యువకుడు ఆత్మహత్య


**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏ కారణాలో తెలియదు...ఎక్కడ నుండి వచ్చాడో చిరునామా లేదు. ఓ యువకుడు(26)తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో గుడ్డతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మద్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యానవనంలోపల యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుని వద్ద ఎలాంటి ఆదారాలు గానీ లేవు. మృతుడు టీ చొక్కా, ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కుటుంబకలహాలుగానీ, ప్రేమవిఫలంతోగానీ ఈ దారుణానికి పాల్పడివుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. టిటిడి విజిలెన్స్ ఫిర్యాదుతో తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు!

విజయవాడ, ఏప్రిల్22, ప్రభాతవార్తప్రతినిధి:రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారుచేసేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు డీపీఆర్ రూపకల్పన కోసం కన్సల్టెన్సీల నుంచి ప్రతిపాదనలు కోరుతూ ప్రకటన జారీచేసింది. రాజధానిలోని నీరుకొండ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విగ్రహం తయారీతోపాటు సమీప ప్రాంతాల్లో ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను డీపీఆర్ లో పొందుపర్చాల్సిందిగా అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోసల్‌లో కోరింది. మే 14 లోగా ఆర్ ఎఫ్ పీ సమర్పించాలని కోరుతూ ప్రకటన విడుదల చేసింది. విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్ తోపాటు రాజధానిలోని ప్రధాన ఆర్టిరియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసమూ డీపీఆర్ లు రూపొందించాలని నిర్ణయించారు.

# తిరుమల సమాచారం

## మే 6నుండి పద్మావతిపరిణయోత్సవాలు



**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాత వార్తప్రతినిధి:** వైకుంఠం నుండి భూలోకానికి శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా వేంచేసిన తొలిరోజుల్లో నారాయణ వనంలోని పద్మావతిదేవిని వివాహామాడిన ఘట్టాన్ని తలపిస్తూ తిరుమలలో మూడు రోజులు పద్మావతి పరిణయోత్సవాలు నిర్వహించడం పరిపాటి. మేనెల 6వతేదీ నుండి 8వతేదీ వరకు మూడురోజులు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో పరిణయోత్సవమండపంలో ఈ వేడుకలు జరిపిస్తారు. పరిణయోత్సవాల్లో తొలి రోజు మలయప్పస్వామి గజవాహనంపై, రెండవరోజు అశ్వవాహనంపై. మూడోరోజు గరుడ వాహనంపై పరిణయమండపానికి వేంచేపుచేస్తారు. మనోవైపు శ్రీదేవిభూదేవి ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయమండపం చేరుకుంటారు. అక్కడ కల్యాణోత్సవ ఘట్టం, పూబంతులాట, నివేదనలు, కొత్తవస్త్రాలు ధరింపజేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా మూడురోజులు పాటు శ్రీవారి ఆలయంలో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టిటిడి రద్దుచేసింది.

## గోవిందనిలయంలో స్తంభించిన లిఫ్ట్

### - లోపలే ఉండిపోయిన భక్తులు



**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి** ఏడుకొండల వెంకన్న దర్శనార్థం వచ్చిన తమిళనాడు భక్తులు తిరుమలలో గోవిందనిలయం విశ్రాంతి భవనంలో గదిని పొందారు. మంగళవారం ఉదయం భక్తులు గదినుండి స్వామివారి దర్శనానికి వెళ్ళి తిరిగి రెండో అంతస్థులో గదికి చేరుకనేందుకు విశ్రాంతి భవనంలోని లిఫ్ట్‌ను ఎక్కారు. లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయింది. లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య కారణంగా మధ్యలోనే ఆగిపోవడంతో భక్తులు ఎటూ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దాదాపు పదినిమిషాలుపాటు లిఫ్ట్‌లోనే భక్తులు ప్రాణాలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొంతసమయం తరువాత అక్కడే ఉన్న సిబ్బంది స్పందించి అతికష్టంపై లిఫ్ట్ తలుపులు తెరిచారు. ఒక్కసారిగా భక్తులు ప్రమాదం నుండి బయటపడ్డారు. సాంకేతిక సమస్య వల్ల లిఫ్ట్ ఆగిపోయినా ఆ విశ్రాంతి భవనం సిబ్బంది పట్టించుకోలేదని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని వసతికల్పన విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. లిఫ్ట్‌నుండి బయటకు వచ్చిన భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.

## నేటినుండి గోవిందరాజస్వామి ఆలయంలో భాష్యకార్ల ఉత్సవం



**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం నుండి మేనెల 2వతేదీ వరకు భాష్యకార్ల (శ్రీరామానుజాచార్యులు)ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు భాష్యకార్లును బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాఢవీధి ఉత్సవం,


సాయంత్రం 6.30గంటల నుండి పెద్దమాడ ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర ఆస్థానం జరుగుతుంది. మే 1వతేదీ భోగితేరు, 2న సాత్తుమొర నిర్వహిస్తారు. ఆలయంలో మేనెల 3వతేదీ గంధపొడి ఉత్సవం ఘనంగా జరిపిస్తారు.

# మేయర్ పదవికి ఎన్నిక.. నోటిఫికేషన్‌ను జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషనర్

**.విశాఖపట్నం , ఏప్రిల్ 22:** మహా విశాఖపట్నరపాలక సంస్థ మేయర్ పదవికి ఎన్నికను 2025 ఏప్రిల్ 28వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలను జారీ చేశారని విశాఖ జిల్లా కలెక్టర్ , జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. సదరు నోటిఫికేషన్ ప్రకారం 24.04.2025 తేదీ లోపల మేయర్ ఎన్నికల షెడ్యూల్ ను ఫారమ్॥ ప్రకారం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు ఎన్నికైన సభ్యులకు మరియు ఎక్స్ఆఫీషియో సభ్యులకు మేయర్ ఎన్నికల నిమిత్తం ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటీసు ఇవ్వడం జరుగునని , మేయర్ ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

# ఒబిసి, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లివ్వాలి

## ఒబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగీరేకుల వరప్రసాద్




**విజయవాడ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఓబిసి, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత ఓబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగీరేకుల వరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్ లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల మాదిరి బిసి, ఓబిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లించేందుకు ఓబిసి వర్గానికి చెందిన ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత తీసుకోవాలన్నారు. కేంద్రంలో ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూపాలన్నారు. ఏపిలో బిసిలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బిసి రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓబిసి మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీదేవి యాదవ్‌ను నియమిస్తూ ఉత్తర్వులిచ్చిన ఆయనకు శ్రీదేవి కృతజ్ఞతలు తెలుపారు. కార్యక్రమంలో ఓబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజాన్‌సింగ్, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి మాధవరావు, డిఆర్ యుసిసి సభ్యులు కాకు బాలనారాయణ, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం అంకమ్మ పాల్గొని శ్రీదేవిని సత్కరించారు.

# అన్ని శాఖల సమిష్టి కృషితో బ్రహ్మోత్సవాలు :ఆర్డీఓ నాగ అనూషా

**పెంచలకోన (నెల్లూరు), ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** అన్నిశాఖల సమిష్టి కృషితో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి నాగా ఆనూషా కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం కోనలోని కాకతీయ కమ్మ సత్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆనుషా మాట్లాడుతూ పెంచలకోన బ్రహ్మోత్సవాలు ఎంతో పవిత్రమైనవని ఈ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరైతారని వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసి వారికి సులభతరంగా దర్శనం అయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణలు పలు సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చేయడం, పరిసరాలు పరిశుభ్రంగా వుంచడం, ఉత్సవాలలో నిరంతం విద్యుత్ సరఫరా వుండేలా చూడటం, భక్తులకు అవసరమైన వైద్యసేవలు అందించడం, భక్తులు తోపులాట లేకుండా క్యూలైన్ల ఏర్పాటు తదిర విషయాలపై ఆమె శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. దీంతో పాటు ఆదూరుపల్లి నుండి పెంచలకోన వరకు వున్న రోడ్డుకు తాత్కాలిక మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. కోనలో ఇటీవల చిరుతల సంచారం వున్నట్లు సమాచారం వుందని, అడవి జంతువుల వల్ల భక్తులకు ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలలో 6 రోజులు గోనుపల్లిలోని మద్యం దుకాణాన్ని మూసి వేసి డ్రై డేగా చేయాలని ఆమె ఏక్సైజ్ అధికారులకు సూచించారు. భక్తుల రవాణాకు సంబందించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా రావాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసి వారికి సూచించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబందించిన వారు శాఖల వారిగా వారు చేపట్టే చర్యలను ఆర్డీఓకు వివరించారు. నేడు జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణాయాలపై మే నెల మొదటి వారంలో మారో మారు సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పొరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, రాపూరు తహశిల్దార్ లక్ష్మీ నరాపఉన్నారు.

# నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ ఇకనుండి ప్రతి శుక్రవారం

## - టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్‌ను ఇకపై ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గతంలో గ్రీవెన్స్ ప్రతి బుధవారం నిర్వహించేవారమన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్ చార్జ్ లు ఎమ్మెల్యేల అభ్యర్ధన మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన ఆదేశాల మేరకు, గ్రీవెన్స్‌ను శుక్రవారానికి మార్చడం జరిగింది. నియోజవర్గాల్లో స్వీకరించిన వినతులను.. అలాగే పరిష్కరించిన సంఖ్య తదుపరి వారం నివేదికను టీడీపీ కేంద్ర కార్యాలయానికి తెలిజేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు తెలిపారు. ఈ సమావేశాల లక్ష్యం కార్యకర్తల సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ, పార్టీ సంస్థాగత నిర్మాణం బలోపేతం, వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరుకు గుర్తింపు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpeta, Vijayawada-520002 (AP)

**E PROCUREMENT SHORT TENDER NOTICE**

**NIT No. 03/PROC/MAU61-USIOHB(OTH)/137/2025-CETTDt.22.04.2025.**

**Name of Work:** "APCRDA-H&B- AP Secretariat- Preparatory works for Hon'ble PM visit- Providing BT Layer Renewal to the East side and South side Roads (AP Secretariat-Helipad-N9 Road) at AP Secretariat, Velagapudi"- **Est. Cost -20.00 Lakhs**

The bid can be downloaded on AP e-procurement portal from **23.04.2025 to 26.04.2025** up to **14.00** Hrs. Due date for submission of Bid **26.04.2025** up to **15.00** Hrs, Technical bid opening **26.04.2025 @ 16.00** Hrs. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

**NIT No. 02/ MAU61-USIOHB(OTH)/104/2025-CETT Dt.22.04.2025.**

**Name of Work:** "Providing Glass Partition and supply of Work stations, Chairs, Storage Units and other miscellaneous works to the Waiting Hall at Chamber of Hon'bleMinister for BC Welfare, EWS Welfare, Handlooms and Textiles in front of RoomNo. 131, Ground Floor in Building 4 , A.P Secretariat, Velagapudi"- **Est. Cost -10.10 Lakhs**

The bid can be downloaded on AP e-procurement portal from **23.04.2025** to **01.05.2025** up to **14.00** Hrs. Due date for submission of Bid **01.05.2025** up to **15.00** Hrs, Technical bid opening **01.05.2025 @ 16.00** Hrs. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- **Commissioner, APCRDA,** Vijayawada

వార్త

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

-వివేకానందుడు

# కాలుష్య భారతం!

కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యంకాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాలకులు కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలను, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేకవ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికి పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్య మేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించేఅంశం. ప్రధానంగా నగరాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం అదుపు తప్పిపోతున్నది. కేవలం వాయుకాలుష్యం కారణంగా పాఠశాలలకు ఏకంగా సెలవులు ప్రకటించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోనే కాదు అనేక నగరాలలో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నదని వార్తలు కలవరపరుస్తున్నాయి. కోల్‌కతా, ముంబాయి, నగరాలతోపాటు దక్షిణాదిన బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోనూ వాయు నాణ్యత క్షీణిస్తున్నది. పర్యావరణం నీటి, గాలి నాణ్యత వాతావరణంలో మార్పులు అటవీ విస్తీర్ణం, చెత్త నిర్వహణ, తదితర అంశాలపై దేశంలోనే ప్రముఖ నగరాల్లో జరిపిన సర్వేలో వాయుకాలుష్యం నగరజీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తున్నదనే విషయం వెలుగు చూసింది. కొన్ని నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నట్లు వెల్లడయింది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయు కాలుష్యంతోపాటు నిర్మాణరంగం వల్ల పీల్చేగాలిలో ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు బయటపడ్డాయి. గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడం ఒక క్రమబద్ధ ప్రణాళిక లేకుండా కాలనీలు వెలుస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుంటున్నా పెరిగిపోతున్న కాలనీలఅవసరాలు తీర్చలేకపోతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. 2019లో భారత్ ఎంపిక చేసిన 102 నగరాల్లో ధూళికణాలు ముప్పును ఇరవై నుండి ముప్పై శాతంమేర తగ్గించడానికి జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం ఆరంభించారు. ఆ తర్వాత క్రమేపీమరో ముప్పై నగరాలకు విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మ కణాలను నలభైశాతం దాకా నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఏడువేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించినా పెద్దగా మార్పురాలేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి, తదితర రాష్ట్రాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రపంచవ్యాప్తంగా కూడా కాలుష్యం పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నది.


ప్రపంచ వాయుస్థితి నివేదిక ప్రకారం 2021లో ప్రపంచ వ్యాప్తంగా ఎనభైఒక్క లక్షల మంది కేవలం వాయుకాలుష్యం వల్లనే అసువులు కోల్పోయారు. మరణించిన వారిలో దాదాపు ఇరవైశాతం మంది భారతీయులే ఉన్నారు. భారతదేశంలో ప్రతిరోజూ నాలుగువందల అరవైనాలుగు మంది పసిపిల్లలు వాయుకాలుష్యానికి బలైపోతున్నారని ఆ నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా ముఖ్యంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకుపైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టింది. అడవుల సంరక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రత్యేక దృష్టిసారిస్తున్నది. మనదేశంలో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించి పొగను వదులుతున్నవారి సంఖ్య కోట్లసంఖ్యలో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అయినా యేడాది యేడాదికి కాలుష్యం పెరిగిపోతూనే ఉన్నది. వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్, నైట్రిక్ ఆసిడ్, దుమ్ముధూళి అదుపు తప్పుతున్నది. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల్లో జరుగుతున్న కల్తీ కూడా ఈ కాలుష్యాన్ని మరింత పెంచుతున్నది. ఈకల్తీని నిరోధించేందుకు అధికారగణం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదు. మొత్తంమీద తీవ్రస్థాయిలోవెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యమై ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. గతంలో ఒక విశ్వవిద్యాలయ పర్యావరణ పరిశోధన శాస్త్రజ్ఞులు చేసిన అధ్యయనంలో 132 దేశాలకంటే భారత్ అట్టడుగునున్నట్లు వెల్లడైంది. భారత్‌లో ధూళికణాలు ఉండాల్సిన స్థాయి కన్నా అధికంగా ఉండి శ్వాసకోశ సమస్యల నుండి కేన్సర్‌దాకా అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి భావిభారత బాలబాలికల బతుకు దీపాలను కాలుష్యం చిదిమేస్తున్నట్లు బయటపడుతుంది. వాయుకాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మారుస్తూ గుండెజబ్బులకు కారణమవుతూ పక్షవాతానికి, ఊపిరితిత్తులకు కేన్సర్‌కు మూలమవుతుందనే విషయం ఆ పరిశోధనల్లో బయటపడింది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్యభూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలను ప్రకటించడమేకాదు అమలుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణంపట్ల అన్ని వర్గాల ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నం చేయాలి.

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

తన కోపాన్ని అదుపులో పెట్టుకోలేనివాడు తన మనస్సును శరీరాన్ని కూడా అదుపు చేయలేడు.



బైరన్

# ప్రజావాక్కు



### మాట తప్పటం సరికాదు

ఎమ్.పి.లు అందరు లక్షాధికారులు. కోటీశ్వరులు వారికి జీతాలు కూడా లక్షల్లోఇస్తుంటారు. వాటిని తరచూ పెంచుతుంటారు. వారికి సకల సదుపాయాలు కల్పిస్తారు. రాజభోగాలు అందిస్తారు. వారికి ఏచిన్న కష్టం రాకుండా చూస్తారు. అదే పేదవారికి సాయం చేయడానికి పాలకులకి మనసు రాదు. పది రూపాయలు ఇవ్వాలంటే పదిసార్లు ఆలోచిస్తారు. ఎన్నో ఆంక్షలుపెడతారు. సవాలక్ష కారణాలు చూపుతారు. ఎలాగోలా ఎగొట్టాలనిచూస్తారు. వారి ఖాతాల్లో 15 లక్షలు జమ చేయడం, పెన్షన్లను నాలుగువేలకు పెంచుతామనటం అంతా ఒట్టిదే. ఇచ్చిన మాట తప్పటం రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఎస్జిటీలను నియమించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మోడల్ ప్రైమరీ స్కూల్‌లలో ప్రధానోపాధ్యాయులుగా సెకండరీ గ్రేడ్‌టీచర్లను మాత్రమే నియమించాలి. 6,7,8 తరగతుల ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌లను నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు ప్రతిపాదించిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిప్రకారమే పోస్టులు కేటాయింపును మోడల్ ప్రైమరీ, బేసిక్, ప్రైమరీ ఫౌండేషన్ స్కూళ్లకు వర్తింపజేయాలి. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40 ఉండేలా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### అవకాశవాదులు

కొందరు రాజకీయ నాయకులకి సిద్ధాంతాలు, నైతిక విలువలు అనేవి ఉండవు. గాలిఎటువైపు వీస్తే అటువైపు వెళతారు. పదవుల కోసం ఎవరితోనైనా స్నేహం చేస్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో కలిసి పనిచేస్తారు. వారి సాయంతో అధికారంలోకి వస్తారు. పదవులు పొందుతారు. ఆనకవారి అడుగులకి మడుగులొత్తుతు ఇంద్రుడని చంద్రుడని పొగడుతారు. బాకాలు ఊదుతూ వారి వెంట తిరుగుతారు. నీరున్న చెరువులోకి కప్పలు సిరిసంపదలు ఉన్నవారి వద్దకు బంధువులు చేరినట్లు ఎవరి వేవ్ ఉంటే వారితో జతకడతారు. రాజకీయాలు ఇలాంటి వారికె అనుకూలంగా ఉంటున్నాయి.

-మిథునం, హైదరాబాద్

### జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం

ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షిజాతులు నశిస్తున్నాయి. అందులో పిచ్చుకలు అంతరించిపోయే పక్షి జాతుల్లో మొదటివరుసలో ఉన్నాయి. నగరీ కరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోంది. దానికి తోడు వాతావరణంలో మార్పులు, విపరీతమైన ఎండలు, తగ్గుతున్న హరితంవల్ల కూడా అవి అంతరించిపోయే దశ వేగవంతంగా తయారైంది. జీవవైవిధ్యం కోల్పోవడం మరిన్ని కొత్త ప్రకృతి పరమైన ఉపద్రవాలకు కారణభూతమోతుంది. ఉదాహరణకు కొన్ని పక్షులు కీటకాల సంతతిని అదుపులో ఉంచుతాయి. తద్వారా పంటల పెరుగుదలకు ఊతమిస్తాయి. ఒకపక్షిజాతిలేదా జంతుజాతి నశిస్తే, దానితోపాటు పర్యావరణ సమతుల్యత అదుపు తప్పుతుంది. మరిన్ని విపరిణామాల్ని మానవాళినెత్తిపై రుద్దుతుంది. కాబట్టిసమాజం అలాంటి విపత్తురాకుండా జాగ్రత్త వహించాలి.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### విలువల పతనం

బిజెపి నాయకులకి కావలసింది అధికారం దాని కోసం వారు ఏమయినాచేస్తారు. అడ్డదారుల్లో వెళతారు. అక్రమాలకు పాల్పడ తారు. ఎవరు ఏమనుకున్నా లెక్క చేయరు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేయడానికి వెనుకాడరు. అనేక రాష్ట్రాలలో వారు నడిపిన రాజకీయాలు గమనిస్తే వారికి అధికార దాహం ఎంతలా ఉందో అర్థం అవుతుంది. పార్టీల మధ్య చీలికలు తెచ్చి లబ్ధిపొందటంలో వారిని మించిన వారు మరొకరు లేరు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం యువకులకు ఒక వెలుగు రేఖ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక ఆశారేఖ ఒకవైపు కోటి మంది మహిళలను రుణాలు మంజూరు చేస్తూ యువకులకు రుణాలు మంజూరు చేస్తూ రాష్ట్రం సిద్ధించిన జూన్ 2న కొత్త ప్రయాణంలోకి యువకులను తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నది. యువకులకు వివిధ అవకాశాలు వ్యాపారాలకు అధిపతులు చేసే ప్రయత్నం ఈ పథకం ద్వారా సాగుతుంది. దీనిప్రధాన ఉద్దేశం వినియోగాన్నిపెంచడం ద్వారా ఉత్పత్తికి అవకాశం కల్పించడమే. ఒకవైపు మహిళలకు రుణాల పంపిణీయువతి యువకులకు రుణాలపంపిణీ చేయడం ద్వారా యువ, మహిళ వికాసానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

-భారత అవినాష్, జనగామ

మన వేదిక

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భవిష్యత్తు పునరుత్పాదక వనరులదేనా?

**పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి కఠినమైన నిబంధనలు రూపొందించడమేకాదు! వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. 'చిన్న చిన్న రాళ్లే పెద్ద కొండను చేస్తాయి' అన్నట్లుగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేస్తే గొప్ప మార్పును తీసుకురావచ్చు. స్థిరమైన శక్తి వనరులను అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంచడం, సహజ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించి మన భూమిని కాపాడుకోవచ్చు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలం. 'మనం మారితేనే యుగం మారుతుంది' అని గుర్తుంచుకోవాలి. 'చేయి కలిపితేనే విజయం'. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలందరూ కలిసి పనిచేస్తేనే స్వచ్ఛమైన శక్తి రంగంలో స్థిరమైన అభివృద్ధిని సాధించగలం.**

డి జె మోహన రావు

తల్లిని మించిన దైవం లేదు, భూమిని మించిన స్వర్గం లేదు. మన జీవనాధారమైన ఈ భూమిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. తల్లి భూమిని కాపాడుకుంటేనే మనం సుఖంగా ఉండగలం. మన భూమి ఆరోగ్యం, మన శక్తి భవిష్యత్తు పరస్పరం ముడిపడి ఉన్నాయి. పునరుత్పాదక వనరులు అనగా సహజంగా తిరిగి నింపబడే శక్తి వనరులు. వీటిలో సౌరశక్తి (సూర్యకాంతి నుండి లభించే శక్తి), పవనశక్తి (గాలినుండి లభించేశక్తి), జలవిద్యుత్ (నీటి ప్రవాహం నుండి లభించేశక్తి), బయోమాస్ (సేంద్రియ పదార్థాల నుండి లభించేశక్తి), భూఉష్ణశక్తి (భూమి అంతర్గత వేడి నుండి లభించేశక్తి) ముఖ్యమైనవి. ఈ వనరులు శిలాజ ఇంధనాల (బొగ్గు, చమురు, సహజ వాయువు) వలె కాకుండా వినియోగించిన తర్వాతకూడా తిరిగి ఉత్పత్తి అవుతాయి. కాబట్టి ఇవి పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. దీర్ఘకాలికంగా స్థిరమైన శక్తిని అందిస్తాయి. మన దేశంలో పునరుత్పాదక వనరుల శాతం, భవిష్యత్తు ప్రణాళికలు పరిశీలిస్తే, ప్రస్తుతం భారతదేశంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలోపునరుత్పాదక వనరుల వాటా గణనీయంగా పెరుగుతోంది. 2024నాటికి ఇది సుమారుగా 42శాతానికి చేరుకుంది (ఇందులో పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి). అయితే సౌర, పవన శక్తి వంటి ఇతర పునరుత్పాదక వనరుల వాటా ఇంకా తక్కువగా ఉంది. కానీ వేగంగా పెరుగుతోంది. భారతదేశం 2030నాటికి తన విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదక వనరుల వాటాను 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అవి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడానికి ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి అనుకూలమైన విధానాలను రూపొందిస్తోంది. పునరుత్పాదక ఇంధన వనరుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సరఫరా చేయడానికి అవసరమైన గ్రిడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. కొత్త, మెరుగైన పునరుత్పాదక ఇంధన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇస్తోంది. "నేడు నాటిన విత్తనం రేపటి ఫలం' అన్నట్లుగా పునరుత్పాదక ఇంధన రంగంలో మనం చేసే పెట్టుబడులు భవిష్యత్తులోస్వచ్ఛమైన శక్తిని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను పెంచడం, సౌర, పవన, జల, బయోమాస్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరుల అభివృద్ధి వినియోగాన్ని ప్రోత్సహించడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణానికి హాని కలిగించని నేల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాలను అవలంబించడం, హరిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణానికి హాని కలిగించని నేల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాలను అవలంబించడం, ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రజా రవాణా వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించడం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, వ్యర్థాలను తగ్గించడం, వస్తువులను తిరిగి ఉపయోగించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా సహజ వనరులపై ఒత్తిడిని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ సాంకేతికతల్లో పెట్టుబడులను ఆకర్షించడం, పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడులను పెంచడం, సౌర, పవన, జల, బయోమాస్ వంటి స్వచ్ఛమైన ఇంధన వన



రుల అభివృద్ధి, వినియోగాన్ని ప్రోత్సహించడం. కాలుష్యాన్ని తగ్గించే వనరులను సమర్థవంతంగా ఉపయోగించే కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడం, అమలు చేయడం, లాంటి లక్ష్యాలున్నాయి. 2025 నాటికి ఈ దినోత్సవ లక్ష్యాలు మరింత నిర్దిష్టమైన చర్యలపై దృష్టిసారిస్తున్నాయి. ఇందులో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, అటవీ నిర్మూలనను అరికట్టడం, నీటి వనరులను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడటం వంటి అంశాలున్నాయి. దేశం తన జిడిపిలో సుమారు 2.5శాతం పర్యావరణ క్షీణతవల్ల నష్టపోతోందని అంచనా. పునరుత్పాదక ఇంధన వనరులలో పెట్టుబడులు పెట్టడం, స్థిరమైనపద్ధతులను అవలంబించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మనం ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించగలం. అయితే సౌర, పవనశక్తి వంటి వనరులు వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. నిరంతరాయంగా విద్యుత్‌సరఫరాను నిర్ధారించడం ఒక సవాలు. పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం తగినంత భూమిని గుర్తించడం, సేకరించడం కష్టంగా ఉంది. ఉత్పత్తి అయిన పునరుత్పాదక శక్తిని నిల్వ చేయడానికి సమర్థవంతమైన సరసమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడం మరో సవాలు. పేదరికం నిరక్షరాస్యత వల్ల ప్రజల్లో పర్యావరణ స్పృహ తక్కువగా ఉండటం ఒక ప్రధాన సమస్య. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడంతో, పర్యావరణ నిబంధనలను అమలు చేయడంలో ఆర్థికాభివృద్ధిని కొనసాగించడంలో సమతుల్యతను సాధించడం కష్టంగా మారుతోంది. అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించే నిధులు, సాంకేతిక పరిజ్ఞానం కూడా పరిమితంగా ఉన్నాయి. "ఒక వైపు ఏరు, ఒకవైపు పులి' లా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయడం ఒక క్లిష్టమైనపని. దేశంలో సుమారుగా 17శాతం అటవీ ప్రాంతం ఉంది. అయితే పెరుగుతున్న జనాభా, అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా ఈ శాతం తగ్గుముఖం పడుతోంది. "చెట్టు లేని చోట గాలి లేదు, నీరు లేదు, సుఖం లేదు" అని గుర్తించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచంలోని అత్యంత కాలుష్యపూరితమైన 30 నగరాల్లో 21 భారతదేశంలోనే ఉన్నాయి. "పొగలేని ఊరు, రోగం లేని మనిషి అరుదు" అనే సామెత ప్రస్తుత పరిస్థితికి అద్దంపడుతోంది. నీటి కొరత దేశంలో ఒకతీవ్రమైన సమస్యగా మారుతోంది. నీతిఆయోగ్ నివేదిక 2030నాటికి దేశంలోని అనేక ప్రాంతాలుతీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటాయి అని తెలిపింది. ఈ సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన వ్యూహాలను అమలు అవసరం. "నీరు లేని జీవితం నిస్సారం" అని గ్రహించాలి. "ఆదాయం కంటే ఆరోగ్యం మిన్న' అన్నట్లుగా పర్యావరణాన్ని కాపాడుకోవడం ఆర్థికంగా కూడా లాభదాయకం. పునరుత్పాదక శక్తిని సమర్థవంతంగా అనుసంధానించడానికి స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతలను అభివృద్ధి చేయాలి. గ్రిడ్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు చిన్నతరహా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించాలి. బ్యాటరీ, ఇతర శక్తినిల్వ సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టాలి. ఇతర దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవాలి. వీటికి సమగ్రమైన, దీర్ఘకాలిక పరిష్కారాలను అమలుచేయడం అవసరం. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి సౌర, పవన, జల విద్యుత్ లాంటి పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి కఠినమైన నిబంధనలు రూపొందించడమేకాదు! వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. 'చిన్న చిన్న రాళ్లే పెద్ద కొండను చేస్తాయి' అన్నట్లుగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేస్తే గొప్ప మార్పును తీసుకురావచ్చు. స్థిరమైన శక్తి వనరులను అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంచడం, సహజ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించి మన భూమిని కాపాడుకోవచ్చు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలం. 'మనం మారితేనే యుగం మారుతుంది' అని గుర్తుంచుకోవాలి. 'చేయి కలిపితేనే విజయం'. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలందరూ కలిసి పనిచేస్తేనే స్వచ్ఛమైన శక్తి రంగంలో స్థిరమైన అభివృద్ధిని సాధించగలం. •

# ఆల్కహాల్ మత్తు వదిలేదెలా?


ఎల్. ఉపేందర్

ఆల్కహాల్ సేవించడం అనేది ఆయా దేశాల భిన్న సంస్కృతులు, నియమాలు, అక్కడి ప్రభుత్వాలా పాలసీల మీద ఆధారపడి ఉంటుంది. అందులో భాగంగానే తెలంగాణలో దేశంలోనే అన్ని రాష్ట్రల కంటే కొంత ముందు వరసలో ఉందని చెప్పవచ్చు. పురుషులు దాదాపు 46శాతం సేవిస్తే, మహిళలు 7శాతం సేవిస్తున్నారు. ఈ విషయంలో తగిన ఆలోచనలు, విశ్లేషణలు అవసరం. మానవ జీవితంలో ఆనందాన్ని అన్వేషించడం సహజం. కానీ కొన్ని సందర్భాల్లో, ఈ ఆనందాన్ని తప్పుదారి పట్టే మార్గాల్లో వెతకడం మన ఆరోగ్యానికే కాకుండా సమాజానికీ ముప్పుగా మారుతుంది. అలాంటి వాటిలో ఆల్కహాల్ మద్యం ఒకటి. ఇది ప్రస్తుత సమాజంలో మత్తుకు ప్రధాన పెనుభూతంగా నిలిచింది. అయితే, ప్రశ్న ఏమిటంటే - ఆల్కహాల్ మత్తుకు మందు ఏది? ఇది కేవలం శరీరాన్ని మాత్రమే కాక, మనస్సు, కుటుంబం, ఉద్యోగం, సమాజం ఇలా అన్ని కోణాల్లోనూ ప్రభావితం చేసే సమస్యగా మారింది. దీనికి పరిష్కారం శాస్త్రీయంగా, మానసికంగా, సమాజపరంగా, ప్రభుత్వ ఆలోచనలను వెతకాల్సిన అవసరంఉంది. ఆల్కహాల్ మత్తు అంటే, మద్యం సేవించడం వల్ల ఏర్పడే శారీరక, మానసిక ప్రభావాలు. మద్యం అతిగా సేవించడం వల్ల కేంద్ర నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మెదడలోని న్యూరో ట్రాన్స్ మీటర్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా మానసిక స్థితిలో మార్పులు వస్తాయి. చురుకుదనం తగ్గిపోవడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గిపోవడం, స్థిరత్వం లేకపోవడం, దీర్ఘకాలంలో కాలేయం, గుండె, జీర్ణ వ్యవస్థ వంటి అవయవాలు కిడ్నీ, మెదడు వంటి అవయవాలను దెబ్బతీయగలదు. మానసికంగా డిప్రెషన్, ఎంగ్జైటీ వంటి సమస్యలకు కారణం అవుతుంది. చాలామందిమొదట మద్యం తాగడం ని 'ట్రై చేయడం'గా చూస్తారు. ఇది కొన్ని సందర్భాల్లో సరదా, ఒత్తిడి నుంచి రిలీఫ్ అనే మాయా భ్రమతో మొదలవుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సినిమా, టీవీ మీడియా ప్రభావంవల్ల కూడా మద్యం వైపు ఆకర్షణ పెరుగుతుంది. ఒత్తిడి, డిప్రెషన్, ఉద్యోగ ఒత్తిడి, కుటుంబ సమస్యలు వంటి వాటినుంచి తప్పించుకోవడానికి తాత్కాలిక ఉపశమనం కోసం మద్యం వైపు వెళ్తున్నారు. మత్తు నుంచి బయటపడాలంటే మందు ఏంటి? ఆల్కహాల్ మత్తుకు మందు శారీరకంగా మాత్రమే కాకుండా మానసిక, సామాజిక కోణాల్లోనూ ఉండాలి. కాబట్టి దీన్ని విస్తృతంగా నాలుగు ప్రధాన మార్గాల్లో చూడొచ్చు. స్వీయ అవగాహన అవసరం. ముందుగా, మత్తు వల్ల కలిగే నష్టాన్ని పూర్తిగా గ్రహించాలి. ఇది జీవితాన్ని ఎలా నాశనం చేస్తుందో తెలుసుకోవాలి. ఒకసారి స్పష్టమైన అవగాహన వస్తే, మానసికంగా దాన్ని నివారించేందుకు చొరవ తీసుకోవచ్చు. "నాకు ఇది అవసరమా?' అనే ప్రశ్నను రోజూ అడుగుకుంటూ మద్యం మీద ఆధారపడే అలవాట్లను విడిచిపెట్టడం మొదలు పెట్టాలి. బాధ్యతాయుతంగా చెప్పాలంటే, ఆల్కహాల్ మత్తుకు శరీరంలో సహాయపడే కొన్ని ఔషధాలు ఉన్నాయి. ఇవి డిటాక్స్ ట్రీట్మెంట్ నుంచి బిహేవియరల్ థెరపీవరకు విస్తరించబడ్డాయి. ఉదాహరణకు నాల్ట్రెక్సోన్ ఇది మద్యం తాగాలనే ఆకాంక్షను తగ్గిస్తుంది. ఆకంప్రోసేట్ మానసికంగా మద్యం మీద ఉన్న ఆధారాన్ని తగ్గించేందుకు సహాయ పడుతుంది. డిసల్ఫిరామ్ మద్యం తాగిన తర్వాత శరీరంలో అసహన ప్రభావాలను కలిగించే ఔషధం. ఈ మందులను వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలి. స్వీయ వైద్యం ప్రమాదకరం. కౌన్సెలింగ్, థెరపీ ఒక వ్యక్తి మత్తునుంచి బయట పడాలంటే, అతని మనస్తత్వాన్ని మార్చడం అత్యవసరం. మానసిక ఆరోగ్య నిపుణుల సహాయంతో కౌన్సెలింగ్ తీసుకోవడం, థెరపీలకు హాజరవడం వలన మత్తుకు పునరాగమనాన్ని అడ్డుకోవచ్చు. సైకోథెరపీ, బిహేవియరల్ థెరపీ, వంటి విధానాలు ఎంతోప్రయోజనకరంగా ఉంటాయి. సమాజ, కుటుంబ మద్దతు వ్యక్తి పునరుద్ధరణలో కుటుంబం, స్నేహితుల పాత్ర ఎంతోకీలకం. వారికి మద్దతుగాఉండటం, విముఖత చూపకుండా సానుకూలంగా సహాయం చేయడం, అతనిలో మార్పురావడానికి ఆత్మవిశ్వాసం నింపడం అవసరం. అలాగే, సమాజస్థాయిలో మత్తు వ్యసనంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలి. ధ్యానం, యోగా, ఇవి మానసికంగా స్థిరత కలిగించి మత్తు మీద ఉన్న ఆకర్షణను తగ్గిస్తాయి. ఇది మత్తుమీద ఉన్న మక్కువను తగ్గించుతుంది. అవసరమైన సందర్భాల్లో రిహాబిలిటేషన్ సెంటర్లు, డీఅడిక్షన్ సెంటర్ల సహాయం తీసుకోవాలి. ప్రజల మానసిక, ఆరోగ్యస్థితులను బట్టి ప్రభుత్వాల ప్రచారాలు ఉండాలి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగాలి. ఆల్కహాల్ మత్తుకు మందు ఏది?' అనేది కేవలం ఔషధంపైనో, ప్రభుత్వాల పైనో ఉండరాదు. వ్యక్తిగత సంకల్పం, కుటుంబ మద్దతు, వైద్య సహాయం సమాజ కట్టుబాట్లపై ఆధారపడు తుంది. మత్తు నుంచి బయట పడేందుకు శక్తివంతమైన మందు అంటే - అవగాహన, ఆశ, మారాలనే సంకల్పమే. అలాంటి సంకల్పం కలిగినప్పుడు ఎలాంటి మత్తు నుండి అయినా విముక్తి సాధ్యమే. •

# పుస్తకం మస్తిష్క వికాస సాధనం!

బి.మధుపాళి

స్మార్ట్‌ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడం అంటే తెలియని విషయాలను తెలుసుకోవడం, అజ్ఞాన చీకట్ల నుంచి జ్ఞాన వెలుగుల వైపు అడుగులు వేయడం. చదవడానికి ఏకాగ్రత, తపన కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. నేటి డిజిటల్ యుగంలో లుకింగ్ కల్చర్ పెరుగుతూ, రీడింగ్ కల్చర్ సన్నగిల్లుతోంది". ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకోవాలి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. ప్రపంచ పోకడలకు అనుగుణంగా మనం ఎదగడానికి అవసరమైనది చదువు అని నమ్మాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాల చదువుకు తప్పనిసరిగా సమయం ఇవ్వాలి. వారు ఇతర ఆసక్తిగల అంశాలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాల ప్రాధాన్యం, వాటి అపార శక్తి సామర్థ్యాలను ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించేందుకు ప్రతియేటా 23 ఏప్రిల్ రోజున ప్రపంచ పుస్తకం, కాపీరైట్ దినోత్సవం (వరల్డ్ బుక్ అండ్ కాపీరైట్ డే)" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. 2025 వరల్డ్ బుక్ అండ్ కాపీరైట్ దినోత్సవ ఇతివృత్తంగా ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సాహిత్య పాత్ర" అని అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. ప్రపంచ పుస్తకం, కాపీరైట్ దినోత్సవ వేదికగా విద్య, సాహిత్యం, అవగాహన, సమగ్రాభివృద్ధి సాధనలో పుస్తకాల పాత్ర వెలకట్టలేనిది ప్రచారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతున్నది. చదువును నమ్మినవాడు ఎన్నటికీ చెడిపోడని, మనం నేర్చుకున్న ప్రతి విషయం మనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యావేత్తలు మాత్రమే సమాజంలో గుర్తింపు, గౌరవాలను పొందుతారని తెలుసుకోవాలి. 'పుస్తకం ఓ నిశ్శబ్ద విజ్ఞాన విస్ఫోటనం' అని గుర్తించిన వారు జీవితంలో ఎత్తు పల్లాలను సునాయాసంగా అధిగమిస్తారు. ప్రముఖుల జీవిత చరిత్రలు చక్కని మార్గాన్ని చూపుతాయి. 'స్వానుభవంతో నేర్చుకున్న వారుఅవివేకులు, ఇతరుల తప్పుడు అనుభవాలతో నేర్చుకున్నవారు వివేకవంతులు" అనే నినాదం విన్నాం. నేను పుస్తకాలు కొన్న తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను" అనే



సూత్రం పాటిస్తూ పుస్తకాలు కొనడానికి, వ్యక్తిగత లైబ్రరీ నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది, మెదడు చురుకుగా పనిచేస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేధావుల జీవిత చరిత్రలు మనకు చక్కని మార్గనిర్దేశనం చేస్తూ, ప్రేరణగా నిలుస్తాయి. పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన జరిగి సరైన ఉద్యోగం, సమాజంలో గుర్తింపు దొరుకుతాయి. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. స్థిరత్వంతో పౌర సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను, జీవన సాఫల్య ఫలితాలను ఇస్తుందని తెలుసుకోవాలి. పుస్తకాలు కొని చదవకపోయిన యెడల మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది. ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒకటి లేదా రెండు గంటలైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏటా వంద వరకు పుస్తకాలు చదివే విధంగా మనజీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు. మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్‌లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు. వారానికి సగటున 10 గంటలు చదివే అలవాటు ఉన్నవారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్న పుస్తక పఠనానికి అధిక సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది. అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గూర్చి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదావృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి అలవాటు. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువరాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ ముక్క పెట్టి లేదా పేజీ మూల మలిచి గుర్తుంచుకోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి. •

# కార్నీతో పుంజుకున్న లిబరల్ పార్టీ

## కెనడా పోల్ సర్వేలో వెల్లడి




**ఒట్టావా, ఏప్రిల్ 22:** దశాబ్దకాలం పాటు కెనడాకు ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రధాని పదవితోపాటు, పార్టీ నాయకత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నియమితులయ్యారు. అయితే ట్రూడో నిష్క్రమణ తర్వాత లిబరల్ పార్టీ తిరిగి పుంజుకున్నట్లు పలు ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో మార్క్ కార్నీ తనదైన మార్క్‌ను చూపిస్తున్నారని రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీకి ప్రజాబలం క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. నెల రోజుల క్రితం ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ కంటే చాలా వెనకబడపోయిన లిబరల్స్ ఎన్నికలకు ముందు తిరిగి పుంజుకోవడంతో ఆ పార్టీ మరోసారి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు పోల్స్ పేర్కొంటున్నాయి. తాజాగా విడుదలైన నానోస్ పోల్స్ లిబరల్స్‌కు 43.7 శాతం ప్రజామద్దతు లభించగా.. కన్జర్వేటివ్స్‌కు 36.3 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించాయి. ఓటింగ్ రోజు వరకు ఈ మద్దతు ఇలాగే ఉంటే 343 మంది సభ్యులున్న కెనడియన్ పార్లమెంట్‌లో లిబరల్ పార్టీ అధిక మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశాయి. కార్నీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కెనడా అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా తమ దేశంపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్‌లను ధీటుగా ఎదుర్కోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కెనడా అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, తన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించుకో వాల్సిన అవసరం గురించి ప్రజలకు పిలుపుని చ్చారు. కెనడాను తమలో కలుపుకుంటామని అగ్రరాజ్యం చేస్తున్న బెదరింపులను ఎదుర్కో వాలంటే దేశంలో బలమైన పార్టీ అధికారంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు. కెనడా పార్లమెంట్‌లోని 338 స్థానాలకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగుతున్నారు. అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో నుంచి వచ్చే దిగుమ తులపై మార్చి 4 నుంచి అమెరికా 25 శాతం సుంకాలు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు,డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యుఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.



## ప్రధాని మోడీ విమానానికి సౌదీ జెట్ విమానాల భద్రత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం సౌదీ అరేబియా చేరుకున్నారు. సౌదీలో ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం రెండురోజుల పర్యటన కోసం జెడ్డాలో అడుగుపెట్టారు. ప్రధాని విమానానికి రాయల్ సౌదీ వైమానిక దళానికి చెందిన ఎఫ్ 15 విమానాలు భద్రత కల్పించాయి. మోడీ సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే ఆదేశ రక్షణరంగ అత్యాధునిక జెట్ విమానాలు ప్రధాని మోడీ విమానానికి భద్రతగా వెంట వచ్చాయి. ఇదొక అపూర్వమైన ఘట్టంగా విదేశాంగశాఖ వెల్లడించింది. అంతేకాకుండా ఈ పర్యటన 40 సంవత్సరాలలో ఒక భారత ప్రధానమంత్రి జెడ్డాకు చేసిన మొదటి పర్యటన. భారతదేశం, సౌదీ అరేబియా మధ్య పెరుగుతున్న సంబంధాల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సౌదీ అరేబియాను విశ్వసనీయ స్నేహితుడుగా, వ్యూహాత్మక మిత్రదేశంగా అభివర్ణించారు. 2019లో వ్యూహాత్మక భాగస్వామ్య మండలి ఏర్పడినప్పటి నుండి, ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన విస్తరణ జరిగిందని ఆయన అన్నారు. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్, ప్రధానమంత్రి హిజ్ రాయల్ హైనెస్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు తన రెండు రోజుల సౌదీ అరేబియా పర్యటన గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఒక పోస్ట్‌లో తెలియజేశారు. ప్రధానమంత్రి మోదీ తన రెండు రోజుల గల్ఫ్ దేశ పర్యటనలో భాగంగా త్వరలో జెడ్డా చేరుకుంటారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడి, ఇంధనం, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో రెండు దేశాలు పరస్పరం ప్రయోజనకరమైన, బలమైన భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకున్నాయని ప్రధాని మోదీ అన్నారు.

భారతదేశం – సౌదీ అరేబియా కలిసి ముందుకు సాగుతాయని ప్రధాని మోదీ చెప్పినట్లు అరబ్ న్యూస్ తెలిపింది. ఇరు దేశాల ప్రజలకే కాకుండా మొత్తం ప్రపంచం కోసం శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తారన్నారు.

సౌదీ అరేబియా రక్షణ మార్కెట్‌పై గ్లోబల్‌డేటా సమాచారం ప్రకారం, మధ్యప్రాచ్య ప్రాంతంలో బోయింగ్‌నిర్మిత రక్షణ వేదికల అతిపెద్ద ఆపరేటర్లలో కింగ్‌డమ్ ఒకటి. దాని రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో 207 ఎఫ్15 ఈతి , 62 ఎఫ్15 ఈగిల్ జెట్ ఫైటర్లు ఉన్నాయి. ప్రధాని మోదీ ఏప్రిల్ 22 - 23 తేదీలలో సౌదీ అరేబియా పర్యటనలో ఉంటారు.

ప్రధానమంత్రి మోదీ, క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ భారతదేశంసౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి రెండవ సమావేశానికి సహ అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని జోడిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. సౌదీ అరేబియాతో తన దీర్ఘకాల, చారిత్రక సంబంధాలకు భారతదేశం గొప్ప ప్రాముఖ్యతను ఇస్తుందని బయలుదేరే ముందు ప్రధానమంత్రి మోదీ అన్నారు. రక్షణ, వాణిజ్యం, శక్తి,ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాలలో భాగస్వామ్యం కొత్త ఊపు సాధించింది.

# బోనస్ ఐదువేల డాలర్లు..

## జనాభా పెంపుపై యుఎస్ దృష్టి



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** దేశంలో జననాల రేటు తగ్గుదలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జన్మనిచ్చిన మహిళకు 5వేల డాలర్ల 'బేబీ బోనస్' వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు అమెరికన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. క్షీణిస్తున్న జననాల రేటును అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలకు సంబంధించి వైట్‌హౌస్‌లో ఇటీవల అంతర్గతంగా ఓ కీలక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సంతాన సాఫల్యంపై మహిళలకు అవగాహన, బిడ్డల్నికనే కుటుంబాలకు ప్రోత్సాహకాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రతి అమెరికన్ మాతృమూర్తికి 'బేబీ బోనస్' కింద 5వేల డాలర్లు, పన్ను మినహాయింపుల వంటి అంశాలు ప్రతిపాదించినట్లు తెలిసింది. వివాహం చేసుకున్న లేదా పిల్లలున్న వారికి ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌లలో 30 శాతం స్లాట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ వీటిపై కొంత వివాదం నడుస్తున్నట్లు సమాచారం.
ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, బిలియనీర్ ఎలాన్ మస్క్ వంటి నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో జనాభా పెరుగుదలపై ప్రణాళికకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. దీనిపై అనేకమంది ఆసక్తి కనబరిచినట్లు తెలుస్తోంది. దేశంలో క్షీణిస్తున్న సంతానోత్పత్తిపై పలు సందర్భాల్లో ప్రస్తావించిన వాన్స్ నాగరికత సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎలాన్ మస్క్ కూడా అధిక సంతానానికి మద్దతు తెలుపుతున్న సంగతి తెలిసిందే.

**క్షీణిస్తోన్న జననాల రేటు:** అమెరికాలో 1990ల నుంచి జననాల రేటు క్రమంగా క్షీణిస్తోంది. సిడిసి నివేదిక ప్రకారం 2023లో సంతా నోత్పత్తి రేటు 1.62గా ఉంది. రీప్లేస్‌మెంట్ రేటు కంటే చాలా తక్కువ. పెరుగుతున్న జీవన వ్యయం, శ్రామిక రంగంలో మహిళలు భాగస్వామ్యం పెరగడం, సామాజిక విలువల్లో మార్పులు వంటివి ఈ తగ్గుదలకు కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు.



## నిన్నుకూడా చంపేస్తాం

### సిద్ధిఖీ తనయుడికి ఇమెయిల్ బెదరింపులు..

**ముంబయి, ఏప్రిల్ 22:** మహారాష్ట్ర మాజీమంత్రి, ఎన్సీపీ నేత బాబాసిద్ధిఖీ హత్య తర్వాత ఇపుడు ఆయన కుమారుడు జీషాన్ సిద్ధిఖీని లారెన్స్ గ్యాంగ్ లక్ష్యంగా చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు జీషాన్‌కు మెయిల్స్ పంపుతూ బెదిరిస్తున్నారు. జీషాన్ సిద్ధిఖీకి బెదిరింపు మెయిల్స్ వచ్చాయని, నీతండ్రిలాగే నిన్నూ చంపేస్తాం అని అలా కాకూడదంటే రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రతి ఆరుగంటలకు ఒక బెదిరింపు మెయిల్‌ను పంపిస్తున్నారని దీనిపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఇక ఈ బెదిరింపులపై జీషాన్‌మాట్లాడుతూ 'డీ' అనే కంపెనీనుంచి ఈ మెయిల్ వచ్చిందని తెలిపారు. గత ఏడాది అక్టోబరులో సిద్ధిఖీ హత్యజరిగింది. తన కుమారుడి ఆఫీసులోనే ఈ హత్యజరిగింది. గుర్తుతెలీని దుండగులు ఆయనపై కాల్పులు జరిపి హత్య చేసారు. ఆరురౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖీ స్పాట్‌లోనే చనిపోయారు. అదే సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణాసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు రాలేదు. ఈ హత్య తామే చేసామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వెల్లడించింది. సుమారు 20 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. ప్రధాన షూటర్ అని భావిస్తున్న శివకుమార్ కూడా పోలీసులకు చిక్కాడు. అయితే బిష్ణోయ్‌గ్యాంగ్‌తో తనకు సంబంధం ఉందని విచారణలో అంగీకరించాడు. అన్మోల్ బిష్ణోయ్ ఆదేశాల మేరకే హత్య చేసామని పోలీసుల వద్ద అంగీకరించాడు.




## జూన్ 30నుంచి మానససరోవర్ యాత్ర

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ఐదేళ్ల విరామం తర్వాత కైలాస మానసరోవర్ యాత్ర ప్రారంభం కానుంది. జూన్ 30న దిల్లీ నుంచి 50 మందితో కూడిన తొలి బృందం కైలాస శిఖర దర్శనానికి వెళతాయని కేంద్రం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్ జిల్లాలో ఉన్న లిపులేక్ పాస్ గుండా యాత్ర కొనసాగుతుందని వెల్లడించాయి. యాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు దిల్లీలో కేంద్ర విదేశాంగ శాఖ, ఉత్తరాఖండ్‌కు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తీర్థయాత్ర నిర్వహణను కుమావ్ మండల్ వికాస్ నిగమ్‌కు అప్పగించాలని నిర్ణయించారు. మొత్తం ఐదు గ్రూపులు కైలాస యాత్రకు వెళతాయని అధికారులు తెలిపారు. ఒక్కో గ్రూపులో 50 మంది ఉంటారని వెల్లడించారు. మొదటి బృందం జూలై 10న లిపులేఖ్ పాస్ ద్వారా చైనాలో ప్రవేశిస్తుంది. చివరి బృందం ఆగస్టు 22న తిరిగి వస్తుంది. దిల్లీనుంచి బయలుదేరినప్రతిబృందం టనక్‌పుర్, ధార్చులాలో ఒక్కొక్క రాత్రి, గుంజీ, నభిదాంగ్‌లో రెండు రాత్రులు బస చేసిన తర్వాత చైనాలోకి ప్రవేశిస్తుంది. కైలాస యాత్ర తర్వాత తిరిగి చైనా నుంచి బయలుదేరి బుండి, చౌకోరి, అల్మోరాలో ఒక రాత్రి బస చేసిన తర్వాత దిల్లీకి చేరుకుంటుంది. మొత్తం యాత్ర పూర్తవడానికి ఒక్కో బృందానికి 22 రోజుల సమయం పడుతుంది. కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లే భక్తులకు దిల్లీతో పాటు ఉత్తరాఖండ్‌లోని గుంజిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు చెప్పారు. ఏటా నిర్వహించే కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు పర్యటనలను కొవిడ్ కారణంగా 2020లో నిలిపివేశారు. ఆ తర్వాత గల్వాన్ ఘర్షణతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడం వల్ల యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. తాజాగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ చర్యలకు మార్గం సుగమైంది. అయితే, ఈ యాత్రలో పాల్గొనేందుకు వయసు 1870 సంవత్సరాల వరకు ఉండొచ్చు. కానీ ఫిట్‌గాఉంటేనే ఈ యాత్ర చేయాలి. రిజిస్ట్రేషన్లు అధికారిక ఎంఇఎ పోర్టల్ ద్వారా నిర్వహించబడతాయి. ఇక ఈ యాత్ర ప్రాథమికంగా రెండు మార్గాలద్వారా నిర్వహిస్తుంది. వాటిల్లో యాత్రికులు ఏదైనా ఎంచుకోవచ్చు. ఒకటి లిపులేఖ్ పాస్(ఉత్తరాఖండ్), నాథులా పాస్(సిక్కిం). అయితే ఎంచుకున్న మార్గం బట్టి ఖర్చులు ఉంటాయి. లిపులేఖ్ పాస్‌రూట్ అయితే ఒక్కొక్కరికి రూ.1.8 లక్షలురూ.2లక్షలు, నాథు లా పాస్ అయితే రూ.2.2 లక్షల రూ.2.4 లక్షల వరకు ఉండొచ్చు. అయితే మూడో మార్గం నేపాల్ నుంచి ఉంటుంది కానీ, ఖర్చు రూ.3.2 లక్షలు, అంతకంటే ఎక్కువగా ఉంటుంది.

# ఏకకాలంలో ఆరు జంటలకు పెళ్లిళ్లు



**హిస్సార్(హర్యానా), ఏప్రిల్ 22:** హంగు ఆర్భాటాలతో భారీ ఎత్తున జరిగే పెళ్లిళ్లు ఇటీవలి కాలంలో భారీ స్థాయిలోను సంఖ్యాపరంగా కూడా చూస్తున్నాం. 16 రోజుల పెళ్ళిళ్లు కూడా జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో హర్యానాకు చెందిన ఓ కుటుంబం తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలను ఆనందింపచేస్తోంది. హర్యానాలోని హిసార్ జిల్లాలోని గవాద్ గ్రామంలో ఈ నెల 18, 19వ తేదీల్లో పెళ్లిళ్లు జరిగాయి. మొత్తం 6 పెళ్లిళ్లు జరగ్గా అందులో నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఇందులో విచిత్రం ఏంటంటే వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. ఆ గ్రామానికి చెందిన పూనియా కుటుంబంలోని అన్నాదమ్ముల పిల్లలకు ఒకే మండపంలో రెండు రోజుల్లో ఆరు పెళ్లిళ్లు జరిపించారు. దీంతో గవాద్ గ్రామంలో ప్రత్యేకమైన సందడి నెలకొంది. రాజేష్ పూనియా, అమర్ సింగ్ పూనియా అనే ఇద్దరు అన్నాదమ్ములకు మొత్తంగా ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఒక్కొక్కరికీ ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. అయితే వీరిద్దరి అన్నాదమ్ములకు చెందిన ఆరుగురు పిల్లలకు ఒకేసారి పెళ్లిళ్లు చేయాలని వారు నిర్ణయించుకున్నారు. దీంతో డబ్బు, సమయాన్ని కూడా ఆదా చేయాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీరి కుటుంబంలోని ఇద్దరు కుమారుల పెళ్లి ఏప్రిల్ 18వ తేదీన జరగ్గా ఆ తర్వాతి రోజు అంటే ఏప్రిల్ 19వ తేదీన నలుగురు కుమార్తెల వివాహాలు అదే కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఇక పూనియా ఇంట పెళ్లి బాజాలకు ఈ గవాద్ గ్రామం మొత్తం తరలివచ్చింది. పూనియా కుటుంబం చేసిన ఈ కుటుంబ పెళ్లిళ్లపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. తాను కూడా ఇలాగే పెళ్లిళ్లు చేస్తానని గవాద్ గ్రామ నివాసి అయిన రమేష్ హావల్దార్ మీడియాకు వెల్లడించారు. తాము కూడా భవిష్యత్‌లో అలాగే చేస్తామని ఇలా కుటుంబాలు కలిసి వివాహం చేసుకోవడం ద్వారా డబ్బు ఆదా కావడమే కాకుండా, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించే సందేశం ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ద్రవ్యోల్బణం తట్టుకోవడానికి, సమయాన్ని ఆదా చేసుకోవడానికి కలిసి నిర్ణయాలు తీసుకోవడం చాలా అవసరం అని రమేష్ హావల్దార్ తెలిపారు. తాము గ్రామంలోని గుడిసెల్లో నివసిస్తున్నామని తమ ఊరికి చెందిన సోదరులు రాజేష్ పూనియా, అమర్ సింగ్ పూనియా తమ ఆరుగురు కుమారులు, కుమార్తెలను ఒకేసారి వివాహం చేశారని స్థానికులు చెబుతున్నారు. రాజేష్ పూనియాకు కవిత, ప్రియాంక అనే ఇద్దరు కుమార్తెలు సందీప్ అనే కుమారుడు ఉన్నాడు. అమర్ సింగ్ పూనియాకు మోనికా, ప్రీతి కుమార్తె, సంజయ్ అనే కుమారుడు ఉండగా వారి పెళ్లిళ్లు ఈనెల 18, 19 తేదీల్లో జరగ్గా ఆ వివాహాలకు ఊరంతా హాజరయ్యారై తమ సంపూర్ణ మద్దతు పలికి కానుకలు ఇచ్చారు.



## ఠారెత్తిస్తోన్న ఎండలు

### పలు రాష్ట్రాల్లో వడగాడ్పులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య భారతదేశంలో వీటి ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో దక్షిణ ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా, విదర్భ ప్రాంతాలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ 25 వరకు యెల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు ప్రభావం ఉంటుందని ఐఎండి తెలిపింది. ఏప్రిల్ 25 వరకు వేడి, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వివరించింది. అయితే, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మణిపుర్, మేఘాలయ్, నాగాలాండ్, త్రిపుర, మిజోరంలో భారీ వర్షాలు పడనున్నట్లు తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లో బలమైన ఎదురుగాలు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ పిడుగుల పడే ఛాన్స్ ఉందని చెప్పింది. వర్షాలు పడుతాయట. మరోవైపు ఇటీవలే వ్యవసాయ రంగానికి తీపి కబురు చెప్పింది భారత వాతావరణ శాఖ ఐఎండీ. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం అంటే జూన్ నుంచి సెప్టెంబరు నెలల్లో దేశ వ్యాప్తంగా సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి వానలు పడే అవకాశంఉందని ప్రటించింది. 1971 నుంచి 2020వరకు ఉన్న గణాంకాలను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా దీర్ఘకాలంలో సగటున 87 సెంటీమీటర్ల వర్షం కురుస్తోందని, ఇప్పుడు అందులో 105 దాకా ర్షాలు పడొచ్చని అంచనా వేసింది. అలాగే సాధారణానికి మించి, అధిక వర్షపాత అంచనాలను కలిపి చూస్తే 56.మంచి వర్షాలకు అవకాశం ఉందని చెప్పింది. అలానే ఈ ఏడాదిలో ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు లేవని వివరించింది. డిసెంబరుమార్చి మధ్య హిమాలయాలు, యూరో ఏసియా ప్రాంతంలో మంచు తక్కువగా ఉందని, ఇవన్నీ మంచి వర్షాలు కురవడానికి శుభపరిణామాలని ఐఎండి వివరించింది. అలాగే ఈశాన్యరాష్ట్రాలు, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్, తమిళనాడు, బీహార్‌లలో సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. మిగిలిన అన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వానలు కురిసే వీలుందని వివరించింది.

# అంబర్‌కోటను సందర్శించిన జెడివాన్స్ ఫ్యామిలీ

**జైపూర్, ఏప్రిల్ 22:** నాలుగురోజుల పర్యటనలో భాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడావాన్స్ కుటుంబంతో సహా సోమవారంనుంచి భారత్‌లో పర్యటిస్తున్నారు. మంగళవారం వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్ వివేక్, కుమార్తె మీరాబెల్‌లతో జయపురలోని అంబర్‌కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటు చేసారు. కోటలోప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు. అనంతరం ఆయన రాష్ట్రగవర్నర్ హారిబావు కిషన్‌రావ్ బగాడేతో సమావేశం మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగించనున్నట్లు సమాచారం. సోమవారం ఢిల్లీ చేరుకున్న వాన్స్ దంపతులు ప్రధాని మోడీని కలిసారు. ఆయనతో విందు అనంతరం సోమవారం రాత్రికే జయపురలోని



విలాసవంతమైన రాంబాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు. 23వ తేదీ ఉదయం వాన్స్ కుటుంబం ఆగ్రాకు వెళుతుంది. అక్కడ తాజ్ మహల్‌ను భారతీయ కళలకు సంబంధించి శిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తర్వాత మళ్లీ వారు జయపురకు వెళతారు. 24న జయపురనుంచి బయలుదేరి అమెరికాకు వెళతారు.




## ఓం ప్రకాష్ హత్య కేసులో సంచలన నిజాలు

### హత్య కోసం గూగూల్‌లో శోధించిన భార్య పల్లవి

భార్య పల్లవితో కర్నాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్(ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** కర్నాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్ దారుణ హత్యలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓం ప్రకాష్‌ను హత్య చేసిన ఆయన సతీమణి పల్లవి ఇందుకోసం గూగుల్‌లో శోధించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒక మనిషిని చంపాలంటే ఒంటిపై ఏ ఏ భాగాలలో కత్తితో పొడవాలి, ఒంట్లోని ఏ ఏ భాగాల్లో గల నరాలను, రక్త నాళాలను తెంపాలి...? రక్తస్రావం ఆగకుండా వుండాలంటే? ఎలా ఎలాంటి ఆయుధం వాడాలి? అనే వి షయాలను పల్లవి గూగుల్‌లో శోధించినట్లు ఈ కేసును విచారిస్తున్న బెంగళూరు పోలీసుల విచారణలో తేలింది. ఆదివారం తెల్లవారుజామున ఓం ప్రకాష్ బెంగళూరు లోని హెచ్‌ఆర్ఎస్ లే అవుట్‌లోని తన నివాసంలో హత్యకు గురవడం తెలిసిందే. మొదట అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు ఆనక ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, తన భర్తను చంపాక కొందరి ఫోన్లకు ఓం ప్రకాష్ భార్య పల్లవి పంపిన సందేశాల ఆధారంగా ఆమె స్వయంగా ఈ దారుణానికి ఒడిగట్టిందని పోలీ సులు నిర్ధారణకు వచ్చారు. ఈ దారుణంలో పల్లవికి కూతురు కృతి కూడా సహకరించిందని తేలింది. దీనిపై మరిన్ని విషయాలను వెలికి తీసేందుకు ఆదివారం నాడే తల్లి, కూతుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా కొత్త విషయాలు వెలుగు చూశాయి. కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న పల్లవికి ఇంట్లోనే వైద్యం అందిస్తున్నారు. అయితే దీనిని ఆమె హౌస్ అరెస్టుగా భావించి భర్తపై అనుమానాలు పెంచుకుంది. ఇదే సమయంలో ఉత్తర కన్నడ జిల్లా దండేలి వద్ద ఓం ప్రకాష్‌కు వున్న 17 ఎకరాల భూమిని తన సోదరి సరిత, కుమారుడు కార్తికేష్ పేరిట బద లాయించాలని ఆయన నిర్ణయించడం పల్లవికి నచ్చలేదు. దీంతో పాటు ఓం ప్రకాష్ తన ఇంట్లో కంటే సోదరి సరిత, కుమారుడు కార్తికేష్ వద్ద ఎక్కువగా వుండేవారు. ఇది కూడా పల్లవికి నచ్చలేదు. ఈ కారణాల వల్ల పల్లవి తన భర్త ఓం ప్రకాష్‌ను హత్య చేసేందుకు నిర్ణయించుకుంది. ఇందుకు తన కుమార్తె కృతి సహాయాన్ని తీసుకుంది. ఇద్దరు కలిసి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమ యంలో పథకం ప్రకారం ఓం ప్రకాష్‌తో మొదట గొడవపడి ఆ తరువాత కళ్లలో కారం చల్లి, అనంతరం తాడుతో బంధించి, కత్తితో, బీరు బాటిల్‌తో ఒంటిపై ఇష్టాను సారం పొడిచి చంపేశారు. భర్తను చంపాక పల్లవి ఈ విషయాన్ని కొందరు ఐపిఎస్ అధికారుల భార్యలకు ఫోన్‌లో మెసేజ్‌లు పంపడంతో ఈ విషయం బయటకు వ చ్చింది. దీంతో ఓం ప్రకాష్‌ను ఆయన భారన్య పల్లవి హత్య చేసిందని పోలీసులకు బలమైన సాక్ష్యం లభించింది. ఈ కేసులో ఓం ప్రకాష్ భార్యను పోలీసులు కోర్టులో హాజరు పరచగా న్యాయ స్థానం 14రోజుల రిమాండు విధించడంతో జైలుకు తరలించారు. కుమార్తె కృతిని ఇంకా విచారిస్తున్నారు. మరోవైపు ఓం ప్రకాష్ భౌతిక కాయానికి సోమవారం సాయంత్రం బెంగళూరులో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి, ఆయన కుమారుడు కార్తికేష్ తండ్రికి అంత్యక్రియలు జరిపారు.

# పార్లమెంటే సుప్రీం: ధన్‌ఖడ్ వ్యాఖ్యల దుమారం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఆదేశించలేదంటూ ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అంతేకాకుండా మంగళవారం మరోసారి ఆయన సంచలన వ్యాఖ్యలుచేసారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్ అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీని విధించిన ప్రధాని అయినా సరే ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం, రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్‌కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటేసుప్రీం అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడాధన్‌ఖడ్ ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలోప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు. రాష్ట్ర గవర్నర్‌పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని గడువు ఇస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలుచేసారు. ప్రజాస్వామ్యం అనేది ప్రజలకోసం మాత్రమే. అది ఎన్నికైన ప్రతినిధులకు రక్షణ కల్పించే ఓ భాండాగారం అని ధన్‌ఖడ్ మరోసారి తెగేసి చెప్పారు. రాజ్యాంగం ఎలా ఉండాలో నిర్ణయించడంలో ఎన్నికైన ప్రతినిధులే అంతిమ యజమానులు. పార్లమెంట్‌కంటే ఎక్కువ అధికారం ఉన్న వ్యవస్థ గురించి మన రాజ్యాంగంలో లేదు. కనుక మనం దేశంలో పార్లమెంటే సుప్రీం అని ధనఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసి మరోసారి విపక్షాలకు అస్త్రం అందించారు. మరో అడుగు ముందుకేసి రాజ్యాంగ అధికారిగా తాను మాట్లాడే ప్రతిమాట అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ స్పష్టం చేసారు. సుప్రీంకోర్టుపై తానుచేసిన వ్యాఖ్యలకు విమర్శించిన వారిపై ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించ కూడదని న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థపరిధిలోకి తలదూర్చకూడదని అలా జరిగితే అది రాజ్యాంగ విరుద్ధం అవుతుందని ధన్‌ఖడ్ అన్నారు.

# ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం మీడియా

### - ఈ ఏడాది మెరిట్ సాధించిన జర్నలిస్టుల పిల్లలకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం

### - జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**చిత్తూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం మీడియా అని సమాజంను ముందుకు తీసుకెళ్ళే మార్గదర్శకులుగా పాత్రికేయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం చిత్తూరు జిల్లా ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాల్గవ మహాసభలు జరిగాయి. ఈ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మాట్లాడుతూ మీడియా వృత్తి మహోన్నతమైనదని, కార్గిల్ యుద్ధం లాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి పాత్రికేయులు వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. లాబాపేక్ష లేకుండా సమాజం పట్ల అవగాహన కలిగి, ప్రేమతో సేవలు అందిస్తున్నారన్నారు. పాత్రికేయులు సమాజంను ముందుకు నడిపించడానికి మార్గర్శకులుగా వుండాలన్నారు. ఈ ఏడాది మెరిట్ సాధించిన జర్నలిస్టుల పిల్లలకు తన వంతు సహాయంగా 2 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వార్తలు ప్రచురించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేలా వార్తా ప్రసారాలు వుంటే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం జర్నలిస్టులకు గృహ నిర్మాణం, హెల్త్ కార్డులను సమకూర్చనుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు ఒత్తిడి లేకుండా పూర్తి స్వేచ్ఛతో పని చేయాలని, కచ్చితమైన సమాచారంతో వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. సామాన్య ప్రజానీకం సమాచారం కోసం వార్త పత్రికలు, న్యూస్ ఛానల్స్ ఆశ్రయిస్తుంటారని, పూర్తి సమాచారంతో వార్తలను ప్రసారం చేయాలన్నారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకువచ్చి పరిష్కారం చూపేలా వార్తలు వుండాలన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి వుందని, ఎదైనా సమస్యలు వుంటే జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సమాజంలో జరిగే వాస్తవాలను ప్రచురించడం ద్వారా పాత్రికేయ విలువలు పెరుగుతాయని, నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి సిఎం దృష్టికి తీసుకెళ్తామని, భయం, పక్షపాతం లేకుండా కులం, మతం, పార్టీలకు అతీతంగా వార్తలు ప్రచురించే స్వేచ్ఛ పత్రికారంగానికి వుండాలన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ సమాజంలో మేల్కొలపడంతో పత్రికారంగం ముందుండాలని, సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రజలను వివరించి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల సిఎం నారా చంద్రబాబునాయుడు బాధ్యతతో వ్యవహరిస్తున్నారని, పాత్రికేయ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలు రానున్న రెండు దశాబ్దాల కాలం వరకు పాత్రికేయులకు రక్షణ కవచంగా పని చేయనుందన్నారు. పాత్రికేయులను సమాజం గొప్ప దృష్టితో చూస్తుందన్నారు. వ్యవస్థలు గాడితప్పే సమయంలో మీడియా వ్యవస్థ దారిలో పెట్టిన సందర్భాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన సొంత నిధులతో 400 మంది పాత్రికేయుల హెల్త్ ఇన్సురెన్స్‌కు సంబంధించి రూ.5.20 లక్షలు చెక్కును పాత్రికేయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు వెంకటరావ్, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, జిల్లా ఎపిడబ్ల్యుఎఫ్ నాయకులు, పెద్ద ఎత్తున విలేకరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఎపిడబ్ల్యుజెఎఫ్ నాల్గవ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### -టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుపతి,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** పారిశ్రామిక విప్లవం తరువాత అభివృద్ధి ,సంపద సృష్టి కారణంగా వర్ణాలు పెరగడానికి వాతావరణంలో 50శాతం కార్బన్ వ్యర్థాలు పెరిగాయని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా వివిధ దేశాలు తీసుకుంటున్న జాగ్రత్తలు వివరించారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతను గుర్తుచేస్తుందని ఆయన వివరించారు.మంగళవారం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం పరిశోధన అభివృద్ధి ,సైన్స్‌సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ భూదినోత్సవం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అధ్యక్షత వహించగా ప్రకృతిని కాపాడుకుందాం,భూమికి పునరుజ్జీవం ఇవ్వమని పిలుపునిచ్చారు. ఈ విప్లవంలో మనం కూడా బాధ్యత తీసుకుని పాటించడానికి సంకల్పం చేద్దామన్నారు. ప్రకృతిలో జీవరాశులన్నీ భూమిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి ఉన్నాయన్నారు.భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణలో వేప,మామిడి,చింత, ఉసిరి, రాగిచెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజినీ,సైన్స్‌సిటీ సిఇఒ కేశినేని వెంకటేశ్వర్లు, సేవ్ సోయిల్ ఎన్‌జిఒ ప్రతినిధి దామోదరంనాయుడు, పి.మార్కండేయులురెడ్డి, విజయకుమార్‌నాయుడు, ఆచార్య ఆర్.రమణమూర్తి, ఆచార్య ఆర్.ఉష, సభ్యులు,విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆంధ్ర ఛాలెంజ్ 2కె 25 పోస్టర్లు ఆవిష్కరించారు.

## నాపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారు

### - అనంతపురంలో బోరుగడ్డ అనిల్ వ్యాఖ్యలు

**అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో** పోలీసులు తప్పుడు కేసు పెట్టారని, నేనెలాంటి దొంగ సర్టిఫికెట్లు పెట్టలేదు అని, నేను తప్పు చేయలేదని న్యాయస్థానంలో నిరూపించుకుంటానని వైసిపి నేత బోరుగడ్డ అనిల్ వ్యాఖ్యానించారు. ఒక చర్చ్ వివాదంలో అనంతపురం సీఐని బెదిరించిన కేసులో బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అనంతపురం మూడవ పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం పిటి వారెంట్‌పై ఇక్కడికి పోలీసులు తరలించారు. అనంతపురం కోర్టులో విచారణను ఈనెల 30కి వాయిదా వేస్తూ అప్పటివరకు బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం జిల్లాలోనే ఉంచాలని జడ్జి ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగా కోర్టు విచారణ ముగించుకొని బయటికి వచ్చిన సమయంలో బోరుగడ్డ అనిల్‌తో మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా నేను 30 కేజీల బరువు తగ్గాను అని, నేను ఎలాంటి దొంగ సర్టిఫికెట్స్ పెట్టలేదు అని, గుంటూరు డాక్టర్ రాఘవ శర్మ నే సర్టిఫికెట్స్ ఖచ్చితంగా ఇచ్చాడు అన్నారు. పోలీసుల అనవసరంగా తప్పుడు కేసులు పెట్టారని, సర్టిఫికెట్స్ విషయంలో న్యాయస్థానాలపై నమ్మకం ఉంది అని, కోర్టు లను ఆశ్రయిస్తానని ఆయన వెల్లడించారు. గుంటూరు డాక్టర్ రాఘవ శర్మ సర్టిఫికెట్లు ఇచ్చిన విషయంపై అవసరమైతే సీసీ కెమెరాల ఫొటోస్, గూగుల్ టేకౌట్స్ తిస్తాం అని బోరుగడ్డ అనిల్ వెల్లడించారు .

## యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పై వీగిన అవిశ్వాసం

**రమాకుమారిఅనకాపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు వైసీపీ భంగపాటు కు గురైంది. రెండూ కూడా అవిశ్వాస తీర్మానానికి సంబంధించినవి కావడం విశేషం. విశాఖ మహానగర మేయర్ పై కూటమి కార్పోరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడం, దీనికి వైసీపీ కార్పోరేటర్లు దుమ్మా కొట్టడం, ఎట్టకేలకు కూటమి నాయకులు విజయం సాధించడం తెలిసిందే. కానీ ఎలమంచిలి లో మాత్రం సీన్ రివర్స్. ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి పై వైసీపీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. మంగళవారం ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మానం కు వైసీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా దుమ్మా కొట్టడంతో అవిశ్వాసం వీగిపోయింది. ఎందుకు అవిశ్వాసం పెట్టినట్లు ? ఎందుకు దుమ్మా కొట్టారో తెలియదు కానీ రెండు సార్లు వైసీపీ భంగపాటు కు గురైంది. మున్సిపాలిటీలో గతంలో జరిగిన ఎన్నికల్లో 25 కౌన్సిల్ మెంబర్లకు 23 వైసిపి, 1 టిడిపి 1 ఇండిపెండెంట్ గెలుచుకున్నారు. అప్పుడు ఏకగ్రీవంగా మున్సిపల్ చైర్ పర్సన్ గా పిల్లా రమాకుమారి ని ఎన్నుకున్నారు. అయితే ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమా కుమారి బిజెపి లోకి చేరడంతో. మార్చి 27న వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు,

అర్రేపు గుప్త ఆధ్వర్యంలో 18 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి మున్సిపల్ కమిషనర్ , జిల్లా కలెక్టర్ లకు చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఏప్రిల్ 22న అవిశ్వాసానికి సమయం ఇచ్చారు. అయితే అవిశ్వాసంలో 17 మంది కౌన్సిలర్లు ఎటువైపు ఉంటే వారిదే గెలుపు, ఈలోగా క్యాంప్ రాజకీయాలు జరగడంతో వైసీపీకి 10 మంది కౌన్సిలర్లే మిగిలారు. దీనిపై 22 మంగళవారం ఆర్డీవో, ప్రిసైడింగ్ ఆఫీసర్ వివి రమణ ఆధ్వర్యంలో అవిశ్వాసానికి సమావేశం ఏర్పాటు చేయగా, 10.30 వరకూ చూసిన ఆర్డీవో వివి రమణ ఎవరు రాకపోవడంతో అవిశ్వాసానికి అవసరమైన కోరం రాలేదని 12 గంటలకు వాయిదా వేశారు. 12 గంటలకు కూడా ఎవరు రాకపోవడంతో అవిశ్వాస వీగిందని యధావిధిగా చైర్ పర్సన్ రమాకుమారి కొనసాగుతారని ప్రిసైడింగ్ ఆఫీసర్ వివి రమణ, కమిషనర్ ప్రసాద్ రాజు ప్రకటించారు.

## ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత లోపించింది - మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ నిర్ణయాలలో పారదర్శకత లోపించిందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు పెరిగిపోయాయని, వ్యవస్థలను దిగజార్చుతున్నారని ఆరోపించారు. విశాఖపట్నంలో సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన భూమిని ఎలాంటి గుర్తింపు లేని సంస్థకు కేవలం ఒక్క రూపాయికే కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, లులూ గ్రూపునకు రూ.2,000 కోట్ల విలువైన భూమిని అప్పగించారని మండిపడ్డారు. ఎంపీ మిథున్ రెడ్డిని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని, లేనిపోని ఆరోపణలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కీలక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి అరెస్టులు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మద్యం విధానం విప్లవాత్మకమైనదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని పూర్తిగా పక్కనపెట్టారని, రూ. 3500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల కింద గత ఏడాది రూ. 3,900 కోట్లు బకాయి పెట్టారని, ఈ ఏడాది కూడా చెల్లింపులు జరగడం లేదని తెలిపారు. పెన్షన్ల సంఖ్యను తగ్గించారని, కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. తాము గతంలో సంక్షేమ పథకాలకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడానికి బటన్ నొక్కామని, ఇప్పుడెందుకు అలా చేయడం లేదని జగన్ ప్రశ్నించారు. బటన్ నొక్కితే డబ్బులు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళతాయని, మధ్యలో దోచుకోవడానికి ఏమీ ఉండదనే ఉద్దేశంతోనే చంద్రబాబు బటన్ నొక్కడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతుండగా, ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పీఏసీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని జగన్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వ వైఫల్యాలను, అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైసీపీకి మీడియా బలం తక్కువగా ఉన్నందున... సోషల్ మీడియాను, ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌ను ఒక ఆయుధంగా వాడుకోవాలనే విషయంపై కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడినప్పుడు కూడా ఇలాంటి దుష్ప్రచారాలు ఎదుర్కొన్నామని, అయినా ప్రజలు ఆశీర్వదించారని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరని, ప్రజల అంతిమ తీర్పును ఎవరూ మార్చలేరని ధీమా వ్యక్తం చేశారు. కష్టకాలంలోనే నాయకులు ఎదుగుతారని, ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు.

రాజధాని అమరావతిలో నిర్మాణ పనుల అంచనాలను భారీగా పెంచి, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని అన్నారు. గతంలో రూ. 36 వేల కోట్లుగా ఉన్న పనుల అంచనాలను, సిమెంట్, స్టీల్ ధరలు పెరిగాయనే సాకుతో ఇప్పుడు రూ. 77 వేల కోట్లకు పెంచారని జగన్ ఆరోపించారు. జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ వంటి పారదర్శక విధానాలను తొలగించి, మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి తీసుకురావడం ద్వారా దోపిడీకి ఆస్కారం కల్పిస్తున్నారని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టును ఆయన ఖండించారు. ఇది కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ఠ అని అన్నారు.

## ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని దాడి

### ఫోన్ తీసుకొని ఇవ్వలేదని కళాశాల గ్రౌండ్‌లో చెప్పుతో కొట్టిన విద్యార్థిని

**తగరపువలస ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మానవ సంబంధాలను సెల్ఫోన్ నాశనం చేస్తుంది. విద్యార్థిని విద్యార్థులు సెల్ఫోన్లకు బానిసై విచక్షణ మరచిపోతున్నారు. సెల్ ఫోన్ లేకపోతే ఉండలేమన్న పరిస్థితుల్లో విద్యార్థులు దిగజారి పోతున్నారు. ఇందుకు నిదర్శనమే భీమునిపట్నం మండలం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం

జరిగిన సంఘటనలో ఎన్సీసీ టీచర్ గాపనిచేస్తున్న ఉపాధ్యాయురాలను అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థిని చెప్పుతో కొట్టడం చాలా బాధాకరమైన విషయం. సెల్ ఫోన్ మాట్లాడుతూ పెద్దగా అరుస్తుందని కళాశాలలో పనిచేస్తున్న ఎన్సీసి టీచర్ ఆ విద్యార్థిని మందలించడానికి సెల్ ఫోన్ లాక్కుంది.

# కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తోంది

### - కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి ధ్వజం

**అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలిందని, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై బాదుడు కార్యక్రమం చేస్తుందని, వైసీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ అప్పులు చేస్తోందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. వైకాపా, టిడిపిలు రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, రెండు పార్టీలు దొందూ దొందే అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ అర చేతిలో వైకుంఠం చూపిస్తే..చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు, వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మధ్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసి వెళ్ళి పోయిందన్నారు. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లుంది చంద్రబాబు ప్రభుత్వం పని తీరు ఉందన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు నలభై బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారైందన్నారు. పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయన్నారు. అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది అని చెప్పారు. బాదుడు కార్యక్రమం భారీగా సాగుతోంది అని, సర్దుబాటు చార్జీల పేరుతో రు 15,485 కోట్ల అదనపు భారం మోపిందని ఆయన ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయి. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు అని, యువతను నమ్మించి మోసగించడం జరిగింది అన్నారు. వైద్య విద్యను అమ్మకానికి పెట్టింది అని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్య విద్యను లేకుండా చేసింది అని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్ర సచివాలయం విషయంలో డబ్బు దుర్వినియోగం జరుగుతోంది అని, కేవలం రూ.616 కోట్లతో తెలంగాణా రాష్ట్ర సచివాలయాన్ని అద్భుతంగా నిర్మించారు కానీ ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక సచివాలయానికి రూ.1151 కోట్లు ఖర్చు చేశారు. మళ్ళీ రూ.4689 కోట్లు అప్పు తెచ్చి పర్మినెంట్ బిల్డింగ్ అంటూ ఇప్పుడు నిర్మాణాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోడీ రాజధాని అమరావతికి శంఖు స్థాపన చేశారు. మళ్ళీ 2025 మే 2న శంఖు స్థాపన చేయబోతున్నారు అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర యువజన హామీలపై ప్రధాని మోడీ స్పందించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ చైర్మన్ దాదా గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే శంకర్, జిల్లా ఓ.బి.సి. చైర్మన్ రామ్ చరణ్ యాదవ్, సేవాదళ్ నాయకులు హరి రాయల్, సీనియర్ నాయకులు కొండారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి

## అధునాతన సౌకర్యాలతో సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం

### - మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,ఏప్రిల్22.ప్రభాతవార్తప్రతినిధి:** అధునాతన సౌకర్యాలతో నూతన సంక్షేమ హాస్టళ్ళ నిర్మించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి డోలా సమీక్షా సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల మరమ్మతులు, కొత్త హాస్టళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు, డిజైన్లు పరిశీలించి చర్చించి పలు డిజైన్లు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.అధునాతన సౌకర్యాలతో హాస్టళ్ల భవనాలు నిర్మించాలి. కొత్తగా నిర్మించే ప్రతి హాస్టల్లో రీడింగ్ రూమ్, జిమ్, ఎయిర్ వెంటిలేషన్ తప్పనిసరిగా ఉండాలి. ఈ ఏడాది నవంబర్ లోపు హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాల కల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. ఎం నాయక్, ఏపీ, ఎస్. ఐడిసి ఎండీ దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం సచివాలయంలోనే మన్య్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కుల ధ్రువీకరణ పత్రాల అప్పీల్లపై హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లా స్థాయి స్క్రూటీని కమిటీలో సహేతుకంగా, సమగ్రమైన, నిష్పక్షపాత విచారణ చేయాలన్నారు. తప్పుడు ధ్రువీకరణాలు పత్రాలు జారీచేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## సిఎం చంద్రబాబును కలిసిన బిజెపి సీనియర్ నేత విష్ణు వర్ధన్ రెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో** బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్.విష్ణు వర్ధన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మంగళవారం డిల్లీలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 20 సంవత్సరాల విశిష్ట సేవలను విశ్లేషించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా డిల్లీలో మీడియాతో ప్రతినిధులతో మాట్లాడిన విష్ణు వర్ధన్‌రెడ్డి మే 2న ప్రధాని మోదీ అమరావతి పర్యటనలో భాగంగా దాదాపు రూ.50 వేల కోట్ల నిధులతో ప్రారంభం కాబోతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో శుభసూచకమై ఉంటాయి. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ప్రజల స్వప్న నగరంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి పట్టుదలతో పాటు, ప్రధానమంత్రి మోదీ గారి సహకారం కూడా కీలకంగా ఉంది అని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి ఇటీవల ప్రవేశపెట్టిన పి4 పథకం పేదల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ పథకం ధనవంతుల సహకారంతో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. ఇది పేదరిక నిర్మూలనలో గేమ్ ఛేంజర్ అవుతుందని అభిప్రాయపడ్డారు.

## బొంతవారిపాలెంలోతాగునీటికి కటకట

### ఎమ్మెల్యేకి చెప్పినా ఒక్క రోజే సరఫరా

**వలేటివారిపాలెం (నెల్లూరు), ఏప్రిల్ 22, ప్రభాతవార్త** :మండలంలోని బొంతవారిపాలెంకు గత నెలరోజులుగా రక్షితనీరు అందడం లేదు. ఆర్‌డబ్లుఎస్ ఇంజనీర్ అసమర్ధత, కాంట్రాక్టర్ల, ఉన్నతాధికారులు అశ్రద్ద, క్షేత్రస్దాయిలో సిబ్బంది నిర్లక్ష్యం తదితర కారణాల వలన ప్రజలు తాగునీటికి నానా తంటాలు పడుతున్నారు.చుండి-చెర్లోపాలెం రక్షిత పథకం పనిచేయనందున తమ గ్రామానికి నీరు రావడం లేదని గ్రామస్తులు లబోదిబో అంటున్నారు.దీంతో రక్షితనీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి పలువురు గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆయన చొరవతో ఒక్క రోజు మాత్రమే నీటి సరఫరా జరిగిందని గ్రామస్తులు తెలిపారు.ఆ తరువాత మామూలే అయింది.వేసవిలో తాగునీటి సౌకర్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురువుతున్నాయని వాపోయారు.తగిన చర్యలు తీసుకొని రక్షితనీటిని నిరంతరం సరఫరా మండలంలోని బొంతవారిపాలెం గ్రామ రక్షిత నీటికోసం 10ఏళ్ల కిందట రూ.10లక్షలు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు.ఇది ఉత్సవ విగ్రహంగానే మిగిలిపోయింది. ఈ గ్రామాన్ని చుండి-చెర్లోపాలెం రక్షితపథకానికి అనుసంధానం చేశారు.పైప్‌లైన్‌ను నేరుగా ఇంటింటికి అమర్చారు.ఈ పథకం సైతం అరకొరగా సాగుతుంది. తరచూ మోటార్లు పాడైపోవడం, విద్యుత్ సరఫరాలోపించడం, పైప్‌లైన్ లీకేజి కావడం తదితర కారణాల వలన సక్రమంగా నీరు రావడం లేదు.దీంతో స్దానికంగా బోర్,మోటారుతో మరొక పథకం ఏర్పాటు చేశారు.ఈ రెండు పథకాల ద్వారా ప్రజలు కాలం గడుపుకుంటున్నారు.తాజాగా చుండి -చెర్లోపాలెం పథకం పూర్తిగా నిలిచిపోయింది. భూగర్భజలాల సామర్ద్యం అడుగుంటిపోవడంతో స్దానిక పథకం పూర్తిస్దాయిలో చాలడంలేదు.పైగా ఇది కొత్త కాలనీకి దూరంగా ఉంది.కూలీనాలీ చేసుకునే జనం తాగునీటికి గంటల తరబడి ఎదురుచూడాల్సివస్తుందని సాదం వెంకటేశ్వర్లు, పెరుగు నాగేంద్రరావు, పెరుగు హరికృష్ణ తదితరులు వివరించారు. ఈవిషయం స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు తెలిపారు.అయినా ఒక్క రోజే సరఫరా చేశారని, ఆ తరువాత మామూలైందని ఆయన తెలిపారు.పలు సభలు సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే వేసవిలో తాగునీటి అమలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులుకు సూచిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.ప్రభుత్వం తాగునీటి కోసం లక్షలాదిరూపాయలు వెచ్చిస్తుంటే స్దానిక అధికారుల అశ్రద్ధ,కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నిర్వీర్యం అవుతుంది. గత 26 రోజులుగా రక్షిత నీటి సరఫరా పూర్తి నిలిచి పోయింది.అంతకు ముందు అప్పుడప్పుడు అరకొరగా వస్తుండేది. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

### తగ్గని రాహుకేతుదోష నివారణ పూజలు - మంగళవారం అయినా రద్దీ

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త** దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి.మంగళవారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది.మంగళవారం అయినా భక్తుల సంఖ్య తగ్గటం లేదు.ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలకు రద్దీ తగ్గటం లేదు. మంగళవారం అయినా 4వేల పూజలు జరగటం గమనించదగ్గ విషయం. ఓ వైపు ఎండలు దడపుట్టిస్తున్నా లెక్క చేయక హాజరయ్యారు. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు.ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది.దేవస్థానం అందించిన సమాచారం మేరకు మంగళవారం కూడా సుమారు 20వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆలయంలో రద్దీ పెరుగుతుందని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని తలమంచి కొడవలూరు రైల్వే స్టేషన్ ల మధ్య కె ఎమ్ నెం 186/సి13-సి14 పోస్టుల మధ్య మూడవ లైన్ లో మంగళవారం సుమారు 40-45 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు క్రింద పడి మృతి చెందారని కావలి జిఆర్పి ఎస్ఐ రమాదేవి తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పింక్, పసుపు రంగు నిలువు చారలు కలిగిన నిండు చేతుల చొక్కా, సిమెంట్ రంగు లుంగీ, మహా సిమెంట్ కంపెనీ పసుపు రంగు టి షర్ట్ ధరించి ఉన్నారన్నారు.

## కూటమి ప్రభుత్వం కుళ్లు రాజకీయాలు చేస్తోంది

### - మాజీ మంత్రి రోజా



**విజయ వాడ, ఏప్రిల్22 ,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీలో కూటమి ప్రభుత్వం కుళ్ళు రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి ఆర్కె రోజా ఆరోపించారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్‌పై మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా కూటమి ప్రభుత్వ డైవర్షన్ పాలిటిక్స్ అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి అరెస్టులకు పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టును ఖిడర్టీ డైవర్షన్ పాలిటిక్స్‌ఖిగా అభివర్ణించిన రోజా, ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. "ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టిన చంద్రబాబు, ఇప్పటివరకు దాన్ని ఎందుకు అమలు చేయలేదు? ఆ సంతకం చిత్తు కాగితంతో సమానమా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. హామీలు నెరవేర్చలేని నిస్సహాయతతోనే, ఎదురుదాడి చేసేందుకు, భయభ్రాంతులకు గురిచేసేందుకు వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి వాటికి ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో ఉంటే, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపిస్తున్న ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లపై విచారణ జరిపించాలని రోజా సవాల్ విసిరారు. అమరావతి టెండర్ల వ్యయాన్ని రూ.36 వేల కోట్ల నుంచి రూ.77 వేల కోట్లకు ఎందుకు పెంచారని నిలదీశారు. ఇది కేవలం దోపిడీకి సిద్ధమవ్వడమేనని, దీనిపై ప్రధాని మోదీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు రాష్ట్రాన్ని ఏటీఎంలా వాడుకుంటున్నారని స్వయంగా ప్రధాని అన్న మాటలను ఆమె గుర్తు చేశారు. టీటీడీ గోశాలలో వందలాది ఆవులు, శ్రీకూర్మంలో తాబేళ్లు చనిపోయిన ఘటనలపై పవన్ కళ్యాణ్ మౌనం వహించడాన్ని రోజా తప్పుబట్టారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్, ఈ ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేవలం చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడటమే పవన్ పని అని, ప్రజా సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాలు తగ్గిస్తే, టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు వాటిని పెంచుతూ లంచాలు దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మద్యం పాలసీతో ముడిపెట్టి కేసులు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని, ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని రోజా హితవు పలికారు. అక్రమ కేసులతో వైసీపీ నేతల స్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఆమె హెచ్చరించారు.



మంగళవారం మంగపేట మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# భూభారతి చట్టంతో రైతుకు మేలు

## ధరణి పేరుతో దగా చేసిన గత పాలకులు

## సాగురైతులందరికీ పట్టాలు అందజేస్తాం: మంత్రి సీతక్క

**మంగపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ధరణి పేరుతో రాష్ట్రంలోని రైతులందరినీ గత పాలకులు దగా చేశారని, అప్పటి అధికార పార్టీ నాయకులు లక్షలాది ఎకరాల భూమి పేరుతో కోట్లాది రూపాయలు దిగమింగారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలసి భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం ఎవరి భూమి వారికి చెందే విధంగా పట్టాలు అందజేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టారని, గతంలోని ధరణి పోర్టల్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. 50 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందకపోవడంతో వారికి ఎలాంటి లబ్ధి చేకూరలేదని, నేడు నిజమైన రైతులకు పట్టాలు అందజేసి ప్రభుత్వ ఫలాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

గ్రామాలలోని భూ సమస్యలు స్థానిక తహశీల్దార్‌తో పరిష్కారం కానిపక్షంలో ఆర్డిఓ, కలెక్టర్, సీసీఎల్‌ఏ ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిం చిందని, భూముల విషయంలో రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని అన్నారు. గత పది సంవత్సరాలుగా నిరుపేద రైతులకు ఒక్క ఎకరం భూమి సైతం అప్పటి పాలకులు ఇవ్వలేదని, నేటి ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని అన్నారు. వివిధ రకాల సమస్యలున్న భూములను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించు కోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంగపేట మండల పరిధి లోని 38 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారాక్ లబ్ధిదారులకు చెక్కులను మంత్రి అందచేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, తహసిల్దార్ రవీందర్, ఎంపిడిఓ భద్రు నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి చేరాలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారాక్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మే 7 నుంచి జరిగే ఆర్టీసి సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలి

## జెఏసి చైర్మన్ ఈదురు వెంకన్న

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మే 7 నుంచి జరిగే ఆర్టీసి సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలని మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన టిజిఎస్ఆర్‌టిసి జేఏసీ సమావేశం పిలుపునిచ్చింది. జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎస్ డబ్ల్యుఎఫ్ (సి.ఐ.టియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు. ఎస్‌డబ్ల్యుయు (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంతు ముదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కోకన్వీనర్‌లు కత్తుల యాదయ్య,సుద్దాల సురేశ్ మాట్లాడుతూ విశాల ఐక్యత కోసం జేఏసీ ప్రయత్ని స్తోందన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి విఎస్.రావు మాట్లాడుతూ తమ కమిటీ తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. కార్మిక ప్రయోజనాల కోసమే తమ నిర్ణయాలుంటాయన్నారు. ఎస్‌డబ్లుయు ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన అనుభవాల దృష్ట్యా కార్మికులందరినీ ఒకత్రాటిపై నడిపించడానికి జెఎసి నాయకత్వం విశాల ఐక్యత కొరకు సురొకసారి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి కోశాధికారి ది యాదయ్య. మీడియా ఇచ్చార్జి అప్పారావు ప్రతినిధులు ఎస్. కమలాకరీ గౌడి మొకటి గౌడ్, ఎస్ యు ఎఫ్ నాయకులు సి ఎస్.డబ్ల్యుము నాయకులు అబ్రహాం, ఎస్.సాయిరెడ్డి. జి.ఎస్.పాల్, సి.ఎస్ కృష్ణ . రాండ ఎ. గౌరీ శంకర్, జి.రాములు, ఎస్. వెంకటేష్, రవీందర్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# శానిటరీ ప్యాడ్ల ఫ్యాక్టరీపై బిఐఎస్ దాడులు

## ఐఎస్‌ఐ ముద్రలేని 30 వేలు స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త :** ఐఎస్‌ఐ మార్కు లేని శానిటరీ ప్యాడ్లు సరఫరా చేస్తున్న ఓ కేంద్రంపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం, కుషాయిగూడలోని ఓ కేంద్రంలో జరిగిన సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 30 వేలప్యాడ్లు, 7వేలకుపైగా లేబుల్ కవర్లకు ఐఎస్‌ఐ మార్కు లేనట్లు గుర్తించిన అధికారులు వాటన్నింటినీ జప్తు చేశారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఐఎస్ 5405:2019 ప్రమాణాలున్న శానిటరీ ప్యాడ్లను భారత ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ గెజిట్ ద్వారా బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. బీఐఎస్ ధ్రువీకరణ పొందకుండా అమ్మినా, తయారు చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించింది. అయితే, ఈ కేంద్రంలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండా పెద్దఎత్తున శానిటరీ న్యాప్‌కిన్లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో అందడంతో సోదాలు నిర్వహించినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి, సంచాలకులు పీవీ శ్రీకాంత్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్లు సవిత, రాకేశ్ తన్నీరు ఆధ్వర్యంలో బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి.బీఐఎస్ చట్టం 2016లోని పలు సెక్షన్ 17 ప్రకారం భారత ప్రభుత్వం బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసిన ఉత్పత్తులేవీ ఐఎస్‌ఐ మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ మార్కు లేకుండా, బీఐఎస్ అనుమతి పొందకుండా తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా రెండేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా మొదటిసారి, ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షల వరకూ జరిమానా రెండోసారి, తదుపరి దీనికి పదిరెట్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉంది. ఇప్పటివరకు భారత ప్రభుత్వం 679 ఉత్పత్తులను తప్పనిసరి చేస్తూ పలు క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లు విడుదల చేసింది. వీటిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ వెల్లడించారు. భారతీయ ప్రమాణాలపై ప్రతీ ఒక్క వినియోగదారుడూ అవగాహన కలిగి ఉండాలని, బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యతా ప్రమాణాలను గుర్తించాలని, ఉల్లంఘనలను గుర్తిస్తే అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

# మనస్తాపంతో విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య



అరుంధతి (ఫైల్)

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుక్కు అరుంధతి (17) ఇంటర్మీడియట్ బైపిసి మొదటి సంవ త్సరం చదువుతోంది. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బోటనీ సబ్జెక్టులో అరుంధతి ఫెయిల్ అయినట్లు ఫలితాల్లో వెల్లడయింది. దీంతో మనస్థాపానికి గురైన అరుంధతి మధ్యాహ్నం 1.20 గంటలకు ఇంటి పైనఉన్న రాడుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అరుంధతి ఉరి వేసుకున్న విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగోల్ సుప్రజ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే అరుంధతి మరణించినట్లు వెల్లడించారు. అరుంధతి సోదరుడు సుక్కు గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

## మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. మంగళవారం ప్రపంచ ధరత్రీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో ఎర్త్ డే స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి సమస్త జీవరాశులకూ ఆధారమని, పుడమి తల్లి మానవాళి జీవనానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, ఉపాధి కల్పిస్తోందన్నారు.వాతావరణ మార్పులు వంటి ఇతరత్రా చర్యలతో ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు.అలాగే, సౌరపవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవాలన్నారు.రానున్న రోజుల్లో భూమిని కాపాడుకునేందుకు సోలార్ ఎనర్జీ చాలా అవసరమని, సోలార్ ఎనర్జీని ప్రోత్సాహించేందుకు దేవాదాయ శాఖకు చెందిన భూముల వినియోగంపై చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు.ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని వినియోగించుకునే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాని ఆమె పిలుపునిచ్చారు.

# నేడు హైదరాబాద్ లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక

## బరిలో నిలిచిన ఎంఐఎం-బిజెపి అభ్యర్థులు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేడు జరగనుంది. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరుగనుంది. అనంతరం ఏప్రిల్ 25న (శుక్రవారం) కౌంటింగ్ జరుగుతుంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే పోలింగ్, కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒకటి కార్పొరేటర్లకు, మరొకటి ఎక్స్ ఆఫీషియో సభ్యులకు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం, బీజేపీ పార్టీలు పోటీలో ఉన్నాయి. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హాసన్, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్‌రావు బరిలో ఉన్నారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా హైదరాబాద్ జిల్లాకు చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో మెంబర్స్‌గా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓటర్లు 112, కార్పొరేటర్లు 81,ఎక్స్ ఆఫీషియో సభ్యులు 31 మంది ఓటు వేయనున్నారు.

# ఇంటర్ విద్యార్థులకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంటర్ సెకెండ్ ఇయర్ ఫలితాల్లో తన సొంత జిల్లా ములుగు మొదటి స్థానంలో, తాను ఇంచార్జ్‌గా ఉన్న ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

వెనకబడిన జిల్లాలు, గిరిజన ప్రాంతాలుగా పేరున్న ఈ రెండు జిల్లాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటడం తనకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. ఈ విజయానికి కారణమైన ఆయా జిల్లా కలెక్టర్లను, డీఈవోలను, ఇతర అధికారులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. మొదటి స్థానంలో ములుగును నిలపడంలో కృషి చేసిన కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, డీఈవోను మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించి వారిని కలెక్టర్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మంగళవారం విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి మోగించింది. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 468తో 103 మంది, 467 ఆపైన 462 మంది, 466 ఆపైన 1073 మంది, 460 ఆపైన 4490 మంది, 450 ఆపైన 8479 మంది శ్రీచైతన్య విద్యార్థులే. జూనియర్ ఇంటర్ బైపిసిలో 440 మార్కులకుగాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 438తో 26 మంది, 437 ఆపైన 136 మంది, 436 ఆపైన 304 మంది. 435 ఆపైన 459 మంది, 430 ఆపైన 1495 మంది శ్రీచైతన్య విద్యార్థులే. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకుగాను 996 స్టేట్ టాప్ మార్క్‌తోపాటు 995 ఆపైన 7 మంది 994 మార్కులు ఆపైన 46 మంది, 990 మార్కులు ఆపైన 610 మంది, 985 మార్కులు ఆపైన 1776 మంది, 980 మార్కులు ఆపైన 3050 మంది. 950 మార్కులు ఆపైన 9697 మంది శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు.

ఇప్పటికే విడుదలైన జెఇఇ మెయిన్- 2025లో 300కి 300 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరిలో రెండు ఆలిండియా 1స్ట్ ర్యాంకులతో పాటు, ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 10లోపు 4 ర్యాంకులు, 100 లోపు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 31 ర్యాంకులు సాధించి సెన్సేషనల్ రికార్డ్ సృష్టించారు శ్రీచైతన్య విద్యార్థులు. జెఇఇ మెయిన్‌లో అత్యధిక ర్యాంకులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శ్రీచైతన్య విద్యార్థులకే రావడం పట్ల శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ హర్షం వ్యక్తం చేస్తూ... రేపటి ఐఐటి అడ్వాన్స్‌డ్, నీట్‌లలోనూ నంబర్ వన్ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుష్మశ్రీ మాట్లాడుతూ... శ్రీచైతన్య సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి ఆధ్యాపకుల శిక్షణతో, ఇంటర్మీడియేట్లో సబ్జెక్ట్స్‌పై మా విద్యార్థులకు కాన్సెప్ట్యువల్‌గా పట్టు సాధించడంతో జాతీయస్థాయి పోటీపరీక్షల్లో మా విద్యార్థులు టాపర్స్‌గా నిలుస్తున్నారని అన్నారు. స్ట్రాంగ్ ఫౌండేషన్ వల్లనే ఈ ఇంటర్మీడియెట్ మార్కులు సాధ్యమయిందని, దీనితో పాటు రాబోయే రిజల్ట్స్ అన్నీ శ్రీచైతన్యవే అనే నమ్మకం మాకుందని అన్నారు. అదేవిధంగా 2023వ సంవత్సరం ఐఐటి-జెఇఇ, నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నంబర్ వన్ హ్యాట్రిక్ ర్యాంకులతో శ్రీచైతన్య రికార్డ్ బ్రేక్ చేసి తమ సత్తా చాటుకున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, మా విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులను, దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని, శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ అభినందించారు.

# వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని యువకుడి హత్య



## సుపారీ గ్యాంగ్‌తో చంపించిన నిందితుడు కానిస్టేబుల్ శ్రీనివాస్

## శవాన్ని బావిలో పడేసిన నిందితులు

## వివరాలు వెల్లడించిన వరంగల్‌సిటీ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

**ములుగు జిల్లా క్రైమ్(వెంకటాపురం), ప్రభాతవార్త:** వారం రోజులుగా సంచలనం రేపిన చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చిడెం సాయి ప్రకాశ్ మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి పిన్ని నిర్మల.. తనను హాస్పిటల్‌కు తీసుకెళ్లమని చెప్పడంతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం వెంకటాపురంలోని తన ఇంటి నుండి కారులో హన్మకొండలోని మ్యాక్స్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆస్పత్రి నుంచి బయలుదేరిన సాయిప్రకాశ్ రెండురోజులు అయినా ఇంటికి రాకపోవడంతో వరంగల్ లోని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. వరంగల్ సిటీ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుడు చిడెం సాయిప్రకాష్ ఈ నెల 15వ తేదీ సాయంత్రం హాస్పిటల్ నుండి 10.30 గంటలకు తన కారులో వెళ్తూ ఉం డగా వెనకనే ఆటో అనుసరించినట్టు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించినట్టు తెలి పారు. నయీమ్‌నగర్ దగ్గర ఆటోతో కారుని అడ్డగించి సాయిప్రకాష్‌పై దాడిచేసి అదే కారులో నిందితులం దరూ వెళ్లినట్టు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. హసన్‌పర్తి సమీపంలో హుస్నాబాద్ దగ్గర చున్నీతో గొంతునొక్కి చంపి వ్యవసాయ బావిలో పడేశారని వివరించారు. హాస్పిటల్ నుండి సాయిప్రకాష్ వెళ్లిపోతున్న సమ యంలో ప్రధాన నిందితుడు కానిస్టేబుల్ బాసబోయిన శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్ ద్వారా నిర్మల తెలపడంతో దుండగులు ప్రకాష్‌ను అనుసరించారని తెలిపారు. వెంకటాపురంలో కానిస్టేబుల్ శ్రీనివాస్ పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు భూ వివాదం కేసులో చిడెం నిర్మల తన భర్తతో ఫిర్యాదు చేసిన సమయంలోనే కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడి, ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మా రింది. ఈ విషయం భర్తకు తెలిసి తన దగ్గర బంధువు వరుసకు కొడుకు అయిన చిడెం సాయిప్రకాష్ చెప్పాడు. దీనితో సాయిప్రకాష్ తన పిన్ని నిర్మలను మందలించి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌పైన నిర్మల భర్త చేత ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి నిందితుడు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ తర్వాత ములుగులోని వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉన్నాడు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా వచ్చి, తన సస్పెన్షన్‌కు కారణమైన సాయిప్రకాష్‌పైన నిందితులు ఇద్దరు పగ పెంచు కున్నారు. అవకాశం కోసం ఎదురుచూసి పథకం ప్రకారమే అనారోగ్యం నాటకమాడి హత్య చేయించారని పోలీసు కమిషనర్ తెలియజేసారు. హత్య చేశాక శవాన్ని బావిలో పడేసి మృతుడి కారును వరంగల్‌లోని చింతకుంట డంపింగ్ యార్డ్‌లో వదిలేసారని అన్నారు. స్థానికులు బావిలో నుండి శవాన్నితీసి సమీ పంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి సమాచారం ఇచ్చినప్పటికీ సంబంధికులు ఎవరూ రాకపోవడంతో గ్రామస్తులే శవాన్ని ఖననం చేసినట్టు సిపి వివరించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ములుగు వెంటా పురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బాషబోయిన శ్రీనివాస్, దేవిలీసాయి, ఆలోత్ అరుణ్‌కుమార్ ఆలియాస్ పండు, సబావత్ అఖిల్‌నాయక్, రాజు, చింతం నిర్మల పోలీసులు గుర్తించారు.

# లగచర్ల బాధితులకు ఇంకా తప్పని వేధింపులు

## చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టుకు వెళతాం: మాజీమంత్రి కెటిఆర్



మంగళవారం లగచర్లలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 22:** లగచర్ల బాధితులను ఇంకా కొందరు పోలీసులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారుల పేర్లను రాసిపెట్టుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అతిగా ప్రవర్తించిన అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నా వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మంగళవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, లగచర్ల భూసేకరణ వివాదంలో మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై తాము జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ మహిళా కమిషన్‌లను ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా తప్పుబట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. మానవ హక్కుల కమిషన్ నివేదిక తర్వాత అయినా రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు.ఎన్‌హెచ్‌ఆర్సీ సూచించిన విధంగా ఆరు వారాల్లోగా చర్యలు తీసుకోకుంటే రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి పాత్ర ఉందని భావించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. లగచర్లలో భూసేకరణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కేటీఆర్ అన్నారు. దీనిని వెంటనే నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లగచర్ల రైతులను పోలీసులు చిత్రహింసలు పెట్టి, దారుణంగా కొట్టారని ఎన్‌హెచ్‌ఆర్సీ రిపోర్ట్‌లో చెప్పారు. సొంత నియోజకవర్గ రైతులను దారుణంగా కొట్టించిన రేవంత్ రెడ్డికి సిగ్గు, ఇజ్జత్ ఉంటే ఈపాటికి రాజీనామా చేయాలి. కానీ రేవంత్ రెడ్డికి ఇజ్జత్ లేదు. పోలీసులు తమపై లైంగిక దాడి చేశారని లగచర్ల మహిళలు ఎన్‌హెచ్‌ఆర్సీ బృందానికి తెలిపారు. రాత్రిపూట గ్రామంపై పోలీసులు దాడి చేసి మహిళల తొడలపై దారుణంగా కొట్టి, కొట్టినట్టు జడ్జి ముందు చెప్తే ఇంకా దారుణంగా కొడతామని బెదిరించారని గిరిజన మహిళలు ఎన్‌హెచ్‌ఆర్సీ వాళ్లకు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

# వరుసగా రెండోసారి అత్యుత్తమ మార్కులతో నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్!

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మంగళవారం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్-2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్కు సాధించి విజయదుందుభి మోగించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 995 మార్కులను 18 మంది నారాయణ విద్యార్థులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులను గాను 438 మార్కులను ఏకంగా 13 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలోనూ 1000 మార్కులకు గాను 995 మార్కులను ఇద్దరు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఫలితాలను గ్రూపుల వారీగా విశ్లేషిస్తే జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఇంటర్ బోర్డ్ చరిత్రలోనే అత్యధికంగా 470 మార్కులకు గాను 469 మార్కులతో నారాయణ విద్యార్థి పి వర్షిణి చరిత్ర సృష్టించింది, 468 మార్కులు 132 మంది, 467 మార్కులు 487 మంది, 466 మార్కులు 866 మంది విద్యార్థులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 995 వంటి అత్యుత్తమ మార్కులను 13 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అలాగే 994 మార్కులను 30 మంది, 993 మార్కులను 73 మంది, 992 మార్కులను 106 మంది సాధించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 438 మార్కులను మొత్తం 13 మంది విద్యార్థులు కైవసం చేసుకోగా.. 437 మార్కులను 27 మంది, 486 మార్కులను 44 మంది, 485 మార్కులను 84 మంది నారాయణ విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 995 మార్కులు ఇద్దరు సాధించగా, 994 మార్కులు నలుగురు, 993 మార్కులు ఇద్దరు, 992 మార్కులు ఐదుగురు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, శరణి నారాయణ, రమా నారాయణ తెలిపారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ హెచ్‌పిజిలోనూ నారాయణ విజయప్రస్థానం కొనసాగిందని తెలిపారు. 475 మార్కులకు గాను 470 మార్కులు ఒకరు, 469 మార్కులు ఒకరు, 468 మార్కులు నలుగురు, 467 మార్కులు 7 మంది.. అలాగే సీనియర్ ఇంటర్ హెచ్‌పిజి విభాగంలో స్టేట్ టాప్ మార్కు 988 మార్కులు కాగా, టాప్ మార్కును నారాయణ విద్యార్థి కైవశం చేసుకున్నారు. అలాగే 985 మార్కులను ముగ్గురు, 984 మార్కులను నలుగురు సాధించారన్నారు. హెచ్‌పిజిలో టాప్ మార్కులన్నీ నారాయణ విద్యార్థులే కైవసం చేసుకోవటం గమనార్హం. ఈ స్థాయి ఫలితాలు నారాయణ తప్ప మరి ఏ ఇతర సంస్థ సాధించలేదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రమా నారాయణ మాట్లాడుతూ జూనియర్ ఇంటర్లో ఆల్‌టైమ్ హయ్యస్ట్ మార్కులు వరుసగా రెండవ సారి నారాయణ సాధించటం ఎంతో గర్వకారణం అన్నారు. ఆరంభం నుండి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాము పటిష్టమైన మైక్రోషెడ్యూల్స్ రూపొందించి కాన్సెప్ట్యువల్ ఓరియంటేషన్లో విద్యాబోధన చేయటం వల్లనే తమ విద్యార్థులు ఇంతటి అద్భుత ఫలితాలను సాధించగలిగారని తెలిపారు. శరణి నారాయణ మాట్లాడుతూ తెలంగాణలోని నారాయణ విద్యాసంస్థల్లో జూనియర్, సీనియర్ ఇంటర్‌లో అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించటం జరిగిందని చెప్పారు. సబ్జెక్టుల వారీగా విశ్లేషణాత్మక ధోరణిలో విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందించే విధంగా పాఠ్యాంశాల బోధన చేయటం అనేది నారాయణ ప్రత్యేకతగా చెప్పారు. డాక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ గత 46 సంవత్సరాల నారాయణ అప్రతిహత విజయప్రస్థానానికి కొనసాగింపుగా, నేటి ఇంటర్ ఫలితాలే నిదర్శనమన్నారు. నేటి ఈ ఫలితాలే రేపటి జేఈఈ అడాన్స్‌డ్, నీట్ ఫలితాలకు సోపానమన్నారు. ప్రవేశ పరీక్షలన్నింటిలోనూ తను విద్యార్థులే అత్యద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఆధ్యాపకబృందానికి నారాయణ విద్యాసంస్థల తరఫున అభినందనలు తెలిపారు.



# మే 9న 'శుభం'


ప్రముఖ నటి సమంత నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. సమంత సొంత ప్రొడక్షన్ కంపెనీ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద శుభం అనే సినిమాను నిర్మించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించారు. శుభం చిత్రాన్ని మే 9న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఆల్రెడీ శుభం టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. సెన్సిబుల్, హ్యూమర్‌తో శుభం చిత్రం అందరినీ పాత కాలానికి తీసుకు వెళ్లేలా ఉంది. ఫ్యామిలీ మొత్తం కలిసి చూడదగ్గ చిత్రంగా శుభంను మేకర్లు రూపొందించినట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి యువ ప్రతిభావంతులంతా కలిసి పని చేశారు. వివేక్ సాగర్ ఆకర్షణీయమైన నేపథ్య సంగీతం, క్లింటన్ సెరెజో అందించిన మెలోడీ పాటలు ఈ చిత్రానికి హైలెట్ కాబోతోన్నాయి. ఆకర్షణీయమైన కథ చెప్పడంలో 'శుభం' సినిమాతో నిర్మాణంలోకి అడుగు పెట్టిన సమంత నిబద్ధత అందరికీ అర్థం అవుతోంది. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్‌తో వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే తన లక్ష్యం. శుభం ఆ కోవలోకి చెందే చిత్రం అవుతుంది. శుభం కోసం తన టీం ఎంతో కష్ట పడింది. ఈ ప్రత్యేకమైన కథను అందరితో పంచుకోవడానికి మేము సంతోషిస్తున్నాము అని సమంత అన్నారు. మే 9న ప్రపంచ వ్యాప్తంగా శుభం విడుదలకు సిద్ధమవుతోంది. ఇది ప్రేక్షకులను పూర్తిగా సంతృప్తిపరిచే చిత్రం అవుతుందని మేకర్లు చెబుతున్నారు. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ నుంచి మరిన్ని ఎంటర్టైన్మెంట్ చిత్రాలు రానున్నాయని, ఇలానే వినోదాన్ని అందిస్తామని మేకర్లు చెబుతున్నారు.



# మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న మూవీ 'సయారా'

అహాన్ పాండే, అనీత్ పద్దా జంటగా యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న చిత్రం సయారా. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ను ఇచ్చారు. ఈ సినిమాను జూలై 18, 2025న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయబోతోన్నారు. ఆదిత్య చోప్రా సమర్పణలో అక్షయ్ విధ్వానీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సయారా చిత్రాన్ని ఓ ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీతో హిందీ చిత్ర పరిశ్రమలో అహాన్ పాండే అడుగు పెడుతున్నారు. అనీత్ పద్దా కథానాయికగా నటించిన సయారా చిత్రం యూత్ ఫుల్ రొమాంటిక్ లవ్ ఎంటర్టైనర్‌గా జూలై 18, 2025న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






# వచ్చే యేడాది 'మర్దానీ 3'

యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాతణంలో వచ్చిన మర్దానీ ఫ్రాంచైజీ ఎంతగా విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ పదేళ్లలో వచ్చిన రెండు సీజన్లకు ఆడియెన్స్‌ను మంచి ఆదరణ లభించింది. భారత దేశంలో అతిపెద్ద, ఏకైక మహిళా కాప్ ఫ్రాంచైజీగా మర్దానీ రికార్డులు క్రియేట్ చేసింది. ప్రస్తుతం మర్దానీ మూడో సీజన్‌కు సంబంధించిన అప్డేట్ వచ్చింది. మర్దానీ 3లోనూ రాణి ముఖర్జీ న్యాయం కోసం నిస్వార్థంగా పోరాడే డేర్‌డెవిల్ కాప్ శివానీ శివాజీ రాయ్ పాత్రను తిరిగి పోషించనున్నారు. సోమవారం (ఏప్రిల్ 21) నాడు మర్దానీ 3 విడుదల తేదీని ప్రకటించారు. మర్దానీ 3 వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న రిలీజ్ కానుంది. పవిత్రమైన హోలీ పండుగ సందర్భంగా మర్దానీ 3ని రిలీజ్ చేయబోతున్నారు. మార్చి 4న వచ్చే హోలీ సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా మర్దానీ 3ని విడుదల చేయబోతోన్నారు. ఈ మేరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.



# 'శివ శంభో' ప్రిరిలీజ్

తెలుగు వెండితెరపై మరో భక్తిరస చిత్రం కనువిందు చేయబోతోంది. అనంత ఆర్ట్స్ బ్యానర్‌పై కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్థిని బేబీ రిషిత ప్రధాన పాత్రల్లో, నర్సింగ్ రావు దర్శకత్వంలో బొజ్జ రాజ గోపాల్, దోరవేటి సుగుణ నిర్మించిన చిత్రం శివ శంభో. తనికెళ్ళ భరణి, సుమన్ ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రం (ఏప్రిల్) 25న థియేటర్‌లలో విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డా. గోరటి వెంకన్న, బీజేపీ నేత, జంతు ప్రేమికుడు చీకోటి ప్రవీణ్, ప్రముఖ నటుడు, రచయిత డా. తనికెళ్ల భరణి, బర్దీపుర పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వర గిరి స్వామీజీ, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, తదితరులు పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ, చిత్రయూనిట్ సభ్యులందరికి పేరుపేరున శుభాకాంక్షలు, అభినందనలు. ఇలాంటి భక్తిరస చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి. భారతీయ కళలైన సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ సందేశాత్మక చిత్రాన్ని ప్రతి ఒక్కరు ఆదరించగలరనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ నేత, జంతు ప్రేమికుడు చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ, నర్సింగ్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచిపోతుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తెలుగు చిత్రసీమలో ఇది చెప్పుకోదగ్గ సినిమాగా నిలవాలని కోరుకుంటున్నాను. అని అన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ, సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ అరుదైన సినిమాను మనమంతా గౌరవించాలి. ఇటువంటి చిత్రాలను ఉత్తమ అభిరుచి గల ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారు. చిత్రయూనిట్ సభ్యులందరికి పేరుపేరున శుభాకాంక్షలు, అభినందనలు. అని అన్నారు. చిత్ర నిర్మాతల్లో ఒకరు, రచయిత, సంగీత దర్శకులు దోరవేటి మాట్లాడుతూ, ఏప్రిల్ 25న శివ శంభో చిత్రం విడుదల చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వెళ్లి చూసి సినిమాను ఆదరించాలని కోరుతున్నాము. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు అని అన్నారు. దర్శకుడు నర్సింగ్ ఎంతో శ్రమకోర్చి ఈ సినిమా ను నిర్మించామని, తప్పకుండా మంచి స్పందన వస్తుందని తెల్పుతూ, చిత్ర నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం చివర స్వామీజీ ఆశీఃప్రసంగం చేసి, అందరికీ జ్ఞాపికలు బహూకరించారు. బ్యానర్: అనంత ఆర్ట్స్ నిర్మాతలు: బొజ్జ రాజ గోపాల్, సుగుణ దోరవేటి. డైరెక్టర్: నర్సింగ్ రావు డిఓపి: కారె సతీశ్ కుమార్, హీరో హీరోయిన్: కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్థిని బేబీ రిషిత. పాటలు మాటలు, సంగీతం: దోరవేటి, ముఖ్యపాత్రలో: తనికెళ్ళ భరణి, సుమన్, టార్జాన్, విజయ్ రంగరాజన్, చిల్లర వేణు.



# '6జర్నీ' ట్రైలర్ లాంచ్

పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం '6జర్నీ'. రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బసీర్ అలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 25న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ మాట్లాడుతూ, 'మా హీరో సమీర్ ఎంతో కష్టపడి నటించారు. రవి ప్రకాష్ రెడ్డి ఈ మూవీని ముందుండి నడిపించారు. మా హీరోయిన్లు అద్భుతంగా నటించారు. టేస్టీ తేజ ఎనర్జీతో నటించాడు. మాకు సింహా మంచి పాటలు ఇచ్చారు. సురేందర్ రెడ్డి మమ్మల్ని ముందుకు నడిపించారు. ఈ మూవీ ఇక్కడకు వచ్చిందంటే అది ఆయన వల్లే. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. నాకు ఇంత మంచి ఛాన్స్ ఇచ్చిన మా నిర్మాతకు థాంక్స్. ట్రైలర్‌ను రిలీజ్ చేయండి ఆనందంగా ఉంది. సినిమాను ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నాం. సినిమా తప్పకుండా మెప్పిస్తుంద్ది అని అన్నారు. హీరో సమీర్ దత్త మాట్లాడుతూ, డిఫరెంట్ లవ్, యాక్షన్ థ్రిల్లర్‌గా 6జర్నీ తెరకెక్కింది. ఎంటైర్ టీమ్ ఎంతో కష్టపడ్డాం. బసీర్‌గారు సినిమాను బాగా తెరకెక్కించారు. నిర్మాత పాల్యం రవిప్రకాష్‌రెడ్డికి థాంక్స్. ఏప్రిల్ 25న రిలీజ్ కాబోతున్న మా సినిమాను ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ పల్లవి రాథోడ్ మాట్లాడుతూ, ఏప్రిల్ 25న మా 6జర్నీ మూవీ మీ ముందుకు రానుంది. బసీర్‌గారు, రవిప్రకాష్ సపోర్ట్‌తో సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు. సినిమాలో అన్నీ ఎలిమెంట్స్ ఉన్నాయి. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది అన్నారు. టేస్టీ తేజ మాట్లాడుతూ, ఫుల్ లెంగ్త్ రోల్‌లో నటించిన 6 జర్నీ నటుడిగా మంచి గుర్తింపు నిస్తుంది. ఈ ప్రయాణాన్ని ఇంత సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశామంటే కారణం బసీర్‌గారు, నిర్మాత రవిప్రకాష్‌గారు. ఏప్రిల్ 25న వస్తోన్న ఈ సినిమాను తప్పకుండా ఆదరించాలని కోరుకుంటున్నాం అన్నారు. నిర్మాత పాల్యం రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, లవ్, యాక్షన్, మిస్టరీ ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో 6జర్నీ మూవీని రూపొందించాం. ట్రైలర్‌కు చాలా మంచిరెస్పాన్స్ వచ్చింది. బసీర్ సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. ఏప్రిల్ 25న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం. మంచి చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మాసినిమాను సపోర్ట్ చేస్తారని నమ్ముతున్నాం అన్నారు.



# 'డియర్ ఉమ' సక్సెస్ మీట్

సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్ మీద సుమయ రెడ్డి రచయితగా, నిర్మాతగా, హీరోయిన్‌గా నటించిన చిత్రం డియర్ ఉమ. ఈ సినిమాను సాయి రాజేష్ మహదేవ్ తెరకెక్కించాడు. రధన్ సంగీత దర్శకుడిగా, రాజ్ తోట కెమెరామెన్‌గా పని చేశారు. ఇక ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదలై మంచి ఆదరణను దక్కించుకుంది. ప్రేక్షకులు డియర్ ఉమ చిత్రానికి మంచి విజయాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించి ప్రేక్షకులకు థాంక్స్ చెప్పింది. ఈ కార్యక్రమంలో..

సుమయ రెడ్డి మాట్లాడుతూ, డియర్ ఉమ చిత్రానికి మీడియా ఎంతగానో సపోర్ట్ చేసింది. ఈ చిత్రానికి వస్తున్న రెస్పాన్స్ చూసి నాకు ఎంతో ఆనందమేస్తుది. ఎన్నో సినిమాలు ఇంకా బయటకు రావడం లేదు. కానీ మేం మాత్రం సక్సెస్ ఫుల్‌గా సినిమాను రిలీజ్ చేశాం. అదే నాకు పెద్ద సక్సెస్. మా సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆడియెన్స్ మా చిత్రాన్ని ఆదరిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాను. మా అమ్మ, తమ్ముడు, మా టీం సహకారం వల్లే ఈ స్థాయి వరకు వచ్చాను. రధన్ గారి సంగీతం అందరినీ ఆకట్టుకుంది. హాస్పిటల్‌లోనే మన జీవితం ప్రారంభం అవుతుంది.. అక్కడే మన జీవితం ముగుస్తుంది. ఇలాంటి ఓ మంచి సబ్జెక్ట్ మీద తీసిన మా డియర్ ఉమ చిత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాను. మా సినిమాను ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు. దర్శకుడు సాయి రాజేష్ మహదేవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం జనాలు థియేటర్లకు రావడం లేదు. కానీ మీడియా, మౌత్ టాక్ వల్లే థియేటర్లకు ఆడియెన్స్ వస్తున్నారు. మా సినిమాను ఇంతగా సపోర్ట్ చేస్తున్న మీడియాకు థాంక్స్. మా చిత్రానికి మంచి రివ్యూలు ఇచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కూడా మంచి సినిమాను ఎంకరేజ్ చేసి సక్సెస్ చేస్తూనే ఉంటారు. మా చిత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని మీడియాని, ఆడియెన్స్‌ని కోరుతున్నాను. మా చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ, సుమయ రెడ్డి ఎంతో కష్టపడి డియర్ ఉమ సినిమాని చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజ్ తోట కెమెరా వర్క్ బాగుందని అంతా మెచ్చుకుంటున్నారు. రధన్ మ్యూజిక్‌కు ప్రశంసలు వస్తున్నాయి.



# గుర్తుండిపోయే మూవీ 'సారంగపాణి జాతకం'

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రం సారంగపాణి జాతకం. ప్రియదర్శి, రూపా కొడువయూర్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే..

సారంగపాణి జాతకంలో అన్ని రకాల అంశాలు ఉంటాయి. యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్ ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఇంద్రగంటి కథను చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. థియేటర్లో అందరూ హాయిగా నవ్వుకు నేలా ఈ చిత్రం ఉంటుంది. ఓ ఫుల్ లెంగ్త్ కామెడీ మూవీ చేయాలనే లోటు ఈ చిత్రంతో తీరిపోయింది. జంధ్యాలతో ఇలాంటి ఓ పూర్తి వినోదాత్మక సినిమా చేయలేదే? అనే లోటు ఇప్పుడు తీరిపోయింది. కొన్ని చిత్రాలు ఆడియెన్స్‌కి ఎప్పుడూ గుర్తుండిపోతాయి. అలా ఈ సారంగపాణి జాతకం చాలా కాలం పాటు గుర్తుండే చిత్రం అవుతుంది. జెంటిల్ మాన్, సమ్మోహనం తరువాత మా కాంబోలో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహనకృష్ణ రాసిన కథ, కథనం ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీతో పాటుగా యూత్ ఆడియెన్స్ అందరినీ మెప్పిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తీశాం. సరైన థియేటర్లు దొరకాలనే ఉద్దేశంతో కాస్త లేటుగా వస్తున్నాం. మంచి సీజన్ దొరకాలనే ఇప్పటి వరకు ఆగాం. సమ్మర్ హాలీడేస్ స్టార్ట్ అయ్యాయి. ఇదే మంచి సీజన్ అనుకుని మేం ఏప్రిల్ 25న వస్తున్నాం. సమ్మర్‌లో వినోదాన్ని పంచేందుకు మా చిత్రం రాబోతోంది. సారంగపాణి జాతకం చిత్రం ఇప్పటికే చాలా మందికి చూపించాం. అందరూ అద్భుతంగా ఉందని అన్నారు. ఫస్ట్ హాఫ్ పూర్తిగా వినోదాత్మకంగా సాగుతుంది. ఇక ద్వితీయార్థం నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. జాతకం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. చాలా ఇంట్రెస్టింగ్‌గా, సస్పెన్స్‌గా ఉంటుంది. అలా అని మరీ అంత అన్ ప్రిడిక్టబుల్‌గా ఏమీ ఉండదు. అందరినీ హాయిగా ఎంటర్టైన్ చేసేలా మాత్రం ఉంటుంది. కథలో భాగంగానే కారెక్టర్లు వస్తాయి. ఏదో కావాలని ఇరికించినట్టుగా ఎక్కడా అనిపించదు. ప్రతీ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. వెన్నెల కిషోర్, వైవా హర్ష, నరేష్, అవసరాల శ్రీనివాస్ ఇలా అన్ని కారెక్టర్లు అద్భుతంగా నవ్విస్తాయి. ఈ కథ విన్నాక దర్శి అయితే బాగుంటుందని మేం అనుకున్నాం.



# రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ 'లెవెన్'

రుచిర ఎంటర్టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్ సుధాకర్ రెడ్డి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఎలెవెన్ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. నవీన్ చంద్ర హీరోగా నటించిన ఈ చిత్రం ఈ వేసవిలో అద్భుతమైన సినిమా ఎక్స్‌పీరియన్స్‌ని అందించడానికి సిద్ధంగా ఉంది. సుందర్ సి వద్ద కలకలప్పు 2, వంద రాజవతాన్ వరువేన్, యాక్షన్ వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హారి నిర్మించిన లెవెన్, విమర్శకుల ప్రశంసలు పొందిన సిలా నేరంగలిల్ సిలా మణిథర్గల్, సెంబి చిత్రాల విజయం తర్వాత వారి మూడవ వెంచర్. సిలా నేరంగలిల్ సిలా మణిథర్గల్‌లో నటించిన రేయా హారి, ఎలెవెన్‌లో కథానాయికగా నటించింది. ఈ చిత్రంలో అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు వంటి ప్రతిభావంతులైన తారాగణం కీలక పాత్రల్లో నటించిరు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు డి. ఇమ్మాన్ సంగీతం అందించగా, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ ఎన్.బి. ఎడిటర్‌గా వ్యవహరించడం, ఈ చిత్రం సాంకేతిక నైపుణ్యాన్ని మరింత పెంచుతుంది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వేసవిలో మే 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం వచ్చే నెలలో విడుదల కానున్నందున, నిర్మాతలు ప్రమోషన్స్ దూకుడు పెంచబోతున్నారు.



# వేసవిలో చెమటబారిన పడకుండా..

ఎండాకాలంలో బయట ఎండ, ఇంటిలోపల ఉక్కపోత సర్వసాధారణం. వేడికి ఇళ్లల్లో ఒకప్పుడు విసనకర్రలు, ఫ్యాన్లు వాడేవారు. పెంకుటిల్లు చుట్టూ చెట్లు, ఇంటికి పెరడు, వసారాలు, వాటిల్లో చెట్లు, ఇంటి ముందర వేపచెట్టు వంటివి ఉండేవి కాబట్టి అంతగా ఇబ్బందులు ఉండేవి కావు. కాని నేడు ప్రతిచోట అద్దె ఇళ్లు. అవి కూడా ఇరుకు గదులు. ఇక ఫ్యాన్లు సరిపోక కూలర్లు, ఎసిలు వాడకం ఎక్కువయింది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు ఉన్నప్పటికీ ఎండాకాలం చెమట సమస్య ఉండనే ఉంటుంది. దీన్ని పెద్దగా పట్టించుకోకపోతే డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. హార్మోన్ల స్థాయుల్లో మార్పులు, అధిక బరువు, ఆందోళన, శ్వాసకోశ, గుండె సంబంధిత సమసనయలు ఉన్నవారికి చెమట ఎక్కువగా ఉంటుంది. చెమట వల్ల శరీరంలోని మలినాలు, వ్యర్థ పదార్థాలు బయటికి పోయినప్పటికీ ఎక్కువయితే మాత్రం జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. కొంతమందికి చంకల్లో ఎక్కువ చెమట పడుతుంది. అలాంటి వారు కొద్దిగా కార్న్‌స్టార్చ్‌లో కాస్త బేకింగ్ సోడా, సరిపడినంత ఎసెన్షియల్ ఆయల్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చంకల్లో అప్లై చేసి అరగంట తర్వాత శుభ్రం చేసుకుంటే మంచిది. తరచూ ఇలా చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది. ఎండాకాలంఒ పండ్ల రసాలు తాగుతాం. కానీ ఔషధ గుణాలు పానీయాలు తాగాలంటే కొంచెం అయిష్టంగానే ఉంటుంది. అయితే చెమట సమస్య ఉన్నవారికి ఔషధాలు ఉన్న పానీయాలు బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా గోధుమగడ్డి, టొమాటో రసం వంటి వాటిలో సి, బి6, బి12 విటమిన్లు, ఫోలికామ్లం, ఇతర ఖనిజాలు ఎక్కువ మొత్తంలో లభిస్తాయి. ఇవన్నీ శరీరం నుంచి ఎక్కువ మొత్తంలో విడుదలయ్యే చెమటను తగ్గిస్తాయి. తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా



జాగ్రత్తపడవచ్చు. వేసవిలో నీళ్ల ఎక్కువ తాగాలి. పాలకూర, కాలిఫ్లవర్ కూరగాయాలు తీసుకోవాలి. పుచ్చకాయ, ద్రాక్ష, తర్బూజా వంటి పండ్లు తీసుకోవడం తప్పనిసరి. ఇవన్నీ శరీరం నుంచి విడుదలయ్యే చెమటను తగ్గించడంతో పాటు జీవక్రియల్ని వేగవంతం చేస్తాయి. పచ్చిమిర్చి, మసాలాలు వంటి ఘాటైన పదార్థాలు శరీరంలో అధిక వేడిని పుట్టించి ఎక్కువ చెమట విడుదలయ్యేలా చేస్తాయి. కాబట్టి ఈ కాలంలో వీటిని తీసుకోవడం తగ్గించాలి. కెఫిన్ నాడీ వ్యవస్థను ప్రేరేపించి శరీరంలో అడ్రినలిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. కాబట్టి కాఫీని సాధ్యమైనంత తక్కువగా తీసుకోవడం ఉత్తమం. ఒత్తిడి, ఆందోళనలు వంటివి తగ్గించుకోవడం కూడా ముఖ్యమే. అలాగే ఈ కాలంలో శరీరానికి గాలి తగిలేలా వదులుగా ఉండే దుస్తులు, అది కూడా కాటన్ దుస్తుల్ని ధరిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే వేసవిని ఇబ్బందిగా కాకుండా ఆహ్లాదంగా ఆస్వాదించవచ్చు.

# పార్టీకి ప్రత్యేకంగా..

పుట్టినరోజులు, ఫ్రెండ్స్‌తో గెట్‌టూగెదర్..సందర్భం ఏదైనా ఆ పార్టీలో మనం అందరిలోనూ మెరిసిపోవాలని అనుకోవడం సహజమే.కానీ, అయితే, ఫ్యాషన్ నిపుణులు చెప్పే ఈ సూత్రాలు

సందర్భం ఏదైనా, ఎన్ని సార్లు ధరించినా కొత్తదనం కనిపించేలా చేయడంలో బ్లాక్ అండవైట్ రంగులకు మించినవేం ఉంటాయి. అందుకే పార్టీవేర్‌గా.. మీవార్డ్‌రోబ్‌లో వీటిని తప్పక ఉంచుకోవాలి. కాలేజీ అమ్మాయిలకు లిటిల్ బ్లాక్ డ్రెస్, వైట్ జంప్‌సూట్‌లు బాగుంటాయి. వీటిమీదకు స్టేట్‌మెంట్ జ్యూయెలరీ అదిరిపోతుంది. మరీ ఆధునికంగా వేసుకోలేం అనుకుంటే బ్లాక్ అనార్కలీనో, లాంగ్ గౌన్‌నో ఎంచుకుంటే సరి. ఈ సందర్భాలకు నలుపు రంగు చీరకు నప్పుతుంది.



సీక్విన్-గ్లిట్టర్ హంగులు : ఏ తరహా రంగు దుస్తులు ఎంచుకున్నా, వాటిమీదకు చమక్కుమనే ఎంబ్రాయిడరీ, సీక్విన్ల డిజైన్ ఉంటే చాలు. ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపించొచ్చు.

యాక్సెసరీలు: మీ అవుట్‌ఫిట్‌ని గోల్డ్, సిల్వర్ మెటాలిక్ వెయిస్ట్ బెల్ట్, స్లింగ్ బ్యాగ్, క్లచ్‌లు మరింత అందంగా కనిపించేలా చేస్తాయి.

ఇక, చెప్పుల విషయానికి వస్తే.. నలుపు, తెలుపు మాత్రమే కాదు, గ్లిట్టర్, మెటాలిక్ ఫినిషింగ్ ఉన్న ఎరుపు, గోల్డ్, న్యూడ్ కలర్ స్నీకర్స్, స్టిలెటోస్, వెడ్ రకాలు బాగుంటాయి. హైఫ్లాట్ పామ్ ఫ్లిప్‌ఫ్లాప్స్, బాలేరి యన్స్ కూడా మంచి ఎంపికే.

## ఆధ్యాత్మికం

# ధర్మం, న్యాయం



ధర్మం, న్యాయం అనేవి ఇంచుమించు ఒకే అర్థాన్ని ఇస్తాయి. ధర్మం నాలుగు పాదాలలో నడవాలి అనే మాట రామాయణంలో మనం చూస్తాం. నీకిది న్యాయమా అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ధర్మాన్ని కాపాడితే అదే నిన్ను కాపాడుతుంది. ఇక న్యాయం మాటకు వస్తే అన్యాయంగా ప్రవర్తించకు న్యాయంగా చెప్పు అనే మనం ఎవరికైనా చెబుతూ ఉంటాం. ఈ రెండు సమపాళ్లలో ఉండేది చాలా తక్కువ. ఒక్క శ్రీరాముని కాలంలోనే ధర్మం, న్యాయం అనేవి ఒకటి ఎక్కువ కాకుండ, మరొకటి తక్కువ కాకుండ ఉండటం చూస్తాం. అంటే శ్రీరాముని పరిపాలన అటువంటిది. శ్రీరాముడు రాజు పదవి చాలా పవిత్రమైనదిగా చూశాడు. అందుకే ధర్మం, న్యాయం చాలా సమంగా ఉండేవి. ఎక్కడా అధర్మం కాని, అన్యాయం కాని జరిగిన దాఖలాలు ఉండేవి కావు. శ్రీరాముడు తన వేగులను పిలిచి 'మీరు నలు దిక్కులకు వెళ్లి మా పాలనపై ప్రజల అభిప్రాయం, వారు ఏమంనుకుంటున్నారో నిక్కచ్చిగా మాతో చెప్పండి' అని వేగులను పంపించి వేశాడు. వాళ్లు నలు దిక్కులకు వెళ్లి సమాచారం సేకరించారు. ప్రభు మీ పాలన చాలా అద్భుతం అని కొనియాడారు అని చెప్పారు. ఒక వేగు మాత్రం ప్రభు అంటూ కన్లనీళ్లు పెట్టుకుని శ్రీరాముని పాదాలపై పడ్డాడు. శ్రీరాముడు ఆ వేగు వాలకం చూసి లేవనెత్తి 'నువ్వు విన్నది, కన్నది ఏ భయం లేకుండా చెప్పు' అన్నాడు. 'ప్రభూ! అంటూ అతను కన్నీళ్లు పెట్టుకుని ఒక చాకలి వాడు ధర్మం, న్యాయం ఎక్కడ ఉంది అంటూ ఆ వెర్రి రాముడు కనుక లంకలో ఉండిన సీతమ్మను ఏలుకున్నాడు అని బొంగురు గొంతుతో చెప్పాడు.

వెంటనే శ్రీరామునిలో మార్పు కలిగి ప్రజల అభిప్రాయం శిరసా వహించి ధర్మం, న్యాయం కోసం సీతమ్మ వారిని త్యజించాడు. నాటి పాలకులు ప్రజల అభిప్రాయాలు గౌరవించేవారు. ధర్మం, న్యాయం పాటించే వారిలో ముందు వరుసలో ఉండేది శ్రీరాముడు ఒక్కడే.

**- కనుమ ఎల్లారెడ్డి**

# అతిగా ఆలోచించవద్దు

కొంత మంది ప్రతి చిన్నవిషయాన్నీ భూతద్దంలో చూస్తూ అతిగా ఆలోచిస్తూ ఉంటారు. దీని వల్ల మానసిక ప్రశాంతత దెబ్బ తింటుంది. అనవసరమైన ఆలోచనలను దూరం చేసేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే.. మనసుకు నచ్చిన పనిచేస్తూ అందులో లీనమైతే అనవసరమైన ఆలోచనలు రావు. ఏదైనా హాబీ, సృజనాత్మక కార్యక్రమాలు, చేతి పనులు లాంటి వాటి మీదికి దృష్టి మరలిస్తే ఆందోళన అనేది ఉండదు. భయం, ఆందోళనలను మౌనంగా భరించకుండా స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో పంచుకుంటే ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.

ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు ధ్యానం చేస్తూ ఉంటే భావోద్వేగాలపై నియంత్రణ పెరుగుతుంది. ఆలోచనలు నిశ్చలంగా ఉంటాయి. ప్రతికూలంగా మాట్లాడుతూ నిరుత్సాహ పరిచేవారి నుంచి దూరంగా ఉండడం మంచిది. దీని వల్ల మానసిక ఆందోళన తగ్గుతుంది. మనసులోని భావాలను కాగితం మీద రాయడం అలవాటు చేసుకుంఏట భారమైన భావోద్వేగాలు బయటికి వ్యక్తమవుతాయి. మనసు తేలిక పడుతుంది.

ప్రకృతిని ఆస్వాదిస్తూ విహారయాత్రలకు వెళ్లడం వల్ల మనసు ఉపశమనం పొందుతుంది. కొత్త ప్రదేశాలు చూసినప్పుడు కలిగే అనుభూతులు ఆనందాన్నిస్తాయి.

## చెలి చిట్కాలు

**నకర్పూరం దగ్గుకు, కలరాకు బాగా పనిచేస్తుంది. ఉత్సాహం కలిగిస్తుంది. గుండెకు చైతన్యం కలిగిస్తుంది. గ్లాసు పాలల్లో గురువింద గింజంత కర్పూరం కరిగించి తాగితే గుండెకు మంచిది. దంతాల చిగుళ్లలో చీము, నొప్పి బాధలున్నవారు కర్పూరంతో పళ్లు తోముకుంటే బాధలన్నీ పోతాయి. కర్పూరం, ఆవనూనె కలిపి సూర్యరశ్మిలో వేడిచేసి కీళ్లనొప్పులున్నవారు, కండరాల నొప్పులు కలవారు, వెన్నునొప్పి, కాళ్లు సాగకపోవడం లాంటివి ఉన్నప్పుడు ఈ మిశ్రమాన్ని రాస్తే నొప్పులు తగ్గుతాయి.**



# కాబేజీతో వైద్యం!

'కాళ్లు వాచాయా? మోకాళ్ల నొప్పా.. అయితే క్యాబేజీ చుట్టేయండి.. సోషల్ మీడియాలో ఈ వీడియో తెగ వైరలవుతోంది. ఈ జపనీస్ చిట్కాతో మేం నొప్పి తగ్గించుకున్నామని కొందరంటే.. క్యాబేజీకి కాస్త మయనైజ్, ఉప్పు కారం కూడా చల్లండని జోక్ చేస్తున్నవారు మరికొందరు. మరి నిపుణులేమంటున్నారు? గంటలకొద్దీ నిల్చున్నప్పుడు పాదాలు వాయడం,కాల్షియం తగ్గాక కీళ్ల వద్ద నొప్పులు సహజమే కదూ! చిన్న చిట్కాతో వాటి నుంచి ఉపశమనం పొందొచ్చు అంటే ఎవరైనా ప్రయత్నించకుండా ఉంటారా? అందుకే ఈ 'క్యాబేజీ' చిట్కా వైరల్ అవుతోంది. దీనిలో క్యాబేజీ పొరను సమస్య ఉన్నచోట ఉంచి, వస్త్రం లేదా బ్యాండేజీతో పడిపోకుండా కడతారు.

ఈ ఆకుల్లో విటమిన్లు ఫైటో న్యూట్రియంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలెక్కువ. ఆకుల్ని మృదువుగా చపాతీ కర్రతో రుద్ది, కడితే ఇవన్నీ చర్మం ద్వారా శరీరంలోకి ఇంకి వాపు, నొప్పి తగ్గుతాయట. నిపుణులూ దీన్ని అంగీకరిస్తున్నారు. అయితే కట్టే ముందు వాటిని శుభ్రపరచడం మాత్రం తప్పని సరట. దీన్ని రోజులో నాలుగైదు సార్లు ప్రయత్నించొచ్చు అనీ చెబుతున్నారు.



ఎప్సమ్ సాల్ట్‌ను వేడినీటిలో వేసి వాటిలో పాదాలను ఉంచినా, సమస్య ఉన్నచోట యూకలిప్టస్, పెప్పర్‌మింట్, లావెండర్ వంటి నూనెలతో మర్దన చేసినా నొప్పి, ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతాయి. చల్లని లేదా వేడి నీటితో కాపడం పెట్టినా ఉపశమనం కలుగుతుంది అంటున్నారు నిపుణులు. అయితే చిట్కాలపైనే ఆధారపడక నిపుణులనీ కలవమంటున్నారు. పెద్ద సమస్య అయితే వెంటనే చికిత్స ప్రారంభించడంతోపాటు పాటించాల్సిన ఆహార నియమాలూ వ్యాయామాలనూ సూచిస్తారు అని సలహానిస్తున్నారు. అదండీ సంగతీ.. మరి మీరేం చేయాలనుకుంటున్నారు?

# కల్యాణకట్టలో మళ్లీ డబ్బులు డిమాండ్!

## - భక్తుల పుకార్లతో క్షురకుల ఆవేదన




**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడ...అనాదరక్షకా గోవిందా అంటూ తిరుమలకు వచ్చిన భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించడం ఆనవాయితీ. ఇక్కడ కల్యాణకట్టలో తలనీలాల సమర్పణకు భక్తులు పూర్తి ఉచితం. అయితే కొందరు క్షురకులు డబ్బులు అడిగారనే విషయం మంగళవారం మధ్యాహ్నం తిరుమలలో పుకార్లు హల్‌చల్ చేశాయి. ప్రధాన కల్యాణకట్టతోబాటు 12వరకు మినీకల్యాణకట్టలు ఉన్నాయి. ఇక్కడ మహిళా క్షురకులతోబాటు పురుష క్షురకులు సేవలందిస్తున్నారు. భక్తులు తమ తలనీలాలు సమర్పణకు కౌంటర్‌ల వద్ద రశీదు తీసుకుని బ్లేడ్‌ను ఉచితంగా అందుకుంటారు. ఈ నంబర్ల ప్రకారం క్షురకులు తలనీలాలు తీస్తారు. కల్యాణకట్టలో కొందరు భక్తుల నుండి వందరూపాయలు డిమాండ్ చేశారనేది సామాజిక మాధ్యమం వేదికగా ఆరోపణలు వెలుగుచూశాయి.

ఆ వీడియో చూసిన భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాదారణంగా భక్తులే కొందరు తలనీలాలు సమర్పించుకున్న తరువాత సంతోషంగా క్షురకులకు వారికి తోచిన డబ్బులు ఇస్తుంటారు. అలా కొందరు భక్తులు ఇచ్చిన దానిని అతస్యఆరోపణలు చేశారని క్షురకులు,క్షురకుల యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణకట్టలో సిసికెమెరాలు పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. టిటిడి ఉన్నతాధికారులు వేసవి సెలవుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సి ఉందని భక్తులు కోరు తున్నా రు. సాధారణంగా ప్రతిరోజూ 25వేల మంది నుండి 30వేలమంది వరకు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నట్లు టిటిడి సమాచారం. కొందరు క్షురకులు భక్తుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# లిక్కర్ స్కాంపై నేను విజిల్ బ్లోయర్‌ను: విజయసాయిరెడ్డి

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో తన పాత్ర విజిల్ బ్లోయర్‌లాంటిదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎక్స్(శ్రీ)లో ఆయన పోస్ట్ చేశారు. తప్పించుకునేందుకే దొరికిన దొంగలు, దొరకని దొంగలు నా పేరుని లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అవినీతిలో ఏ రూపాయీ తాను ముట్టలేదని తెలిపారు. లిక్కర్ దొంగల దుస్తులు సగమే విప్పారని కానీ వారి మిగతా దుస్తులు విప్పేందుకు పూర్తిగా తాను సహకరిస్తానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో పాత్రధారి, సూత్రధారి కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డేనని ఇటీవల విజయసాయిరెడ్డి చెప్పిన సంగతి తెలిసిందే.

మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ రాజ్ కెసిరెడ్డేనని దీనికి సంబంధించి చెప్పాల్సి వస్తే మరిన్ని వివరాలు భవిష్యత్తులో వెల్లడిస్తానని ఆయన చెప్పారు.

ఈ కేసులో నిన్న (సోమవారం) కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే సీనియర్ పిఆర్ఐ కరుణాకర్ సేవలు మరువలేనివి

## రైల్వే సిపిఆర్ఓ కార్యాలయంలో సంతాప సభలో వక్తలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 22,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌స్పెక్టర్ బి కరుణాకర్ సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఆయన గత సోమవారం కార్డియాక్ అరెస్టుతో గుండెపోటుకు గురైహఠాత్ మరణం గావించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రైల్వే సిపిఆర్ఓ కార్యాలయంలో విషాద వదనాల మధ్య జరిగిన సంతాపసభలో పలువురు ఉన్నతాధికారులు,సహచరులు, జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో రైల్వే ఉన్నతాధికారులు శ్రీధర్ రాకేష్,షకీల్ అహ్మద్,అనిల్ కుమార్,రాజేష్ పలువురు సహచరులు వేదనాభరత హృదయంతో మాట్లాడుతూ కరుణాకర్ గత కొన్నేళ్లుగా రైల్వే పౌర సంబంధాల విభాగానికి డిప్యూటేషన్‌పై వచ్చారని, వ్యక్తిగతంగా సౌమ్యుడు, మృదుస్వభావి అయిన కరుణాకర్ ఎల్లవేళల సహచరులతో సన్నిహితంగా ఉంటూ రైల్వే యాజమాన్యం,మీడియా మధ్య అనుసంధానకర్తగా బాధ్యతలు నిర్వహిస్తూ సమన్వయకర్తగా వ్యవహరించేవారన్నారు. ఎప్పుడు ఎలాంటి సమయంలో అయిన మీడియా ప్రతినిధుల సందేహాలను విసుగించుకోకుండ నివృత్తి చేసేవారన్నారు. కరుణాకర్ మృతి పట్ల రైల్వే పౌరసంబంధాల విభాగం సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్,నాగరాజు,షర్మిల,నుశ్రత్,హేమంత్ పలువురు జర్నలిస్టులు,కార్మిక సంఘాల నాయకులు తదితరులు మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# సిఎం జిల్లాలో జనాదరణ కోల్పోతున్న ఎమ్మెల్యేలు!

## - పదినెలల్లోనే కొందరి తీరుపై వ్యతిరేకత!

**తిరుపతి,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత ఉమ్మడి చిత్తూరుజిల్లాలో సొంత పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేల తీరుపై జనంలో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేల జనాదరణ గ్రాఫ్ కూడా తగ్గిపోయిందని ఇటీవల టిడిపిరాష్ట్రవ్యాప్తంగా చేయించిన సర్వే నివేదికలు కూడా వెల్లడించడం విశేషం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 13మంది టిడిపి ఎమ్మెల్యేల్లో తిరుపతి నియోజకవర్గం ఎమ్మెల్యే జనసేన పార్టీకి చెందిన వ్యక్తి. ఇక 11మంది ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అనుకున్న స్థాయిలో పనితీరు లేదనేది పార్టీ అధిష్టానానికి అందిన నివేదికలు. 11మంది అధికారపార్టీల ఎమ్మెల్యేల్లో ఏడుగురు వరకు ఎమ్మెల్యేల వ్యవహారం వారివారి సొంత పనులు చక్కబెట్టుకోవడం, రకరకాల వ్యాపారాలు చేసుకోవడంలో బిజీఅయ్యారనేది సమాచారం.పార్టీ నేతలకుగానీ, కార్యకర్తలకు కూడా అందుబాటులో లేరనేది నియోజకవర్గాల్లో ప్రజల నుండి వ్యక్తమవుతున్న విమర్శలు. ప్రజలనుండి ఎమ్మెల్యేల పనితీరుపై సదభిప్రాయం లేదనే వ్యాఖ్యలు ఉన్నాయి. పదినెలలపాలనకే వారి పరిస్థితి ఇలా దారుణంగా తయారైందని, రానున్న నాలుగేళ్ళు నియోజకవర్గాల్లో ఏమేరకు ప్రజలకు అందుబాటులో ఉండి మళ్ళీ ఎన్నికల్లో ఓటు అడుగుతారనేది అనుమానమే. కుప్పం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తుండగా నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పలమనేరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. తిరుపతిలో జనసేనపార్టీ ఎమ్మెల్యే. వీరిలో ఆరేడుగురు ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతలేగాక కార్యకర్తలు చివరకు నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆ స్థాయిలో వ్యతిరేకత మొదలైందంటే కారణాలను సిఎం చంద్రబాబు సర్వేలతో నివేదిక రాబట్టారు. చాలావరకు జిల్లాలో తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే ఎక్కువగా ఉన్నారు. పాలనపై పట్టు, నియోజకవర్గాల్లో జనాదరణ కలిగిఉండాల్సింది పోయి ఎమ్మెల్యేలు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో జోక్యం చేసుకోవడం, ఖాళీస్థలాలు పై అనుచరులతో పాగా వేయించడం, ఇసుక మద్యం వ్యాపారాలపై దృష్టి ఉంచారనేది ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే సమయంలో పాలనపై పూర్తిస్థాయిలో పట్టుసాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్ళడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించడం వంటివాటిపై దృష్టి పెట్టారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై ఇప్పటికే నివేదికల రూపంలో అందిన సమాచారాన్ని సిఎం ప్రాతిపదికగా తీసుకుని జనంలోనే వుండాలని, జనం సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి బుధవారం ప్రజాదర్బార్ పేరుతో వినతులు స్వీకరించాలని స్పష్టంగా ఆదేశించారు. జనంలోనే ఉండాలని కూడా నిర్దేశం చేశారు. అయినా సొంత జిల్లాలోనే ఎక్కువమంది ఎమ్మెల్యేల పనితీరుపై, జనాదరణ లేకపోవడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చిన సందర్భాలు ఉన్నాయని పార్టీలో సీనియర్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.పనితీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో సీట్లు కష్టమని కూడా బాబు హెచ్చరించారు. ఇప్పటికీ చాలావరకు ఎమ్మెల్యేలు చుట్టపుచూపుగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటునాన్నరనేది కూడా సిఎంకు అందిన సర్వే రిపోర్ట్‌లో విస్తుబోయే అంశాలు.

మరీ ఇదే నేపథ్యంలో మేనెలలో జరగనున్న పార్టీ మహానాడులో ఎమ్మెల్యేల జాతకాలు ఆధారంగా సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకుని కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులు ఇచ్చేందుకు అధినేత బాబు సుముఖతగా ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

పార్టీలో క్రియాశీలక పదవుల పదవీకాలం కూడా ముగిసింది. వచ్చేనెలలో మహానాడులోనే మళ్ళీ క్రియాశీలక ఎన్నికలు జరిపి పదవులు కేటాయింపు ఉంటుంది. ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకుంటే ఆయా చోట్ల మాజీఎమ్మెల్యేలకు,సీనియర్ నాయకులకు పెత్తనం ఇచ్చేందుకు కూడా పార్టీ సిద్ధమైందనేది విశ్లేషకుల అభిప్రాయం.

# నీటి తొట్టెల నిర్మాణాన్ని నెలాఖరులోగా పూర్తి చేస్తాం

## పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్ కృష్ణతేజ



**విజయవాడ, ఏప్రిల్22, ప్రభాత వార్తప్రతినిధి :** ఉపాధి హామీ పథకంలో పశువుల కోసం చేపట్టిన 15 వేల నీటి తొట్టెల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణతేజ తెలిపారు. ఇప్పటి వరకూ 12 వేల తొట్టెల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.45 వేల వ్యయంతో పశు సంవర్ధకశాఖ గుర్తించి ప్రదేశాల్లో 15 వేల తొట్టెల నిర్మాణం ఉపాధి హామీ పథకంలో చేపట్టినట్లు తెలిపారు. ఒక్కో తొట్టె 3 వేల లీటర్ల పరిమాణం కలిగి ఉందన్నారు. వీటివల్ల 15 లక్షల మూగ జీవాలకు తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. వీటి నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటిన ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధి పథకంలో వ్యవసాయ అనుబంధ పనుల్లో భాగంగా ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

# సివిల్స్‌కు ఎంపికైన రైల్వే రత్నం ధనుష్

## - జాతీయ స్థాయిలో 232వ ర్యాంకు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 22,ప్రభాతవార్త** కేంద్ర యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మంగళవారం విడుదల చేసిన యుపిఎస్‌సి-2024తుది పరీక్షా ఫలితాల్లో రైల్వే అధికారిణి కుమారుడు పూల ధనూష్ జాతీయ స్థాయిలో 232వ ర్యాంకు సాధించి సివిల్స్ గ్రూపు-ఎ క్యాడర్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఆడిట్ అధికారిణిగా పనిచేస్తున్న జి నాగమణీ, తెలంగాణలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పూల శ్రీనివాసులు దంపతుల కుమారుడైన ధనూష్ 1997అక్టోబరు 9న గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో జన్మించాడు. తల్లిదండ్రులు స్థానిక వివినగర్‌లో నివాసం ఉండగా తల్లి రైల్వే అధికారిణి కావడంతో సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ధనూష్ విద్యాభ్యాసం హైదరాబాదులో జరిగింది. హైదరాబాద్ జెయన్‌టియు విశ్వవిద్యాలయం నుండి ఇసిఇ బ్రాంచిలో బిటెక్ చేసిన ధనూష్, స్వతహాగా చిన్నప్పటి నుంచి మానవత్వం, సేవాదృక్పదం గల స్వభావి, వన్యప్రాణులంటే అమితంగా ఇష్టపడే వ్యక్తిత్వం, 2021,2022లో వరుసగా యూపిఎస్‌సి ప్రిలిమ్స్‌కు ఎంపికైన,మంగళవారం యుపిఎస్‌సి విడుదల చేసిన 2023లో జరిగిన సివిల్స్ తుది పరీక్ష ఫలితాల్లో ప్రిలిమ్స్,మెయిన్స్,ఇంటర్వ్యూలలో జాతీయ స్థాయిలో 480వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్ గ్రూప్-ఎ క్యాడర్‌కు ఎంపికయ్యాడు.

# వైకాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీకి రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీకి మళ్లీ నిరాశే ఎదురైంది. ఆయన రిమాండ్‌ను ఎస్సీ, ఎస్‌టీ కోర్టు మరోసారి పొడిగించింది. మే 6 వరకు వంశీ రిమాండ్‌ను పొడిగించింది.

ఈ కేసులో నేటితో ఆయన రిమాండ్ ముగుస్తుండటంతో వంశీ కస్టడీని మరోసారి పొడిగించాలంటూ పోలీసుల తరఫు న్యాయవాది కోర్టులో తమ వాదనలను బలంగా వినిపించారు. దీంతో వల్లభనేని వంశీతో పాటు మరో నలుగురు నిందితులకు ఎస్సీ, ఎస్‌టీ స్పెషల్ కోర్టు మే 6వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ తీర్పునిచ్చింది. ఈ కేసులో వంశీ రిమాండ్ ఖైదీగా విజయవాడ జిల్లా జైలు రిమాండ్‌లో ఉన్నారు.

# కోల్‌కతాకు ప్లే ఆఫ్స్ ఆశలు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025 ప్లేఆఫ్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) భారీ అంచనాలు పెట్టుకుంది. దాదాపు అన్ని జట్ల మధ్య ప్లేఆఫ్స్ రేసు చాలా హోరాహోరీగా సాగుతోంది. ప్రతి జట్టు తమ స్థానాన్ని పదిలపరుచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కెకెఆర్ ఇప్పటికే 8 మ్యాచ్‌లు ఆడి అందులో 5 ఓటములు మూట గట్టుకున్నా ఇంకా ప్లే ఆఫ్ ఆశలు సజీవంగానే ఉన్నాయి. దీనికి అర్హత సాధించాలంటే మిగిలిన 6 మ్యాచ్‌లలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చాలి. ఇందులో కనీసం 5 విజయాలు సాధించడంతో పాటు, తమ నెట్ రన్ రేట్‌ను కూడా మెరుగు పరచుకోవాలి. దీంతో పాటు, ఇతర జట్ల ఫలితాలు కూడా కెకెఆర్ ప్లే ఆఫ్స్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే టోర్నమెంట్‌లో సగం మ్యాచ్‌లు ముగిసిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో

## 3 గెలుపులు 5 ఓటములు అయినా ఛాన్స్!

కోల్‌కతా ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 7వ స్థానంలో ఉంది. కేకఆర్ ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 3 విజయాలు, 5 ఓటములతో 6 పాయింట్లు సాధించింది. మరోవైపు గుజరాత్ టైటాన్స్ 12 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లు 10 పాయింట్లతో కెకెఆర్ కంటే ముందున్నాయి. ముంబై ఇండియన్స్ కూడా 8 పాయింట్లతో కెకెఆర్ కంటే కొంచెం మెరుగైన స్థానంలో ఉంది.

రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లు కూడా కెకెఆర్‌తో పోటీ పడుతున్నప్పటికీ, ఆ జట్ల స్థానాలు కూడా అంత ఆశాజనకంగా లేవు. ఈ పరిస్థితుల్లో కెకెఆర్ మిగిలినమ్యాచ్‌లలో తనసత్తాను చాటాల్సి ఉంటుంది. కోల్‌కతా ఇంకా ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లన్నీ కెకెఆర్‌కు చాలా కీలకం. ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారానే కోల్‌కతా ప్లేఆఫ్స్ రేసులో నిలవగలదు. ప్రత్యర్థుల బలాబలాలను బట్టి కెకెఆర్ తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కోల్‌కతా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే మిగిలిన ఆరు మ్యాచ్‌లలో తప్పక గెలవాల్సిందే. సాధారణంగా, ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడానికి ఒక జట్టుకు కనీసం 16 పాయింట్లు (8 విజయాలు) అవసరం. కెకెఆర్ ఇప్పటికే 8 మ్యాచ్‌లలో 3 విజయాలు సాధించింది. ఈ ప్రకారం మిగిలిన 6 మ్యాచ్‌లలో కనీసం 5 మ్యాచ్‌లు గెలవాల్సి ఉంటుంది. ఒకవేళ కెకెఆర్ 4 మ్యాచ్‌లు గెలిస్తే, అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి.

అయితే, కొద్దిగా అవకాశం కూడా ఉంటుంది. అది ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. కెకెఆర్ ప్లేఆఫ్స్ అవకాశాలు కేవలం ఆ జట్టు ప్రదర్శనపై మాత్రమే ఆధారపడి ఉండవు. పాయింట్ల పట్టికలో ముందున్న ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లు తమ మిగిలిన మ్యాచ్‌లలో ఎలా రాణిస్తాయనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ జట్లు కొన్ని మ్యాచ్‌లలో ఓడిపోతే, కేకేఆర్‌కు ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే, ముంబై ఇండియన్స్ వంటి ఇతర జట్లు కూడా తక్కువ మ్యాచ్‌లు గెలిస్తే కేకేఆర్‌కు లాభం చేకూరుతుంది. ఇవన్నీ జరిగితేనే నిస్సందేహంగా కోల్‌కతా ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకుంటుంది..



జస్ప్రిత్ బుమ్రా



స్మృతి మంధన

## బుమ్రాకు అరుదైన గౌరవం

### క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్‌కు ఎంపిక

### మహిళల్లో స్మృతికి దక్కిన అవార్డు

**న్యూఢిల్లీ:** టీమిండియా పేసు గుర్రం జస్ప్రిత్ బుమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. 2024 సంవత్సరానికి గాను విజ్డెన్ మెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డుకు ఎంపిక కాగా, విజ్డెన్ ఉమెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డుకు భారత్ స్టార్ బ్యాటర్ స్మృతి మంధనకు లభించింది. ఇక గత ఏడాది ఫార్మాట్లకు అతీతంగా అత్యుత్తమ ప్రదర్శన కనపరచినందుకు గాను బుమ్రాకు ఈ గౌరవం దక్కింది. 2024లో బుమ్రా మూడు ఫార్మాట్లలో 86 వికెట్లు (21 మ్యాచ్‌ల్లో 13 సగటున) తీసి లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అంతేకాకుండా గత ఏడాది బుమ్రా టెస్టుల్లో విశేషంగా రాణించి అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఫలితంగా అతను ఐసిసి క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, ఐసిసి టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, బిసిసిఐ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు గెలుచుకున్నాడు. అలాగే గత ఏడాది టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించిన బుమ్రా భారత్‌కు టైటిల్‌ను అందించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ మెగా టోర్నీలో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డుతో పాటు, రెండు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను గెలుచుకున్నాడు. తాజాగా విజ్డెన్ మెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డు గెలవడంతో బుమ్రా భారత్ దిగ్గజ క్రికెటర్ల సరసన చేరాడు. గతంలో విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ మాత్రమే ఈ అవార్డును గెలుచుకున్నారు. వీరిలో కోహ్లీ అత్యధికంగా 3 సార్లు ఈ అవార్డును గెలుచుకోగా, సెహ్వాగ్ 2, సచిన్ ఓసారి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా 2024 సంవత్సరానికి గాను విజ్డెన్ ఉమెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డును భారత్ స్టార్ స్మృతి మందాన దక్కించుకుంది. స్మృతి గత ఏడాది మూడు ఫార్మాట్లలో విశేషంగా రాణించి రికార్డు స్థాయిలో 1,659 పరుగులు చేసింది. మహిళల క్రికెట్‌లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో ఇన్ని పరుగులు ఎవరూ చేయలేదు. గత ఏడాది స్మృతి నాలుగు వన్డే శతకాలు, ఓ టెస్ట్ సెంచరీ సాధించింది.

## రాజస్థాన్ రాయల్స్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 సీజన్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం రేపుతోంది. రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఈ నెల 19న జరిగిన జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. కాగా ఈ మ్యాచ్ ఫిక్సైంది అంటూ ఆరోపణలు వస్తున్నాయి. రాజస్థాన్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సిఎ) తాత్కాలిక కన్వీనర్ జైదీప్ బిహాని ఆరోపించారు. విజయం ఖాయమనుకున్న మ్యాచ్‌లో ఆర్ఆర్ ఎలా ఓడిపోయిందంటూ ప్రశ్నించారు. వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌సిఎకు రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీని ఐదోసారి పొడిగించారన్నారు. ఆర్‌సిఎ ఆధ్వర్యంలో జరిగే అన్ని మ్యాచ్‌లు ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహిస్తున్నాం. అయితే ఐపిఎల్‌కు వచ్చే సరికి జిల్లా పరిషత్ బాధ్యతలు తీసుకుంటుందని, ఐపిఎల్ నిర్వహణ కోసం ఆర్‌సిఎకు మాత్రమే బిసిసిఐ లేఖ పంపించిందన్నారు. కానీ సవాయి మాన్సింగ్ స్టేడియం నుంచి మాకు ఎంఒయూ లేదని రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ చెబుతోంది. ఏంఒయూ లేకపోతేనేం ప్రతీ మ్యాచ్‌కు జిల్లా పరిషత్‌కు రెంట్ చెల్లిస్తున్నారు కదా అని జైదీప్ ప్రశ్నించారు.

## ఇండియా బ్యాడ్మింటన్ టీముకు..

## సాత్విక్-చిరాగ్ జోడీ దూరం



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్ ముంగిట ఇండియా బ్యాడ్మింటన్ టీముకు షాక్ తగిలింది. భారత్ డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయి రాజ్- చిరాగ్ శెట్టి అనారోగ్యం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ప్రకటించింది. ఈ నెల 27 నుంచి మే 4 వరకు చైనా లోని షియామెన్లో జరగనున్న ఈ మిక్స్డ్ టీమ్ ఛాంపియన్‌షిప్ ఇండియా అవకాశాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అయితే సాత్విక్- చిరాగ్ స్థానంలో జట్టులో ఎవ్వరినీ చేర్చలేదని బాయ్ తెలిపింది. దాంతో హరిహరణ్-రూబన్ కుమార్ జోడీ మెన్స్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించనుంది. కాగా, గాయాల కారణంగా ఇప్పటికే విమెన్స్ జంట పుల్లెలగాయత్రి-ట్రీసా జాలీ ఈ టోర్నీకి దూరంగా ఉంటోంది. ఓవరాల్ వరల్డ్ ర్యాంక్‌తో ఈ టోర్నీకి క్వాలిఫైఅయిన ఇండియా కఠినమైన గ్రూప్-డిలో మాజీ చాంపియన్ ఇండోనేసియా, రెండు సార్లు రన్నరప్ డెన్మార్క్, బలమైన ఇంగ్లండ్‌తో బరిలోకి దిగనుంది.

## మొక్కుబడిగా పాకిస్థాన్ సూపర్ లీగ్

### చెప్పుకోదగ్గ ప్రదర్శనే కరువు



**న్యూఢిల్లీ:** భారత్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)కు పోటీగా దాయాది పాక్ తమ దేశంలో నిర్వహిస్తున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) మొక్కుబడిగా సాగుతోంది. ఈ లీగ్‌లో ఇప్పటి వరకూ చెప్పుకో దగ్గ ఒక్క మ్యాచ్ ప్రదర్శన కూడా లేకపోవడం విశేషం. ఆటగాళ్ల మెరుపులు, విధ్వంశాలు లేకుండానే దాయాది లీగ్ చప్పగా జరుగుతోంది. లీగ్ సీజన్‌లో ఊహించని దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే పాకిస్థాన్ అభిమానులు ఇప్పుడు స్టేడియాలకు రావడం లేదు. పేషావర్ జల్మీ, కరాచీ కింగ్స్ మధ్య జరిగిన 11వ మ్యాచ్‌కు కరాచీలోని నేషనల్ స్టేడియం పూర్తిగా ఖాళీగా దర్శనమిచ్చింది. మైదానంలో అభిమానుల కంటే భద్రతా సిబ్బంది ఎక్కువగా ఉండటం గమనార్హం. పాకిస్థాన్ క్రికెట్ అభిమానులు క్రీడకు దూరమవుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 11న మొదలైన పిఎఎస్ఎల్ ఇప్పటికి 11 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇందులో కేవలం ఒకే ఒక మ్యాచ్ ఒకింత ఆసక్తికరంగా సాగింది. ఈ నెల 12న జరిగిన సీజన్ మూడో మ్యాచ్‌లో ముల్తాన్ సుల్తాన నిర్దేశించిన 235 పరుగుల భారీ లక్ష్యాన్ని కరాచీ కింగ్స్ ఛేదించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు మహ్మద్ రిజ్వాన్, జేమ్స్ విన్స్ ఇద్దరూ తలో సెంచరీ నమోదు చేశారు. ఈనెల 14న జరిగిన సీజన్ ఐదో మ్యాచ్ కూడా కాస్త ఫర్వాలేదనిపించినప్పటికీ ఆ మ్యాచ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఆ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇస్లామాబాద్ యునైటెడ్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ సూపర్ సెంచరీతో మెరిశాడు. అనంతరం పెషావర్ జల్మీ 244 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ 141పరుగలకే కుప్పకూలింది. ఈ రెండు మినహా మిగిలిన 8 మ్యాచ్‌లను చూసేందుకు అభిమానులు సైతం కరువయ్యారు.

# వాణిజ్యం

## అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి!




**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూఢిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చలో ఇ-కామర్స్ అంశం కూడా వచ్చింది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఇ-కామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ, ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసు కొంటాం అని పేర్కొన్నారు. వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఇ-కామర్స్ కంపెనీ లకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలి సిందే. భారత్‌లో ఫ్రైస్‌ఓపెన్ విధానం అమలు చేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు. భారత్ లో విదేశీ ఇ-కామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారు చేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడా నికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారుచేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానేపోలుస్తుంది. 2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదు ర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఇ- కామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి.

## మైనర్లకు ఆర్‌బిఐ గుడ్‌న్యూస్..

**ముంబై, ఏప్రిల్ 22:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోని అన్ని బ్యాంకులకు ఒక ముఖ్యమైన ఆర్డర్ జారీ చేసింది. దీంతో ఇప్పుడు 10 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలు సొంతంగా సేవింగ్స్ అకౌంట్ అండ్ ఫిక్స్డ్ డిపాజిట్‌ను ఓపెన్ చేయవచ్చు అలాగే అతను/ఆమె తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి సహాయం లేకుండానే అకౌంట్ స్వయంగా మెయింటేన్ చేయవచ్చు. ఇంతకుముందు ఎప్డిలు తీసుకోవచ్చు. దీనికి సంబంధించి అన్ని వాణిజ్య బ్యాంకులు అలాగే సహకార బ్యాంకులకు ఒక సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ఆర్‌బిఐ ఈ సమాచారాన్ని అందించింది. ఏ వయసు వారైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ద్వారా అకౌంట్ తెరవవచ్చని, కానీ 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే వాళ్లే స్వయంగా అకౌంట్ ఓపెన్ చేయవచ్చని అందులో పేర్కొంది. అంతేకాదు అతను/ఆమె తల్లిని సంరక్షకురాలిగా చేయడం ద్వారా కూడా అకౌంట్ తెరవవచ్చు. పిల్లల వయస్సు 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే అతను/ఆమె సొంతంగా సేవింగ్స్ ఇంకా టర్మ్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు, నిర్వహించవచ్చు. ..అలాగే పిల్లలు ఎంత డబ్బు జమ చేయాలో, ఎంత వరకు విత్ డ్రా చేసుకోవచ్చో బ్యాంకులు నిర్ణయిస్తాయి. ఇదంతా బ్యాంకు రిస్క్ మేనేజ్‌మెంట్ విధానంపై ఆధారపడి ఉంటుంది. ఈ మైనర్లకు 18 సంవత్సరాలు నిండిన తరువాత బ్యాంకు మళ్ళీ అతను/ఆమె నుండి కొత్తగా సంతకం అండ్ అకౌంట్ మెయింటెనెన్స్ పద్ధతిని తీసుకుంటుంది. పిల్లలకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, తిగిలీ/డెబిట్ కార్డ్, చెక్ బుక్ వంటి సౌకర్యాలు ఇవ్వాలా వద్దా అనేది బ్యాంకులు సొంతంగా నిర్ణయించుకోవచ్చు. పిల్లలకి ఇలాంటి అకౌంట్ తెరవడానికి తల్లిదండ్రులు, చట్టపరమైన సంరక్షకుడు అవసరం, కానీ ఇప్పుడు 10 సంవత్సరాల వయస్సు తర్వాత సొంతంగా బ్యాంకుల్లో అకౌంట్ ఇంకా




## మహీంద్రా ఆటోకు కొత్త చీఫ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** మహీంద్రా ఆటో తన కొత్త అధ్యక్షుడిగా ఆర్ వేలుసామిని నియమిస్తున్నట్లు ప్రకటిం చింది. ప్రస్తుతం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడిగా ఉన్న వేలుసామి, వీజయ్ నక్రా స్థానంలో తన కొత్త పదవిని చేపడతారు. 1996లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరిన వేలుసామి, వివిధ స్థాయిలలో కీలక పదవులను చేపట్టారు. ఐసిఇ వాహా నాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఆయన ప్రధాన పాత్ర పోషిం చారు. మహీంద్రా ఆటో అధ్యక్షుడిగా వేలుసామి లాభ,నష్టాలు, డెలివరీతో సహా కంపెనీ ఆటోమో టివ్ కార్యకలాపాలకు పూర్తి బాధ్యత ఉంటుంది. వ్యవసాయ పరికరాల రంగానికి ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్ సిక్కాను దాని బోర్డు మహీంద్రా లాజి స్టిక్స్ లిమిటెడ్ మేనే జింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒగా నియమించింది. మునుపటి సిఇఒ రామ్ స్వామినాథన్ పదవీ విరమణ చేసి కొత్త వృత్తిపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.